







తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ,
హైదరాబాదు

సహ పాఠ్యాంశాలు



# విలువల విద్య - జీవన నైపుణ్యాలు



## 5 వ తరగతి












రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## వాచకం, ఉపాధ్యాయ కరదీపిక

## 5వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

తెలంగాణ, హైదరాబాదు.

# ముందుమాట

మానవులు సంఘజీవులు. తమ మనుగడకోసం అవసరమైన సమాజాన్ని నిర్మించుకొన్నారు. ఈ వ్యవస్థ నిర్వహణకు, కలిసికట్టుగా మనుగడ సాధించడానికి, అభివృద్ధి పొందడానికి సరైన అవగాహన, విశ్వసనీయతలు అవసరం. దీనికి సమిష్టితత్వం, పరస్పరాధారిత భావాలు కూడా అవసరం. కాబట్టి మానవ సమాజాలకు జనమెరిగిన ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి అవసరం. మనం కోరుకొన్న విధంగా మనం ప్రవర్తించలేం. ప్రతి సమాజానికీ దానికి అనుగుణమైన నైతిక నియమావళి ఉంటుంది. ఈ నైతిక నియమాల బహుళత్వానికి కూడా అంతర్లీనంగా కొన్ని ఆమోదిత ఉమ్మడి నియమాలు ఉంటాయి.

నీతిసూత్రాలు మన నడవడికి మార్గదర్శకంగా ఉండే నియమాలు. కాబట్టి పిల్లలుకూడా వాటిని ఆకళింపుచేసుకోవాలి. నైతికాభివృద్ధి అంటే కొన్ని నిబంధనలను అనుసరించడమో లేక ఎవరో ఏర్పరిచిన ఆదర్శ నమూనాల ప్రకారం నడుచుకోవడం మాత్రమేకాదు. నైతికాభివృద్ధి అంటే ప్రతి సందర్భంలోనూ సరైన కారణాన్ని తెల్సుకోగలగడం, విచక్షణతో నిర్ణయాన్ని తీసుకొని దాని ప్రకారం నడుచుకోగల సామర్థ్యం కలిగి ఉండడం. నైతిక చైతన్య అభివృద్ధిలో తాను తీసుకోబోయే నిర్ణయంతో తాను స్థిరంగా ప్రశాంతంగా ఉండగలిగే సామర్థ్యంకూడా ఉంటుంది. "అది నాకలాగే చెప్పారు. కాబట్టి నేను చేస్తున్నాను" అనే భావనకు ఇది విరుద్ధం. అందుచేత ఒక వ్యక్తి తనకు తాను శాంతి సౌఖ్యాలతో, ప్రశాంతంగా, స్థిరంగా ఉండడమే నైతికాభివృద్ధి సారాంశం. ఇందుకవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండడమే జీవననైపుణ్యాలు. వీటిలో సమస్యను పరిష్కరించుకోవడం కలిసి పనిచేయడం, భావప్రసారంచేయడం, నాయకత్వం వహించడం, ఇతరులతో పరస్పర సంబంధాలను కల్గి ఉండడం వంటివి ముఖ్యమైనవి.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు పతనమౌతున్నాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. మనలో స్వార్థం పెరగడం, దురాశ పెరగడం, అవినీతికి అలవాటుపడడం, నైతిక నియమావళిని ఉల్లంఘించడం, లోభత్వం పెరగడం, నేను నాది వంటి అవలక్షణాలవల్ల వ్యక్తులు తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోవడంతోపాటు సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో అశాంతి పెరిగింది. నైతిక విలువల పతనంతోపాటు, పెరిగిపోతున్న ఒత్తిడిని, కనుమరుగౌతున్న మానవతా విలువలు, మానవసంబంధాలను గమనించవచ్చు. ఇవన్నీ ఒకరోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చినవి కావు. మన జీవితాలలో సంయమనం, సమతుల్యత, విచక్షణ లోపించడమే దీనికి కారణం. వాటి స్థానంలో దురాశ, వినిమయవాదం, దోపిడీలు చోటుచేసుకొంటున్నాయి. వాటి నికర ఫలితమే సమాజంలోని అభద్రతాభావం, అపనమ్మకం, విచ్ఛిన్నమైన కుటుంబవ్యవస్థ, విలువల పతనం, సమాజంలో అశాంతి వ్యాపించడం మొదలగునవి.

వీటిని అరికట్టడానికి విద్యను ఒక సాధనంగా భావించి మనం విలువల విద్య, జీవననైపుణ్యాలు అనే అంశాన్ని ఒక ప్రధాన సబ్జెక్టుగా పాఠశాల విద్యలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశపెట్టడం ద్వారా పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందుతారు. ఉన్నతమైన విలువలు, వైఖరులు, త్యాగబుద్ధి కలిగి ఉండి సమాజంపట్ల, పర్యావరణంపట్ల, తోటివారిపట్ల సమన్యాయంతో ప్రతిస్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను (Syllabys) రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ రూపొందించింది. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించడం చేయగలగాలని రాష్ట్ర

విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011లోని రాష్ట్ర దృక్పథం (State Vision)లో పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో 1 నుండి 10వ తరగతి వరకు విలువల విద్య, జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళిక రూపొందించారు. అనంతరం తరగతి వారీగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకోసం ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పెంపొందించాల్సిన 18 ప్రధాన విలువలను గుర్తించి ప్రతి తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. అవి, 1) స్వేచ్ఛ, 2) సంతృప్తిగా జీవించడం, 3) శీలనిర్మాణం, 4) జీవన నైపుణ్యాలు, 5) బాధ్యతవహించడం, 6) పొదుపుచేయడం, 7) ఆరోగ్యవిలువలు, 8) సంస్కృతి సంప్రదాయలపట్ల గౌరవం, 9) ఆరోగ్య విలువలు, 10) శాస్త్రీయదృక్పథం, 11) న్యాయం, 12) శాంతి, కలిసిమెలిసి జీవించడం, 12) శ్రమవిలువ, 14) సేవాభావం, 15) సమానత్వం, సోదరభావం, స్త్రీలపట్ల గౌరవం, 16) జాతీయ భావన – దేశభక్తి, 17) లౌకికతత్త్వం – మతసామరస్యం, 18) ప్రజాస్వామ్య విలువలపట్ల గౌరవం. వీటిలో ప్రాథమికస్థాయికి 12 ప్రధాన విలువలు, ఉన్నతస్థాయికి మొత్తం 18 విలువల ఆధారంగా ఒక్కొక్క విలువకు తరగతివారీగా ఉపవిలువలను నిర్ధారించి పాఠాలను పొందుపర్చారు.

విలువలు ప్రధానంగా బోధిస్తే వచ్చేవికావు. ఆచరిస్తే వచ్చేవి. కాబట్టి తరగతి వారీగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికల్లో సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా చర్చించడం, ఆచరించి అనుభవాలు చెప్పడం వంటి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉన్నాయి. చర్చల ద్వారా వైఖరి నిర్మాణం జరగాలి. ఆచరణ ద్వారా ప్రవర్తనలో మార్పురావాలని ఆశించి పాఠాలను పొందుపరచారు. వీటిని నిర్వహించడం మన బాధ్యత. నిర్వహణ తీరుతెన్నులను గురించి "ఉపాధ్యాయులకు సూచనలు" కూడా చేర్చారు. అట్లే విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి.

ఎంత మంచి కరదీపికైనా ఉపాధ్యాయుడికి ధీటుగాదు. ఉపాధ్యాయుడు తాను ఆదర్శంగా ఉంటూ విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రణాళికాబద్ధంగా తరగతి వారీగా రూపొందించిన కరదీపికల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. మన రాజ్యాంగం పీఠికలో పేర్కొన్నవిధంగా ఉన్నతమైన విలువలు, వైఖరులుకల్గిన హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులుగా మనమంతా కృషిచేయాలి. ఈ కరదీపికలోని అంశాలు మీకు కొంతమేరకు దిశానిర్దేశం చేస్తాయి. వీటికే పరిమితం కాకుండా అదనపు అంశాలు కూడా సేకరించవచ్చు. వినియోగించవచ్చు. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మన ఈ చిన్న ప్రయత్నం గోరంతదైనా ఇది కొండంత వెలుగునిస్తుందనే విశ్వాసంతో ప్రయత్నిద్దాం. ఫలితాలు సాధిద్దాం!

**సంచాలకులు**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

**యత్కర్మకుర్వతోఽ స్యస్యాత్, పరితోషాఽ ం తరాత్మనః**
**తత్ ప్రయత్నేన కుర్వీత, విపరీతం తు వర్జయేత్ – మనుస్మృతి**

**ఏపని చేస్తే అంతరాత్మకు సంతృప్తి కలుగుతుందో, ఆపనులే చేయాలి. దానికి విపరీతమైన పనులు చేయకూడదు.**

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ టి.వి.ఎస్.రమేశ్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ శ్రీనివాసుల రఘురాం,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గ్రంథసిరి, గుంటూరు జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** ఉపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సి.పి.ఎల్ అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా.గిమ్మ, జైనత (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ బలగం రామ్మోహన్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., రవీంద్రపూర్, ముథోల్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** తెలుగు పండితులు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి వంగీపురం స్వర్ణలత,** ఉపాధ్యాయిని, జి.ఉ.పా., పాతపట్టిసం, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా.

**శ్రీమతి అగుదూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., చెర్లోపల్లి, చిత్తూరు జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లిహిల్స్, హైదరాబాదు.

**శ్రీమతి జి. సరళాదేవి,** ఉపాధ్యాయిని, ప్రా.పా, గంగాపూర్, మహబూబ్‌నగర్

## సహకరించినవారు

**డా॥ రమాదేవి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ వొజ్ఝల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.

**డా॥ దోనేపూడి నరేశ్ బాబు,** తెలుగు పండితులు, జి.ఉ.పా., గోస్పాడు, కర్నూల్ జిల్లా.

**శ్రీ దోరవేటి చెన్నయ్య,** సూల్ అసిస్టెంట్, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.

**శ్రీ రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా.

**డా॥ గుడిసేవ విష్ణుప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్, కృష్ణా జిల్లా.

**శ్రీ కలమట సోమేశ్వరరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం జిల్లా.

**శ్రీ దివ్వెల చిన్నారావు,** తెలుగుపండితులు, విజయనగరం జిల్లా.

**శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, విజయనగరం జిల్లా.

**ముఖచిత్రం – డిజైనింగ్**

**కె.సుధాకరాచారి,**
SGT, UPS,
నీలకుర్తి, వరంగల్

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక విభాగాధిపతి,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,**
పూర్వ సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

**శ్రీ ఎస్.జగన్నాథరెడ్డి,**
సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

# కృతజ్ఞతలు

**"విలువల విద్య – జీవననైపుణ్యాలు"** కరదీపిక / వాచకాలను రూపొందించడంలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేసి అవసరమైన సామగ్రిని ఇచ్చి ప్రోత్సహించిన పెద్దలకు, ఆయా సంస్థలకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ, పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు.

**సలహాలు, సూచనలిచ్చినవారు :**

**శ్రీ శితికంఠానంద,** రామకృష్ణమఠం, హైదరాబాద్.
**శ్రీ కె.ఆర్.వేణుగోపాల్,** విశ్రాంత ఐ.ఎ.ఎస్., అధికారి, హైదరాబాదు.
**శ్రీ వాసగిరి లక్ష్మీనారాయణ,** ఐ.పి.ఎస్., కమీషనర్ ఆఫ్‌పోలిస్, థానే, మహారాష్ట్ర.
**డా॥ వి.బ్రహ్మారెడ్డి,** ప్రజావైద్యశాల, కర్నూలు జిల్లా.
**శ్రీ దూస రామకృష్ణ,** ఉపాధ్యక్షులు, విద్యాభారతి, అఖిలభారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీ మరియు సంచాలకులు, విజ్ఞానవిహార్, గడిలోవ, విశాఖపట్టణం.
**శ్రీ రావుల సూర్యనారాయణ,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల శైక్షణిక ప్రముఖ, సరస్వతి విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
**శ్రీ ఫాదర్ పల్లిదానం,** సంచాలకులు, పీపుల్స్ ఆక్షన్ ఫర్ రూరల్ అవేకనింగ్ (PARA), రావులపాలెం, తూ.గో.జిల్లా.
**శ్రీ సుదర్శనాచార్య,** జాతీయ సంధానకర్త, లీడ్ ఇండియా సంస్థ, హైదరాబాదు.
**శ్రీమతి పోరూరి కృష్ణకుమారి,** ప్రజ్ఞ, కో–ఆర్డినేటర్, వికాస తరంగిణి, జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాదు.
**శ్రీ ప్రేమ్‌కుమార్‌సింగ్,** రామకృష్ణమఠం, హైదరాబాద్.
**డా॥ పి.జయధీర్ రెడ్డి,** విశ్రాంతప్రధానాచార్యులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.
**శ్రీ రవీందర్,** కో–ఆర్డినేటర్, వందేమాతరం సంస్థ, వరంగల్ జిల్లా.
**శ్రీ కె.మాధవరెడ్డి,** వందేమాతరం సంస్థ, మహబూబ్‌నగర్ జిల్లా.

**సహకరించిన సంస్థలు :**

- జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు.
- రామకృష్ణమఠం, హైదరాబాదు.
- శ్రీ సరస్వతీ విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
- సత్యసాయి విద్యాసంస్థలు, హైదరాబాదు.
- బ్రహ్మకుమారీ సంస్థ, హైదరాబాదు.
- వందేమాతరం సంస్థ, వరంగల్, మహబూబ్‌నగర్.
- ఈనాడు, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దినపత్రికలు.
- ఎమెస్కో పబ్లిషింగ్ సంస్థ, హైదరాబాదు.
- జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్.సి.ఇ.ఆర్.టి.), న్యూఢిల్లీ.
- శ్రీ సీతారామ సేవాసదన్, మంథని, కరీంనగర్ జిల్లా.

పైన తెల్పిన వ్యక్తులు, సంస్థలతోపాటు పరోక్షంగా కూడా సహకరించిన వ్యక్తులకు, సంస్థలకు, వాచకాలు / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, విషయనిపుణులు, ఎడిటింగ్ చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. **విలువల విద్య – జీవన నైపుణ్యాల** గురించి వాచకం కరదీపికను రూపొందించడంలో ఇది ఒక తొలి అడుగుమాత్రమే! దీన్ని మరింత వృద్ధిపరచుకోవచ్చు. ఇందుకోసం భవిష్యత్తులో కూడా అందరూ సహాయ సహకారాలను ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాం.

**సంచాలకులు**
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- "విలువల విద్య - జీవన నైపుణ్యాలు" కోసం 1 నుండి 10 తరగతులకు తరగతివారీగా కరదీపికలు రూపొందించారు. వీటిని పిల్లలను ఉద్దేశించి తయారుచేశారు. అనగా వీటిని ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు, పిల్లలు స్వయం అభ్యసనానికి వినియోగించవచ్చు.
- ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సబ్జక్టువారీగా కేటాయించిన పీరియళ్ళ భారత్వం ప్రకారం తరగతి వారీగా పాఠాలు పొందుపర్చారు.
- 1 నుండి 5 తరగతులకు వారానికి 42 పీరియళ్ళు ఉంటాయి. వీటిలో ఒక్కొక్క సబ్జక్టుకు కింది విధంగా భారత్వం ఉంటుంది.

| | | |
|---|---|---|
| మాతృభాష (తెలుగు / ఉర్దూ) | - | 12 పీరియళ్ళు |
| గణితం | - | 12 పీరియళ్ళు |
| ఆంగ్లం | - | 6 పీరియళ్ళు |
| పరిసరాల విజ్ఞానం | - | 6 పీరియళ్ళు |
| విలువలవిద్య, జీవననైపుణ్యాలు | - | 1 పీరియడ్ |
| శారీరక, ఆరోగ్యవిద్య | - | 2 పీరియళ్ళు |
| కళలు, సాంస్కృతికవిద్య | - | 2 పీరియళ్ళు |
| పని, కంప్యూటర్ విద్య | - | 1 పీరియడ్ |
| **మొత్తం** | **-** | **42 పీరియళ్ళు** |

- విలువల విద్య, జీవన నైపుణ్యాల గురించి బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు ప్రాథమికస్థాయిలో వారానికి 1 పీరియడ్, ఉన్నతస్థాయిలో వారానికి 2 పీరియళ్ళు ఉన్నందున, ఇందుకనుగుణంగానే పాఠాలను పొందుపర్చారు.
- ప్రాథమిక స్థాయిలో 12 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్కదానికి ఒకటి చొప్పున 12 పాఠాలు ఉన్నాయి. అట్లే ఉన్నత స్థాయిలో 18 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్క దానికి ఒక పాఠం చొప్పున 18 పాఠాలు ఉన్నాయి.
- వీటితోపాటు విలువలను పెంపొందించడానికి తోడ్పడేలా పద్యాలు, కథలు, గేయాలు, పాటలు అదనంగా చేర్చారు. 3వ తరగతి నుండి స్ఫూర్తిదాతలను కూడా చేర్చారు.
- విలువల విద్య - జీవన నైపుణ్యాలను పాఠాలలో సగటున ఒక పాఠానికి 3 పీరియళ్ళు అవసరమౌతాయి.

- ఒక పాఠంలోని విషయం అమరిక కింది విధంగా ఉంటుంది.

  •) పాఠం పేరు, •) ప్రధానవిలువ, •) ఉపవిలువ, •) ఆశించేఫలితాలు / లక్ష్యాలు, •) ఉపోద్ఘాతం, •) విషయం – సన్నివేశాలు / సంఘటనలు / కథనాలు, •) అభ్యాసాలు – 'ఆలోచించడం – ప్రతిస్పందించడం', 'తరగతి కృత్యం – జట్టుపని', 'ఆచరించడం – అనుభవాలు చెప్పడం', •) సూక్తి.

- విలువల విద్య, జీవన నైపుణ్యాలలోని అంశాలు ప్రధానంగా చర్చింపజేయడానికి ఉద్దేశించినవి. ఆచరించి అనుభవాలు చెప్పించడానికి ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి వీలైనంతమేరకు వీటిని రాయించకూడదు.

- **ఆలోచించడం – ప్రతిస్పందించడం**లోని ప్రశ్నల ద్వారా తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత **'తరగతి కృత్యం – జట్టుపని'** నిర్వహించాలి. అట్లే **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'**లోని అంశాలను ఆచరింపజేసేలా చేసి పిల్లలతో వారి అనుభవాలు, అనుభూతులను చెప్పించాలి.

- మిగతా సబ్జెక్టులవలెనే **విలువల విద్య – జీవన నైపుణ్యాల**ను కూడా మూల్యాంకనం చేయాలి. వీటిని సంగ్రహాత్మక మూల్యాంకనం సందర్భంగా చేయాలి. అనగా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు నిర్వహించకూడదు. పిల్లల్ని పరిశీలించడం, వారి అనుభవాలు, ఆచరణ, ప్రవర్తన, విలువలు మొదలగు వాటి ఆధారంగా మూల్యాంకనం చేయాలి.

- దీని మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. **విలువల విద్య – జీవన నైపుణ్యాలు** ఆధారంగా పిల్లల్లో విద్యాప్రమాణాలు సాధించాలి. అవి 1) మంచి, చెడు విచక్షణ జ్ఞానాన్ని ప్రదర్శించడం, సత్ప్రవర్తనకల్గి ఉండడం, 2) రాజ్యాంగ విలువలు పాటించడం, 3) వ్యక్తిగత విలువలు అనగా సహనం, దయ, సానుభూతి, తదానుభూతి మొదలగునవి కల్గి ఉండడం, 4) జీవన నైపుణ్యాలు కల్గి ఉండడం, 5) ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం, ప్రభుత్వ ఆస్తులపట్ల సరైన వైఖరులు కల్గి ఉండడం.

- పైన తెల్పిన విద్యాప్రమాణాలను ఆయా పాఠాల ఆధారంగా పరిశీలించాలి. వీటిని సాధించడానికి అనుగుణంగానే ప్రధాన విలువకు సంబంధించిన పాఠాలు తరగతుల వారీగా ఉన్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి 10 మార్కుల చొప్పున 50 మార్కులకు నిర్వహించాలి. అనగా పరిశీలించి మార్కులు కేటాయించాలి.

- పిల్లల ప్రగతిని పరిశీలించి గ్రేడింగ్ నమోదుచేయాలి.

  A1 – 91%

  A2 – 71% – 90%

  B1 – 51% – 70%

  B2 – 41% – 50%

  C – 0 – 40%

- పిల్లల ప్రగతిని గురించి గ్రేడింగ్ నమోదు చేసినప్పుడు వాటికి సంబంధించిన గుణాత్మక రిమార్కులు కూడా నమోదుచేయాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ విధానం – ప్రాథమిక స్థాయి

**మొదటి పీరియడ్** :
- ఉపోద్ఘాతం గురించి తెలియజేయాలి.
- పాఠానికి సంబంధించిన విషయంలోని సన్నివేశాలు / సంఘటనలు / కథనాలను ఒకరితో చదివించాలి. లేదా చెప్పాలి.
- 'ఆలోచించండి – ప్రతిస్పందించండి' లోని ప్రశ్నల ఆధారంగా తరగతిలో చర్చ నిర్వహించాలి.

**రెండవ పీరియడ్** :
- **'తెలుసుకోండి'**లోని విషయాన్ని గురించి పిల్లలకు చెప్పాలి లేదా ఒకరితో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- **'తరగతి కృత్యం – జట్టుపని'**ని తరగతిలో పిల్లలను జట్లుగా విభజించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జట్టువారు చేసిన పనులను ప్రదర్శించాలి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** లోని అంశాలను ఇంటివద్ద ఆచరించమని చెప్పాలి.

**మూడవ పీరియడ్** :
- పుస్తకం చివర ఉన్న 'అనుబంధం'లో చేర్చిన కథ / పాట / పద్యం / శ్లోకం / స్ఫూర్తిదాతల గురించి తరగతిలో పిల్లలతో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- ఆ తరవాత **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.
- పాఠం చివర ఉన్న సూక్తి గురించి తెలియజేయాలి.

- పాఠశాలలో **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకాలను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు. గ్రంథాలయ పీరియడ్ సమయంలో లేదా భోజన విరామ సమయంలో కూడా పిల్లలకిచ్చి చదువుకోమని చెప్పాలి.
- 'విలువల విద్య – జీవన నైపుణ్యాలు' లోని సన్నివేశాలు, సంఘటనలు, సూక్తులు, పద్యాలు, శ్లోకాలు, కథలు, స్ఫూర్తిదాతల వంటి ఇతర అంశాలు కూడా సేకరించి తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా కూడా చర్చ నిర్వహించడం, జట్టుపనులు చేయించడం, 'ఆచరించండి – అనుభవాలు చెప్పండి' వంటివి నిర్వహించవచ్చు.
- పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికలు వంటి వాటిని వినియోగించాలి.
- విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి. వీటిని మొదటి పీరియడ్‌లోనే చదివి వినిపించాలి. వీటి గురించి అర్థం చేయించాలి. ఆ ప్రకారం పిల్లలు నడుచుకొనేలా చూడాలి.

# విషయసూచిక


| వ.సం. | ప్రధాన విలువ | నేర్చవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 1. | స్వేచ్ఛ | ఇంట్లో, స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవడం | స్వేచ్ఛ | 1 |
| 2. | సంతృప్తిగా జీవించడం | మంచి నడవడిక వల్ల సంతృప్తి పొందడం | మంచి గుణాలు | 6 |
| 3. | శీల నిర్మాణం | 'త్యాగం' భావనను కలిగి ఉండడం | త్యాగం | 12 |
| 4. | జీవన నైపుణ్యాలు | మాట్లాడడం ఒక కళ | మాట్లాడడం | 16 |
| 5. | బాధ్యతవహించడం | పెద్దలపట్ల గౌరవభావం కలిగి ఉండడం - వారు చెప్పినట్లుగా నడుచుకోవడం | కర్తవ్యం | 20 |
| 6. | పొదుపు చేయడం | విద్యుత్ పొదుపుపై అవగాహన కల్గి ఉండడం | విద్యుత్తు పొదుపు | 23 |
| 7. | ఆరోగ్య విలువలు | అపరిశుభ్ర పరిసరాలు - పర్యవసానాల గురించి అవగాహన పొందడం | మన బాధ్యత | 28 |
| 8. | సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం | ఆచార్యదేవోభవ | గురువు | 32 |
| 9. | పర్యావరణ పరిరక్షణకు తోడ్పడం | ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై అవగాహన కల్గిఉండడం | ప్లాస్టిక్ వద్దు | 37 |
| 10. | శాస్త్రీయ దృక్పథం | దేనిని గుడ్డిగా నమ్మరాదని తెలుసుకోవడం | మూఢనమ్మకం | 42 |
| 11. | న్యాయం | న్యాయబద్ధంగా ప్రవర్తించడంపై అవగాహన కల్గి ఉండడం | గుణపాఠం | 45 |
| 12. | శాంతి / కలిసి మెలిసి జీవించడం | ఇతరులకు మేలుచేసే పనులు శాంతిని కలుగజేస్తాయని అవగాహన చేసుకోవడం. | మేలు చేద్దాం | 48 |


## అనుబంధాలు


1. శ్లోకాలు 52
2. పద్యాలు 53
3. పాటలు, గేయాలు 54
4. కథలు 65
5. స్ఫూర్తిదాతలు 82

# విద్యార్థులకు సూచనలు

- పిల్లలూ! **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకం మీకోసమే రూపొందించి పాఠశాలలకు పంపారు.
- వీటిలోని పాఠాలు, పద్యాలు, కథలు, శ్లోకాలు, పాటలు, స్ఫూర్తిదాతల గురించి మీకు మీ ఉపాధ్యాయులు బోధిస్తారు. లేదా మీరే చదవండి. ఇతరులకు చెప్పండి, వాటి గురించి చర్చించండి.
- వీటి గురించి మీకు వారానికి ఒకరోజు బోధిస్తారు.
- ఒక పాఠంలోని సన్నివేశాలు, సంఘటనలు గురించి మీలో ఒకరు చదివిన తర్వాత మీ ఉపాధ్యాయుడు, కొన్ని ప్రశ్నలు అడుగుతారు. వీరందరూ ఆ ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పండి. చర్చలో పాల్గొనండి.
- తరగతిలో జట్టు కృత్యాలు నిర్వహిస్తారు. మీరు మీ మిత్రులతోకల్సి జట్టు పనుల్లో పాల్గొనండి. మీరు జట్లలో చర్చించిన విషయాల గురించి తరగతిలో చెప్పండి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** అని కొన్ని పనులను మీకు పురమాయిస్తారు. ఆ ప్రకారం మీరు ఆచరించండి. ఆ తరవాత వచ్చే పీరియడ్‌లో ఏం చేశారు? మీకెలా అనిపించిది? దీన్నుండి మీరేమి నేర్చుకొన్నారు? మొదలగు విషయాలను, మీ అనుభవాలను తెలియజేయండి.
- వీటిలోని అంశాలు ఎక్కువగా చర్చించడానికి, ఆచరించి అనుభవాలు చెప్పడానికి ఉద్దేశించినవి కాబట్టి రాయాలని భావించకండి. తప్పనిసరిగా చేయండి.
- మీరు తెల్సుకొన్న, చర్చించిన అంశాల ఆధారంగా వార్తాపత్రికలలో చూడండి. వాటి నుండి సేకరించిన విషయాలు, వార్తలు, వ్యాసాలు, సూక్తులు మొదలగువాటిని తరగతిలో చదివి విన్పించండి. ఆ తరవాత వాటిని తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించండి.
- వీటికి కూడా మూల్యాంకనం ఉంటుంది. ఐతే, వీటికి పరీక్షలు ఉండవు. మీరెలా పాల్గొంటున్నారు? మీ ప్రవర్తన ఎలా ఉంది? మీలో ఏం మార్పువచ్చింది? మొదలగు విషయాలను మీ ఉపాధ్యాయులు పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మీకు గ్రేడింగ్ ఇస్తారు.
- ఇలా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మీ గురించి నమోదుచేస్తారు. మొదటి సంగ్రహణాత్మక, రెండవ సంగ్రహణాత్మక, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలతోపాటు మిమ్మల్ని పరిశీలించి మీ ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదుచేస్తారు.
- 10వ తరగతి మెమో / సర్టిఫికెటులో కూడా ఈ వివరాలు ఉంటాయి.
- వంట ఎంత మంచిగా వండినా, దాంట్లో చిటికెడు ఉప్పు లేకుంటే రుచి ఉండదని భాస్కరశతకంలోని పద్యం ఉంది. అట్లే మనం ఎంత చదువుకున్నా, ఎంత మంచి గ్రేడు వచ్చినా, మనలో 'వినయం, సహనం, శీలం, విచక్షణ' లేకుంటే మనకు విలువ ఉండదు. కాబట్టి విలువల విద్య – జీవన నైపుణ్యాలు పాఠాల ద్వారా మీరు గొప్పవారుగా ఎదగాలి.

# 1 స్వేచ్ఛ

## I. ప్రధాన విలువ

స్వేచ్ఛ

## II. ఉప విలువ

ఇంట్లో స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ఇంట్లో స్వేచ్ఛ లేకుంటే ఏం జరుగుతుంది? స్వేచ్ఛ ఉంటే ఏమి జరుగుతుంది? తెలుసుకోవడం.
- ఇంట్లో ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకూడదని తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

స్వేచ్ఛ ఉన్నచోటే అభివృద్ధి ఉంటుంది. స్వేచ్ఛ ఉంటే బాధ్యత పెరుగుతుంది. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. మనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేకపోతే మనపైన నమ్మకం పోతుంది. దీంతో మనకిచ్చిన స్వేచ్ఛ కూడ కోల్పోతాం. స్వేచ్ఛను తిరిగి పొందాలంటే చాలా కష్టమైన పని. ఇంట్లో స్వేచ్ఛను ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేయడమే ఈ పాఠ్యాంశం ఉద్దేశం.

## V. సంఘటనలు

ఇంట్లో పెద్దలు ఇచ్చిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోకపోతే ఏం జరిగిందో కింది సంఘటనలను చూడండి.

**సంఘటన – 1**

వేణు 5వతరగతి చదువుతున్నాడు. వేణు బడికి వచ్చేదార్లో తినుబండారాలు అమ్మే రంగమ్మ అంగడి ఉంది. వాటిని చూస్తుంటే వేణుకి నోరూరేది. వాటిని తినాలంటే రోజూడబ్బులు ఎవరిస్తారు? అందుకని వేణు వాళ్ళ అమ్మ నాన్నలను పెన్సిలు కొనుక్కోవాలని, పెన్‌కొనుక్కోవాలని, నోటుపుస్తకం కొనుక్కోవాలి. అని రోజూ డబ్బులు అడిగి తీసుకొనేవాడు. అయ్యోపాపం! పిల్లాడికి ఇవన్నీ అవసరం కదా! అని అమ్మనాన్న కూడ డబ్బులిచ్చేవారు. దాంతో వేణు తినుబండారాలు కొని తింటుండేవాడు. వేణు ఓరోజు ఐస్‌క్రీం తింటున్నాడు. గోడపై ఉన్న సినిమాపోస్టర్ కనబడింది. "బళ్ళో జెండాపండుగ జరుగుతుంది. అందుకని మాబడిని అలంకరించుకోవాలి. అందుకోసం అందరినీ 10రూపాయలు తెమ్మన్నారని" అబద్ధం చెప్పి డబ్బు తీసుకొన్నాడు. దర్జాగా సినిమా చూశాడు. వేణు ఇలా డబ్బులను ఖర్చుపెట్టడాన్ని శీను గమనించాడు. ఇలా చేయడం తప్పు అని చెప్పాడు. వేణు శీను మాటలను లెక్కచేయలేదు. సరికదా! పైగా అతణ్ణి బెదిరించాడు కూడా!

ఈసారి నిజంగానే వేణుకు పుస్తకాలు, పెన్సిళ్ళు కొనే అవసరం వచ్చింది. అమ్మను డబ్బులు అడిగాడు. నిన్ననే కదా! పుస్తకాలు, పెన్సిళ్ళుకొనమని డబ్బు ఇచ్చాను. ఇదేపనా! నేను బడికి వచ్చిమీ టీచర్‌ను అడుగుతాను ఉండు. అంటూ ఆమె బడికి వచ్చింది. వేణుకు రోజూ డబ్బులిస్తున్న సంగతి చెప్పింది. టీచర్ విషయం ఆరాతీస్తే శీనుద్వారా మొత్తం విషయం తెలిసింది.

వేణు అబద్ధాలాడినందువల్ల ఏం జరిగిందో! చూశారా!

**సంఘటన – 2**

పక్క ఊర్లోకి కొత్తసినిమా వచ్చింది. రాము సినిమా పోస్టరును గోడపైన చూశాడు. సినిమా ఎలాగైనా రాము చూడాలనుకున్నాడు. ఎలా అని ఆలోచించాడు. అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఇంటికి వచ్చాడు. గబగబా అన్నం తింటున్నాడు. దీన్ని గమనించిన అమ్మ! ఆతొందరేమిటి? నిదానంగా తిను అంది. లేదమ్మా! హోంవర్కు చాలా ఉంది. రాజు వాళ్ళింటికి వెళ్ళి రాసుకోవాలని చెప్పి గబగబా వెళ్ళాడు. త్వరగా వచ్చేయ్‌రా! అన్న అమ్మమాటకూడ పట్టించుకోలేదు.

రాము సైకిల్‌షాపుకు వెళ్ళాడు. అద్దెసైకిలు తీసుకొన్నాడు. దానిమీద పక్కఊరికి వెళ్ళాడు. చాలాసేపయినా రాము ఇంటికి రాకపోయే సరికి వాళ్ళమ్మ గాబరా పడింది, రాము వాళ్ళ నాన్నతో చెప్పింది. ఇదేమంత పట్నమా నీకొడుకు తప్పిపోవడానికి? అని రాము వాళ్ళ నాన్న అన్నాడు. రాము వాళ్ళమ్మ మరికాస్సేపు చూసింది. ఆమెకు కంగారెక్కువైంది. దీంతో రాజువాళ్ళింటికి వెళ్ళింది. రాము అక్కడికి రాలేదని తెలిసి మరింత భయపడింది. గబగబా వస్తున్న రాము వాళ్ళమ్మను చూసిన సైకిల్‌షాపు బాషా విషయం అడిగాడు. ఆమె తనకొడుకు సంగతి

చెప్పింది. మీరు చెప్పారు అని పక్కఊరికి వెళ్ళాలని రాము 3 గంటల కిందట నా దగ్గర సైకిలు తీసికొని వెళ్ళాడమ్మ అన్నాడు.

సినిమా అయిపోగానే రాము తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన రామును వాళ్ళ అమ్మానాన్న ఇలా చేయడం తప్పని కోప్పడ్డారు. అప్పటినుండి రాముకు డబ్బులివ్వడం మానేశారు.

చూశారా! రాముకి అమ్మనాన్నలు ఇచ్చిన స్వేచ్ఛను సరిగా వినియోగించు కోకుండా ఎలా నమ్మకాన్ని పోగొట్టుకున్నాడో!

**సంఘటన - 3**

గోపి స్కూలునుండి ఇంటికివచ్చాడు. వచ్చీరాగానే టి.వి రిమోట్ కోసం వెతికాడు. టి.వి. పెట్టాడు. పోగో ఛానల్, ఖుషి ఛానల్, నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్ ఇలా మార్చి మార్చి టి.వి.ని అదేపనిగా చూస్తున్నాడు. పొద్దస్తమానం అలా టి.వి చూస్తే కళ్ళుపోతాయిరా! అని అమ్మ అంది. పోనీలే మంచి విషయాలే చూస్తున్నాడు కదా! అన్నాడు నాన్న. ప్రతిరోజు స్కూలు నుండి రాగానే ఇదే తంతు. ఇక సెలవు రోజుల్లో అయితే టి.వి. చూస్తూనే గడిపేవాడు. హోంవర్కు చేయరా! చదువుకోరా! అని అమ్మ అంటున్నా లెక్క చేసేవాడు కాదు. ఈ అలవాటు మరింత ముదిరి రాత్రిళ్ళు అమ్మానాన్న నిద్రపోయాక కూడా టి.వి చూసేవాడు. ఉదయం త్వరగా లేచేవాడు కాదు. అమ్మానాన్నలు ఇలా చేయొద్దని చాలాసార్లు చెప్పిచూశారు. ఇలా చదువు సంధ్యలు లెక్కచేయకుండా పొద్దస్తమానం టి.వి. చూడ్డం మంచికాదని చెప్పారు. అయినా గోపి తన అలవాటు మార్చుకోలేదు. దీంతో మరునాటి నుండి టి.వి కనెక్షన్ తీయించేశాడు.

టి.వి చూడ్డం తప్పుకాదు. రాము అదేపనిగా టి.వి.చూస్తుండటం వల్ల ఏం జరిగిందో చూశారా!

**సంఘటన - 4**

వాసు వాళ్ళ అమ్మ, నాన్నకు ఒక్కగానొక్క కొడుకు, వాసుకు వాళ్ళు చాలా గారంగా పెంచారు. వాసు ఏది అడిగినా కొనిపెడతారు. ఏది కావాలన్నా చేస్తారు. అలాగే ఎక్కడికి అడిగినా పంపిస్తారు. అంత స్వేచ్ఛగా ఎలాంటి కట్టడి లేకుండా పెరిగాడు వాసు. వాసు స్నేహితులు నరేష్, వంశీ స్కూల్ ఎగ్గొట్టి సినిమాకు పోదాం అని అడిగారు.

నేను అలా చెప్పకుండా రానురా అన్నాడు వాసు. నువ్వు చెప్పకపోయినా నిన్ను ఏమీ అనరుకదా! మీ అమ్మ, నాన్నకు నువ్వంటే చాలా ఇష్టం కదా! ఏమీ అనరు వెళ్దాం పద అన్నారు స్నేహితులిద్దరు. మీరు చెప్పింది నిజమే మా అమ్మ, నాన్న నన్ను ఏమీ తిట్టరు వాళ్ళకు నేనంటే చాలా ఇష్టం అంతే కాకుండా వాళ్ళకి నామీద నమ్మకం కూడా. వాళ్ళు నాకు స్వేచ్ఛ ఇచ్చారని నా ఇష్టమొచ్చినట్టు చేసి వాళ్ళకు కష్టం కలిగించను. నమ్మకం పోతే ఇక ఎప్పుడూ మనం స్వేచ్ఛగా ఉండలేము. ఇచ్చిన స్వేచ్ఛను మంచిగా ఉపయోగించుకోవాలి కాని చెడుమార్గాన పోవడానికి కాదు అన్నాడు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) వేణు అబద్ధాలాడినందువల్ల ఏంజరిగింది? రాముకి వాళ్ళ తల్లిదండ్రులు డబ్బులివ్వడం కట్టడిచేశారా? వారు చేసిన పని సరైందేనా? ఎందుకు?

2) పై సంఘటనలు గమనించారు కదా! ఇచ్చిన స్వేచ్ఛను ఉపయోగించుకొని, దుర్వినియోగం చేయడం వల్ల ఏం జరిగింది?

3) దుర్వినియోగం చేయడం వల్ల ఎలాంటి నష్టాలు కలుగుతాయి?

4) వాసు చెప్పిన మాటలతో మీరు ఏకీభవిస్తారా? మీరు చేసే పనిలో మీ తల్లిదండ్రులు సమర్థిస్తారా? ఎప్పుడెప్పుడు?

5) ఇచ్చిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటే ఎలాంటి లాభాలు కలుగుతాయి?

### *తెలుసుకోండి*

*స్వేచ్ఛ ఉన్నచోటే అభివృద్ధి ఉంటుంది. నమ్మకం సంపాదించుకుంటేనే స్వేచ్ఛ నిలబడుతుంది. స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే నమ్మకాన్ని కోల్పోతాము. తద్వారా స్వేచ్ఛను పోగొట్టుకొంటాము. మళ్ళీ స్వేచ్ఛను సంపాదించుకోవడం చాలా కష్టం. స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే క్రమశిక్షణ పేరుతో నియంత్రించబడుతుంది.*

*తమ పిల్లలు బాగుండాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. పిల్లల మేలుకోసం, వారి బాగోగుల కోసం కష్టపడే సందర్భాలు చాలా ఉంటాయి. ఇంట్లో అమ్మ నాన్న మనకిచ్చిన స్వేచ్ఛను బాధ్యతగా నిర్వర్తించాలి. దీన్ని విస్మరిస్తే స్వేచ్ఛను కోల్పోతాం. మనకిచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే మనపై నమ్మకం పెరుగుతుంది. అమ్మనాన్నలు చెప్పినట్లు నడుచుకోవాలి. ఇలా చేయకపోతే మనపైన ఆంక్షలు పెట్టి, కట్టడి చేస్తారు.*

*మనమీద నమ్మకం పెరిగేలా మన నడవడిక ఉండాలి. ఇంట్లో అమ్మానాన్న మనకిచ్చిన స్వేచ్ఛను ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలి. ఉత్తమ పౌరులుగా ఎదిగి మంచిపేరు సంపాదించుకోవాలి. తల్లిదండ్రులు మన మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయరాదు. వారు గర్వపడేలా మన ప్రవర్తన ఉండాలి.*

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

- మీకిచ్చిన స్వేచ్ఛను మీరెప్పుడైనా దుర్వినియోగం చేసారా? దానివల్ల ఏంజరిగింది?

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

- మీకు మీఇంటిలో ఏఏ విషయాల్లో మీ అమ్మానాన్నలు స్వేచ్ఛనిచ్చారు? ఏఏ విషయాల్లో మిమ్మల్ని కట్టడి చేస్తున్నారు?

**సూక్తి**

మనకు పెద్దవాళ్ళు ఇచ్చిన స్వేచ్ఛను
సద్వినియోగం చేసుకోకపోతే
వాళ్ళ నమ్మకాన్ని కోల్పోతాం.

# 2 మంచి గుణాలు

## I. ప్రధాన విలువ

సంతృప్తిగా జీవించడం

## II. ఉప విలువ

మంచిప్రవర్తన వల్ల సంతృప్తి కలుగుతుంది.

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- మంచి ప్రవర్తన లక్షణాలు తెలుసుకోవడం.
- నిజాయితీగా ఉంటే అందరూ గౌరవిస్తారని తెల్సుకోవడం.
- మంచి ప్రవర్తన కల్గినవారికి అవసరమైనపుడు ఎవరైనా సహాయపడాలి.

## IV. ఉపోద్ఘాతం

"మేలు చేయకపోయినా కీడు చేయరాదు." అన్నసామెత ఉంది కదా! ఇతరులకు హాని కలిగించాలన్న ఆలోచన రాకూడదు! ఇతరులకు బాధ కలిగించాలనుకున్న వారు ఎప్పుడూ ఆనందంగా తృప్తిగా ఉండలేరు. మన మంచి ప్రవర్తనవల్ల. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు. శత్రువులు ఉండరు. అందరూ మనలను ఇష్టపడతారు. మన కష్టాన్ని పంచుకొంటారు. అందరి సహకారం, ఓదార్పు మనకు లభిస్తుంది. ఆందోళన కలుగదు. మనమూ నష్టపోకుండా ఉంటాము. మంచి నడవడిక కలిగిన వారు ఎలా ఉంటారో తెలుసుకుందామా!

## V. సంఘటనలు

**సంఘటన – 1**

రమా టీచర్ పేపరుపట్టుకొని వచ్చింది. టీచర్ చేతిలోని కాగితంలో ఏముందోనని పిల్లలు ఉత్సుకతతో చూస్తున్నారు. ఆపేపరు ఏమిటి మేడమ్? అని అడిగింది రాధిక. చెబుతాను వినండి. వచ్చేవారం మన పాఠశాలలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుగుతాయి. అందుకని ఎవరి తరగతి గదిని వారు అలంకరించుకోవాలని టీచర్ చెపింది. అప్పుడే పిల్లల్లో సందడి మొదలైంది. ఏమి చేద్దామని టీచర్‌ను అడిగారు. మేమందరం తలొక 10 రూపాయలు ఇస్తాము. ఆ డబ్బుతో కావలసిన రంగు పేపర్లు మొదలైనవి తెచ్చుకొందామని బిందు చెప్పింది. డబ్బు వసూలు చేసేపని ఎవరుచూస్తారు? అని టీచరు అడిగింది. సునీల్ చూస్తాడు టీచర్ అన్నారు పిల్లలంతా ఏం సునీలేనా? నేనే చూస్తాను మధు అని. సునీల్ అయితే వసూలు చేసిన డబ్బును జాగ్రత్తగా వాడుతాడు. ఖర్చు పెట్టిన దానికి లెక్కరాస్తాడు. మిగిలిన డబ్బును జాగ్రత్తగా టీచర్‌కి ఇస్తాడు. నీవైతే అలా చేయవు. ఇష్టం వచ్చినట్లు చేస్తావు. వద్దు అని ఖండించింది మౌనిక. అందరూ సునీల్‌కే ఆ పని అప్పగించాలన్నారు. టీచర్ అలానే చేసింది.

**సంఘటన – 2**

భావన 5వ తరగతి చదువుతున్నది. చాలాచురుకైంది. నెమ్మదిగా ఉంటుంది. ఎవరూ చెప్పాల్సిన అవసరం లేకుండా తన పనులు తాను చేసుకోవడంపై శ్రద్ధ కలిగి ఉంటుంది. క్రమం తప్పకుండా రోజూ సమయానికి బడికి వస్తుంది. తన పుస్తకాలను జాగ్రత్తగా సర్దుకొంటుంది. అట్టలు చిరిగిపోతే మళ్ళీవేసుకుంటుంది. పాఠాలను ఆసక్తిగా వింటుంది. తెలియని విషయాలను అడిగి తెలుసుకుంటుంది. ఇచ్చిన పనిని వాయిదా వేయకుండా జాగ్రత్తగా పూర్తి చేస్తుంది. ఆదివారంనాడు యూనిఫారమ్ ఉతికి శుభ్రం చేసుకుంటుంది. అన్ని విషయాల్లో టీచరుకు చేదోడు వాదోడుగా ఉంటుంది. జట్టుకృత్యాల్లో, తరగతికృత్యాల్లో, ప్రాజెక్టుపనుల్లో తనవంతు పనిని తను చక్కగా చేస్తుంది.

ఇలా తనపనులను తాను క్రమపద్ధతిగా చేసుకోవడంవల్ల. మంచిపేరు తెచ్చుకుంది. ఆందోళన పడకుండా స్థిమితంగా ఉంటుంది. ఇలా ఆమె సత్ప్రవర్తనవల్ల ఆ సంవత్సరం "ఉత్తమ విద్యార్థి" బహుమతి అందుకొని అందరి మన్ననలు పొందింది.

*సంఘటన – 3*

*రామయ్య కష్టపడే తత్వం ఉన్న రైతు. తనకున్న పొలంలో కష్టపడి పంట పండిస్తాడు. అంతేగాక ఉన్నదాంట్లో తోటివారికి సాయం చేయడం, వారి కష్టాలను తనవిగా భావించి చేతనైన సాయం కూడా చేస్తాడు. రామయ్య అంటే ఊళ్ళో అందరికీ ఎంతో గౌరవం, మర్యాద. అయితే ఒకసారి చీడపీడల వల్ల పంట చేతికి రాకుండా పోయింది. నష్టాలపాలయ్యాడు. ఎందరికో సాయం చేసిన వ్యక్తి నేడు సాయం అవసరమైన స్థితికి చేరాడు. అయితే రామయ్య గురించి తెలిసిన వారందరూ కలిసి రామయ్యను ఆదుకోవాలని అనుకున్నారు. అంతా కలిసి తలోచెయ్యి వేసి రామయ్యను ఆదుకున్నారు. రామయ్య ఎంతో సంతోషించాడు.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) డబ్బులు జమచేసి సునీల్‌కే ఇవ్వమని పిల్లలందరూ ఎందుకన్నారు?
2) భావన మంచి విద్యార్థిగా పేరుతెచ్చుకుంది కదా! స్వీయక్రమశిక్షణవల్ల కలిగే లాభాలు ఏమిటి?
3) రామయ్య ఇతరుల కష్టాలను తనవిగా భావించి సహాయపడేవాడుకదా? దీనివల్ల ఈతనికి కల్గిన ప్రయోజనం ఏమిటి?
4) మంచిగా ప్రవర్తించాలంటే మనలో మంచి గుణాలు ఉండాలి. మంచి గుణాలంటే మీరు ఏమనుకుంటున్నారు? మీలో ఉన్న మంచి గుణాలు ఏంటి?
5) మీ తరగతిలో ఎవరెవరిలో ఏఏ మంచి గుణాలు ఉన్నాయో చెప్పండి.
6) సమయపాలన అంటే ఏమిటి? మనం ఎందుకు సమయపాలన పాటించాలి?

### *తెలుసుకోండి*

*మనిషి తాను ఇతరప్రాణుల కంటె గొప్పవాడుగా అనుకొంటున్నాడు. దానికి కారణం అతనికి ఉన్నబుద్ధి. బుద్ధిగల మానవులంతా తాము ఇంకా గొప్పవాళ్ళుగా కావాలనుకుంటున్నారు. కొందరు శారీరక బలాన్ని పెంచుకొని గొప్పవాళ్ళుగా కావాలని అనుకొంటారు. కొందరు ధనాన్ని బాగా సంపాదించి గొప్పతనాన్ని సంపాదించుకోవాలని అనుకుంటారు. కొందరు అధికారాన్ని, నాయకత్వాన్ని ఉన్నతికి సాధనంగా అభిలషిస్తారు. కొందరు అన్నీ తనకు అవసరమని తాను గొప్పవాడు కావాలని మిగతా ప్రాణులుగానీ, మనుషులు గానీ తన కొరకే ఉన్నారని భావిస్తారు. మరికొందరు జ్ఞానాన్ని వృద్ధి చేసుకొని గౌరవాన్ని సాధించుకోవడానికి సంకల్పిస్తారు. అయితే మనిషి ఎంతగ వృద్ధిచెందినా, ఎంత జ్ఞానాన్ని పొందినా, మంచివాడుగా లేకుంటే ఎవరూ గౌరవించరు.*

*అందుకే పెద్దలు సత్ప్రవర్తనయే మనిషికి అత్యవసరమైనది. అది ఉన్నప్పుడు మనిషి తనను, సమాజాన్ని రక్షించుకోగలుగుతాడు. మనం ఎలా సుఖంగా ఉంటున్నామో అలా అందరూ, అన్ని ప్రాణులు సుఖంగా*

హాయిగా ఉండాలనుకోవడం, ఎవరిహద్దులలో వారుంటూ, ఇతరుల హద్దులలో వారిని ఉండనిస్తూ అవసరం ఏర్పడినప్పుడు ఒకరినొకరు తోడ్పడుతూ ఉండడం. తన పనులు తాను చేసుకొంటూ ఇతరులకు వారి విధులకు జీవనానికి ఏమాత్రం భంగం కలిగించకుండా, ఇబ్బంది కలగకుండా ఉండడం అనేది సత్ప్రవర్తనలో భాగాలు.

సత్ప్రవర్తన కలిగిన వారికి నిజాయితీ, ఓర్పు, సహనం, స్వీయక్రమశిక్షణ, సమయస్ఫూర్తి, భావోద్వేగ నియంత్రణ, సహాయపడడం వంటి లక్షణాలు ఉంటాయి. మంచి నడవడి ఉన్నవారికి శత్రువులుండరు. అందరూ స్నేహితులు వీరితో ఉండాలని కోరుకుంటారు. వీరికి మానసిక ధృఢత్వం ఉంటుంది. ఎదుటివారు వీరి కష్టాలని పంచుకోవాలని చూస్తారు. ఇతరుల సహకారం లభిస్తుంది. ఒత్తిడికి లోనుకారు.

నేటి కాలంలో సుఖసాధనాలు పెరిగాయి, సుఖంలేదు. తినడానికి తిండి ఉంది, తినే యోగ్యత లేదు. అన్నీ ఉన్నాయి, ఆనందం లేదు. సమస్తమూ ఉంది, శాంతి లేదు. అందరికీ హక్కులున్నాయి, ఎవరికీ బాధ్యతలేదు. ఎందుకంటే భౌతిక సంపద ఉంది, నైతిక సంపద లేదు.

సద్గుణాలే జీవితవిలువలు. సద్గుణసంపదే దైవీ సంపద. స్థాయీభేదాలు ఉండవచ్చు. విలువలు మారవు. సద్గుణాలు మారని విలువలు. సద్గుణ సంపన్నులై సత్ప్రవర్తన కలిగిన వారయితే అటువంటి వ్యక్తులున్న సమాజానికి విజయం తథ్యం. సత్ప్రవర్తన మనకు ఇతరులకు కూడా శాంతిని కలిగిస్తుంది.

## మంచి అలవాట్లు

- ఏ రోజు ఇంటిపని (Home Work) ఆ రోజే చేసుకోవాలి.
- నీటిని, కరెంటును, ఆహారాన్ని, పేపరును వృథా చేయవద్దు.
- జంతువులను బాధించవద్దు, కొట్టవద్దు, వాటికి ఆహారం, నీరు ఇవ్వాలి.
- మంచి పనులు చేయాలి. అబద్ధం ఆడకూడదు.
- చాడీలు చెప్పరాదు. దొంగతనం చేయరాదు.
- చెత్తను, చిత్తుకాగితాలను చెత్తబుట్టలోనే వేయాలి.
- ఇంటిని, స్కూలును పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- అందరితో స్నేహంగా ఉండాలి. సహాయం చేయాలి.

- స్నేహితులతో కొంత సమయం గడపాలి.
- గోళ్ళను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. క్షవరం చేయించుకోవాలి.
- అందరితో స్నేహంగా ఉండాలి. సహాయం చేయాలి.
- పుస్తకాలను, బ్యాగులను భద్రంగా ఉంచుకోవాలి.
- ప్రతిరోజు స్నానం చేయాలి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

**కింది పట్టికలోని అంశాల గురించి**

| ప్రవర్తన | ఎప్పుడూ కలిగి ఉంటాను | అప్పుడుప్పుడు కలిగిఉంటాను | అసలు లేదు |
|---|---|---|---|
| నిజాయితీ | | | |
| సహనం | | | |
| మంచిగా మాట్లాడడం ఇతరులు చెప్పింది వినడం | | | |
| ఎదుటివాళ్ళకు సహాయపడే గుణం | | | |
| స్వీయక్రమశిక్షణ | | | |
| సమయపాలన పాటించడం | | | |

1) మీ తరగతిలో ఎప్పుడూ సహనం కలిగి ఉండేవారు ఎవరు?

2) ఎప్పుడూ ఇతరులతో మంచిగా మాట్లాడేవారు ఎవరు?

3) ఎప్పుడూ ఎదుటివాళ్ళకు సహాయం చేసేవారు ఎవరు?

4) ఎప్పుడూ స్వీయక్రమశిక్షణ కలిగి ఉండేవారు ఎవరు?

5) సమయపాలన పాటించేవారు ఎవరు?

6) పైలక్షణాలనన్నింటిని అలవరుచుకోవాలంటే మీరు ఏమి చేయాలి?

పై పట్టికను నల్లబల్లపై రాయాలి. ఒక్కొక్క అంశం గురించి అడగాలి. ఎంతమంది ఏమేమి కల్గి ఉన్నారో గుర్తింపజేయాలి. ఇంక ఏమేమి మంచి లక్షణాలు కల్గి ఉండాలో చర్చద్వారా అవగాహన కల్గించాలి.

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

- ఇంట్లో, బయట, బడిలో మంచి లక్షణాలను కలిగినవారు ఎవరెవరు ఉన్నారో తెలుసుకోండి. వారి గురించి చెప్పండి.
- మీలోని మంచిగుణాలు – చెడుగుణాలు పట్టిక తయారు చెయ్యండి. మంచిగుణాలు పెంచుకుంటూ, చెడుగుణాలు తగ్గించుకొనేలా ప్రయత్నించండి.

**సూక్తి**

**ఎంత గొప్ప చదువు చదివినా మంచి నడవడిక లేకపోతే గుర్తింపు తెచ్చుకోలేరు.**

# 3 త్యాగం

## I. ప్రధాన విలువ

శీల నిర్మాణం

## II. ఉప విలువ

త్యాగ భావం పెంపొందించడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- త్యాగభావనను అవగాహన చేసుకోవడం
- త్యాగము అనే భావనను పెంపొందించుకొనుట

## IV. ఉపోద్ఘాతం

మనిషి జీవితంలోని అన్ని పరిస్థితులలో అన్నిస్థాయిలలో ఉన్నతిని పొందేందుకు త్యాగభావన అనేది అత్యంతావశ్యకమైన గుణం. ప్రపంచ చరిత్రను పరిశీలించినా, ఏ మహనీయుల జీవితాన్ని గమనించినా మనకు ఇదే తెలుస్తుంది. త్యాగమనే పదానికి పర్యాయ పదంగా నిలిచిన 'పన్నాదాది' గురించి తెలుసుకుందాం.

## V. సంఘటనలు

*సంఘటన - 1*

*మేవార్ సంస్థానాన్ని పరిపాలించే మహారాణా సంగ్రామసింహునికి నలుగురు కుమారులు. చిన్నవాడైన ఉదయసింహుని ఆలనాపాలనా దాది అయిన పన్నాయే చూసేది. పసిగుడ్డుగా ఉన్నప్పుడే తల్లి చనిపోవడంతో ఉదయసింహుడు పన్నా వద్దే పెరిగాడు.*

*కణ్వా యుద్ధంలో సంగ్రామసింహుడు. అతని పెద్ద కుమారుడు మరణించారు. రెండో కుమారుడు రతన్ సింహుడుకూడా నాలుగేళ్ళకే మరణించాడు. దీంతో విక్రమాదిత్యసింహుడు రాజసింహాసనం అధిష్టించాడు. ఉదయసింహుడు పన్నాయొక్క కుమారుడు చందన్‌తోపాటు పెరగసాగాడు.*

*కొన్ని పరిణామల కారణంగా విక్రమాదిత్య సింహుని రాజుగా తప్పించి సంగ్రామ సింహుని సోదరుని కొడుకైన బన్‌బీర్‌ను రాజ్యరక్షకునిగా నియమిస్తారు. ఉదయసింహుడు పెద్దవాడైతే తనకు సింహాసనం దక్కదని ఎన్నో రోజులుగా సింహాసనంపై కన్నేసిన బన్‌బీర్ విక్రమాదిత్యసింహుని చంపి ఉదయసింహుని చంపడానికి రాజమహలుకు బయలుదేరాడు.*

*చిన్నవాడైన ఉదయసింహుడు పన్నాదాది వద్ద నిద్రపోతున్నాడు. వేరేదాసి ద్వారా బన్‌బీర్ ఉదయసింహుని చంపడానికి వస్తున్నాడని తెలియగానే పన్నా అతన్ని ఎలాగైనా కాపాడాలనుకొని అతన్ని బుట్టలో పెట్టి దాసికిచ్చి కోటదాటి వెళ్ళమంది. అతని స్థానంలో తన కుమారుడైన చందన్‌ని పడుకోబెట్టింది.*

*ఇంతలో బన్‌బీర్ కత్తి చేత్తో పట్టుకొని రానేవచ్చాడు. ఉదయసింహుడెక్కడని పన్నాను ప్రశ్నించగా తన కుమారున్ని చూపింది. అతనే ఉదయసింహుడనుకొని కత్తితో నరికి చంపివేశాడు. పన్నా ఏమాత్రం తొణకలేదు. రాజ్యం కోసం రాజు కోసం తన కన్నకొడుకునే త్యాగం చేసింది. ఉదయసింహుని సురక్షితంగా రాజ్యం దాటించింది. ఉదయసింహుడు పెద్దయ్యాక మేవార్ పై దండయాత్ర చేసి సింహాసనం ఎక్కాడు. ఉదయ్‌పూర్‌ను నిర్మించాడు.*

*ఇలా తనకు ఆశ్రయమిచ్చిన రాజుకోసం, మాతృభూమికోసం తన సొంత కుమారుడినే బలి చేసుకున్న త్యాగమూర్తి పన్నాదాది.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) పన్నాదాది తన దేశం కోసం ఏం చేసింది?
2) త్యాగం చేయడం అంటే ఏమిటి?
3) మనదేశం కోసం ఇంకా ఎవరెవరు త్యాగం చేశారు?
4) వారి త్యాగాన్ని మనం స్ఫూర్తిగా ఎందుకు తీసుకోవాలి?

## తెలుసుకోండి

*త్యాగం అంటే విడుచుట, వదిలిపెట్టుట. ఒక వస్తువును త్యాగం చేస్తే దానిపై అధికారం మనకు ఉండదు. ఒక వస్తువుపైన మనకు అధికారం తొలగి పోవడానికి 5 మార్గాలున్నాయి. నశించడం, ఎవరైనా దొంగిలించడం, అమ్మివేయడం, దానమివ్వడం, త్యాగం చేయడం.*

*నశించిపోవడం అనేది ప్రకృతి నియమానుసారంగా జరిగేపని. అయినా దానివల్ల మనకు దుఃఖం కలగడం సహజం. ఎవరైనా దొంగిలిస్తే మరలా దొరుకుతుందేమోనని ఆశ, కోరిక ఉంటాయి. అమ్మితే దాని వెల మనకు ముడుతుంది. దానం అలా కాదు. దానం చేసిన వాడి మనసులో ఎదుటివారి కష్టాన్ని గురించిన ఆలోచన ఉంటుంది. దానం తీసుకున్నవాడు మనకు కృతజ్ఞతలు తెలుపుతాడు. అది మనకు సంతోషాన్ని కలిగిస్తుంది. కానీ త్యాగము ఇంకొకమెట్టు పైది. దు:ఖం, కోపం, అహంకారం ఇలాంటివేవీ లేకుండా నిస్వార్థ బుద్ధితో చేసేది త్యాగం.*

*మనిషి జీవితంలో ఉన్నతిని పొందడానికి త్యాగభావననే అత్యంత ఆవశ్యకమయిన గుణం. వ్యక్తి, కుటుంబం, సంస్థ, సమాజం, దేశం ఇంతెందుకు మానవులందరి అభివృద్ధికి త్యాగగుణం తప్పనిసరి. ఏమహనీయులు జీవితం గమనించినా మనకు ఇదే తెలుస్తుంది. ఝాన్సీలక్ష్మీబాయి, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, తిలక్, సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ వంటి మహనీయులు తమ త్యాగమయ జీవితాల కారణంగానే గొప్పవారైనారు.*

*శాస్త్రవేత్తలు ఆకలిదప్పులు మరచి, అన్ని సుఖాలు వదిలి, త్యాగమయ భావంతో కృషిచేస్తారు. లోక కళ్యాణం కోసం కష్టాలు పడ్డారు. యాతనలు సహించారు. సమాజ సుఖం కోసం వ్యక్తి తన సుఖాన్ని త్యాగం చేయాలని వారి జీవితాలు మనకు బోధిస్తున్నాయి.*

*ప్రతిఫలం ఏమాత్రం ఆశించకుండా నిరహంకార భావంతో చేసిన త్యాగం చాలా గొప్పది. త్యాగబుద్ధితో ఉండాలంటే ధైర్యసాహసాలు కావాలి. ఎప్పుడూ తన గురించి, తన పొట్టనింపుకోవడాన్ని గురించి ఆలోచించే వ్యక్తికి త్యాగబుద్ధి ఉండదు.*

*త్యాగధనులు, కర్తవ్యదీక్ష ఉన్నవారు. క్రమశిక్షణ కలిగిన వ్యక్తులు సమాజంలో ఈనాడు ఎక్కువ సంఖ్యలో కావాలి. నిత్యజీవితంలో త్యాగభావన వ్యక్తుల మనసులలో నెలకొనాలి. అప్పుడే సమాజం యొక్క ఉన్నతి సాధ్యమవుతుంది.*

### ఆ) తరగతి కృత్యం – జట్టుపని

- మీ గ్రామం కోసం / ఊరికోసం త్యాగబుద్ధితో సహాయం చేసేవారి గురించి తెల్పండి. త్యాగబుద్ధి ఉన్నవారివల్ల ఏం మేలు జరుగుతుంది?

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మనదేశం కోసం త్యాగం చేసిన మహనీయుల గురించి తెల్సుకొని చెప్పండి.

బ్రతికినన్ని నాళ్ళు ఫలములిచ్చుటె గాదు
చచ్చికూడ చీల్చి యిచ్చు తనువు
త్యాగభావమునకు తరువులె గురువులు
లలిత సుగుణ బాల! తెలుగుబాల.

చెట్లు బ్రతికినంత కాలం మధురమైన ఫలములను ఇస్తాయి. చనిపోయిన తర్వాత కూడా చెట్లు కలపగా, వంట చెఱుకుగా ఉపయోగపడుతున్నాయి. త్యాగ భావముతో చెట్లను మించినవి మరియేవియూ లేవు కదా!

**సూక్తి**

**ఇతరుల శ్రేయస్సు కోసం మన సర్వం అర్పించడమే త్యాగం. త్యాగభావానికి చెట్లే ఆదర్శం.**

# 4 మాట్లాడడం

## I. ప్రధాన విలువ

జీవన నైపుణ్యాలు

## II. ఉప విలువ

మాట్లాడడం ఒక కళ

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ఇతరులతో ఎలా మాట్లాడాలో తెలుసుకుంటారు.
- మంచిగా మాట్లాడేవారిని ఎవరైనా అభిమానిస్తారని తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

మాట్లాడటం ఒక కళ. సమయానుకూలంగా పిల్లలు మాట్లాడగలగాలి. ఎవరితో ఏ సందర్భంలో ఎలా మాట్లాడాలో విద్యార్థులు తెలుసుకోవాలి. ప్రస్తుత కాలంలో మంచి విద్యాబుద్ధులు నేర్చినవారు కూడా నలుగురితో కలిసి మాట్లాడలేకపోతున్నారు. స్టేజిమీద నలుగురిని ఉద్దేశించి మాట్లాడలేకపోతున్నారు. మాట్లాడే కళ లేకపోవటం వల్ల వారి వ్యవహారాలు సరిగా నిర్వర్తించలేకపోతున్నారు. మనుషుల సమస్త వ్యవహారాలు చక్కబడటం లేదా చెడిపోవడం మాటతీరువల్లనే జరుగుతూ ఉంటుంది. చదువనేది లేకపోయినా దళారులు మాటమీదనే లక్షలు, కోట్లరూపాయల లావాదేవీలు నెరుపుతూ ఉన్నారంటే మాటకు ఎంత విలువ ఉందో ఊహించవచ్చు. కనుక సందర్భానుగుణంగా మాట్లాడడం పిల్లలు అలవర్చుకోవాలి.

## V. సంఘటనలు

### సంఘటన – 1

సతీష్ ఇంటికి వాళ్ళ నాన్న స్నేహితుడు వెంకటరామయ్య వచ్చాడు. ఆయన వచ్చేసమయానికి ఇంట్లో సతీష్ ఒక్కడే ఉన్నాడు. టి.వి చూస్తున్నాడు. వెంకటరామయ్య బాబూ! మీ నాన్నగారు ఉన్నారా? అని అడిగాడు. టి.వీలో మునిగిపోయిన సతీష్ కనీసం తలెత్తైనా చూడకుండా 'లేరు' అని సమాధానమిచ్చాడు. ఎక్కడకెళ్ళారు. ఎప్పుడొస్తారు. వరుసగా ప్రశ్నలడిగాడు వెంకటరామయ్య. సతీష్ చిరాకుగా మొహంపెట్టి 'ఏమోనాకు చెప్పి వెళతారా తెలీదు' అన్నాడు. వెంకటరామయ్యకు సతీష్‌లో ఈమాట చెప్పడానికి అంత చిరాకెందుకు అన్నాడు. వెళ్ళిపోయాడు.

అదే వెంకటరామయ్య అదే వీధిలోనే ఇంకో స్నేహితుడైన రాఘవయ్య ఇంటికి వెళ్ళాడు. రాఘవయ్య కొడుకు అజయ్ ఎదురొచ్చాడు. వెంకటరామయ్యను చూసిన అజయ్ చిరునవ్వుతో నమస్కారమండి. బాగున్నారా? అని పలకరించాడు. సంతోష్‌ను అడిగినట్లుగానే అజయ్‌ని మీనాన్నగారున్నారా? అని అడిగాడు. మీరు ఇలా కూర్చోండి. నాన్నగారు వస్తారు. బజారుకెళ్ళారు. అని చెప్పాడు అజయ్. చిరునవ్వుతో పలకరించడమే కాకుండా కూర్చోమని మర్యాద చేయడంతో అజయ్ అంటే మంచి కుర్రాడనే అభిప్రాయం కల్గింది వెంకటరామయ్యకు. వెరిగుడ్! కుర్రాళ్ళంటే నీలాగా ఉండాలయ్య అన్నాడు.

### సంఘటన – 2

ఒక నగరంలో ఇద్దరు మంచి స్పెషలిస్టు డాక్టర్లు ఇద్దరు సమానమైనా హోదా కలిగియున్నారు. ఇద్దరి హాస్పిటల్స్ పక్కపక్కనే ఉంటాయి. కాని ఒక హాస్పిటల్ ఎప్పుడు రద్దీగా, జనాలతో కనిపించేది. ఇంకో హాస్పిటల్ ఖాళీగా, తక్కువ మందితో కనిపించేది. ఎందుకంటే రద్దీగా ఉన్న హాస్పిటల్‌లో పనిచేసే వైద్యుడు వచ్చిన పేషంట్లకి 15ని॥లు సమయాన్ని కేటాయిస్తూ శాంతంగా వారిని నవ్వుతూ పలకరించేవాడు. వారితో కలివిడిగా ఒక ఇంటి మనిషిగా కలిసిపోయి మాట్లాడడం, ఓపికతో వాళ్ళ సమస్యలను (బాధలను) తెలుసుకొని తగిన సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. తరువాత ట్రీట్‌మెంట్ ఇచ్చేవాడు. వచ్చిన పేషంట్లను మానసికంగా ఉత్తేజపరిచేవాడు. అలా చేయడం ద్వారానే పేషంట్లకి సగం రోగం తగ్గిపోయేది.

జనాలు తక్కువగా ఉన్న హాస్పిటల్ డాక్టరు వచ్చిన పేషెంట్లతో ఏమి మాట్లాడడు. వాళ్ళు ఏదైనా చెప్పబోతే విసుక్కుంటూ నేను చూస్తున్నాగా అంటాడు. సీరియస్‌గా, సైలెంట్‌గా బీపి చెక్‌చేయడం, ఉన్న రోగమేమిటో అడిగి, చెప్పినదానికి మాత్రమే మందులు రాసి ట్రీట్‌మెంట్ చేసేవాడు. ఆ మందులు కూడా ఎప్పుడెప్పుడూ వేసుకోవాలో పక్కనున్న నర్సు లేదా మెడికల్ షాపులో పనిచేసే అబ్బాయి చెప్పేవాడు. ఇలా చేయడం ద్వారా పేషంట్స్ డాక్టర్ బాగా చూస్తాడని తెలిసినా అసలు మాట్లాడనివ్వడు, మాట్లాడడు, సీరియస్‌గా ఉండడం వంటి ప్రవర్తనల వల్ల వెళ్ళడానికి ఇష్టపడే వాళ్ళు కారు.

*సంఘటన - 3*

*పల్లెటూరులో ఉండే రామయ్య, సీతమ్మ తమకుమారుడుని, కోడల్ని, పిల్లలను చూద్దామని పట్నం బయలుదేరారు. వారికుమారుడు, కోడలు ఇద్దరూ ఉద్యోగస్తులు వారు ఒక అపార్టుమెంటులో ఉండేవారు. ఉదయం డ్యూటీకి వెళ్ళి చీకటి పడ్డాక వచ్చేవారు. పిల్లలు స్కూల్‌కి వెళ్ళి అటునుంచి ట్యూషన్‌కి వెళ్ళి వాళ్ళు కూడా రాత్రికి వచ్చేవారు. దీంతో రామయ్యకు సీతమ్మకు ఇంట్లో ఏం చేయాలో తోచేదికాదు. వారితో మాట్లాడేవారు ఎవ్వరూ లేరు. కొత్త ప్రదేశం కాబట్టి, ఇరుగుపొరుగు ఎవరు తెలీదు నాలుగు రోజులు ఉందామని వచ్చిన వారికి పట్నం అంతగా నచ్చలేదు. కారణం పల్లెటూరులో అయితే ఇరుగుపొరుగు కలిసిమెలిసి ఉండేవారు ఒకరి కష్టసుఖాలలో ఒకరు పాలుపంచుకొనేవారు. ఇక్కడ కొడుకు కోడలు డ్యూటీ చేసి అలిసిపోయి ఇంటికి వచ్చేవారు వీరితో మాట్లాడే ఓపిక, తీరిక వారికి ఉండేది కాదు. వీరికి అన్ని వసతులు కల్పించినా చిరునవ్వుతో పలకరించేవారు కరువయిపోయారు. దీంతో రామయ్య, సీతమ్మ నాలుగు రోజులు పట్నంలో కొడుకు కోడలు పిల్లలతో సంతోషంగా గడుపుదామని వచ్చినవారు రెండురోజులు కూడా ఉండలేక ఊరికి ప్రయాణం అయ్యారు.*

*సంఘటన - 4*

*ఒక పల్లెటూరులో ఉండే రంగయ్య తన కుమారుడిని చూడడానికి పట్నం వెళ్ళాడు. రంగయ్యను చూడగానే అతని కుమారుడు, కోడలు పిల్లలు ఎంతో సంతోషించారు. రంగయ్య కుమారుడు రోజూ రంగయ్యను ఉదయం వాకింగ్‌కు తీసుకెళ్ళేవాడు. కోడలు త్వరగా తనపనులు చేసుకొని మామగారితో కబుర్లు చెప్పేది కొడుకు, కోడలు, పిల్లలు రంగయ్యను చిరునవ్వుతో పలకరించేవారు. దీంతో రంగయ్యకు సమయం తెలిసేది కాదు సాయంత్రం పిల్లలు స్కూల్ నుంచి రాగానే తాతగారి దగ్గర చేరి కథలు చెప్పించుకునేవారు. అందరూ కలిసి గుడికి గాని పార్కుకుగాని వెళ్ళేవారు. పట్నంలో నాలుగు రోజులు ఉందామని వచ్చిన రంగయ్య నెల రోజులు ఉండిపోయాడు.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

- పై సన్నివేశాలను విన్నారు కదా! మీకేమర్థమయ్యింది ?

1) మనం ఎలా మాట్లాడితే మనల్ని ఇతరులు ఇష్టపడుతారు?

2) మీరు ఇతరులతో ఎలా మాట్లాడాలనుకుంటున్నారు?

3) నవ్వుతూ పలకరించడం వల్ల కలిగే ప్రయోజనమేమి?

4) ఇతరులు నిన్ను నవ్వుతూ పలకరిస్తే నీకేమనిపిస్తుంది?

### తెలుసుకోండి

*మనం ఎందుకు మాట్లాడుతాం? మనలోని భావాలను, మన అభిప్రాయాలను, మన అవసరాలను ఇతరులకు తెలియజేయడానికి, సంబంధబాంధవ్యాలను పెంచుకోవడానికి మాట్లాడతాం మాట్లాడటం అనేది చాలా రకాలుగా ఉంటుంది చిరునవ్వుతో ఆత్మీయంగా మాట్లాడటం, సంతోషంగా మాట్లాడటం, ఆనందంగా మాట్లాడటం, కోపంగా మాట్లాడటం, విసుగ్గా, చిరాగ్గా మాట్లాడటం. మనిషి మాటతీరు ఆ మనిషి ఎలాంటివాడో తెలియజేస్తుంది. మనిషి ఎలాంటివాడో తెలుసుకోవాలంటే అతనితో కాసేపు మాట్లాడితేచాలు. కనుక మనం మంచివారమా? వినయ విధేయతలు కలవారమా? కాదా? అనేది మనం మాట్లాడే విధానంలోనే తెలుస్తుంది.*

*మంచిమాట, ప్రియమైన మాట ఎంతటివారినైనా ఆత్మీయులుగా మారుస్తుంది. కనుక మనం చిన్నవారినైనా, పెద్దవారినైనా వారు కనిపించినపుడు ఆత్మీయంగా పలుకరించాలి. అలాగే ఇంటికి వచ్చిన వారిని చిరునవ్వుతో ఆప్యాయంగా ఆదరించాలి. మనం కఠినంగా మాట్లాడితే ఎదుటివారికి బాధకలుగుతుంది, కోపం వస్తుంది. అదే ప్రియంగా మాట్లాడితే ఎంతటి కోపమైనా తగ్గిపోతుంది. ఉదా॥ మీరు సైకిలు మీదవెళ్తూ ఉన్నారు పొరపాటున ఒకరికి తగిలింది వారు చాలాకోపంగా మీవైపు తిరిగారు. అపుడు వారికోపం చల్లార్చడానికి 'సారీ' అన్న ఒక్కమాట చాలు కోపం చప్పున చల్లారిపోతుంది.*

*మాట మనిషి విలువను పెంచుతుంది. పెళ్ళిళ్ళకు, ఫంక్షన్లకు వెళ్ళినపుడు ఎదుటివారు పలుకరించనిదే నేనెందుకు మాట్లాడాలి అని అనుకోకూడదు. తెలిసినవారు కనిపించినపుడు నవ్వుతూ ఆప్యాయంగా పలుకరించాలి.*

*అత్యంత శక్తివంతమైన ఔషధం, ఆయుధం మాటలే అంటారు పెద్దలు. మంచి మాటలద్వారా మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి ఎంతటి జబ్బునైనా నయం చేయవచ్చు. మాటల ద్వారానే మనిషిని చిత్రవధ చేయవచ్చు (హింసించవచ్చు) కత్తికన్నా పదునైన ఆయుధం మాటలు, కత్తితో శరీరానికి అయిన గాయం కొన్ని రోజులకు తగ్గిపోతుంది కానీ మాటలతో మనసుకు అయిన గాయం మాత్రం మాసిపోదు. కనుక ఎవరితో మాట్లాడినా వారిని నొప్పించకుండా, గౌరవంగా, మంచిగా మాట్లాడటం అలవాటు చేసుకోవాలి.*

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

**ఈ కింది వాటి గురించి జట్లలో చర్చించి చెప్పండి?**

1) మీరు ఇతరులతో మాట్లాడటానికి బిడియపడిన సందర్భాలు ఏవి? ఎందుకు?

2) మీతో ఎవరైనా మంచిగా మాట్లాడినపుడు మీకు ఎలా అనిపిస్తుంది? ఎందుకు?

3) మీ ఇంట్లో కాని, మీ స్నేహితులలోగాని ఎవరెవరు మీతో మంచిగా మాట్లాడుతారు? ఎవరెవరు చిరాగ్గామాట్లాడుతారు?

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మీరు ఈ వారంరోజులు అందరితో ఆత్మీయంగా, గౌరవంగా మాట్లాడండి. మీ అనుభవాలను చెప్పండి.

### ఇలా చేయండి

- ఎదుటివారు మనల్ని ఎలా పలకరిస్తే మనం సంతోషిస్తామో, ఏవిధంగా మాట్లాడితే ఆనందం కలుగుతుందో మనమూ అలాగే మాట్లాడితేచాలు గౌరవం దానంతట అదే వస్తుంది. అందుకే "నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది" అన్నారు. మంచి మాటలవల్ల సంపదలు కల్గుతాయి. బంధుమిత్రులు దగ్గరౌతారు. అదే నోరు కఠినంగా మాట్లాడినా, అసత్యం చెప్పినా, చాడీలు చెప్పినా, అనవసరంగా మాట్లాడినా కష్టాలు కలగడమే కాదు శత్రువులు ఎక్కువౌతారు. అందుకే అందరికీ నచ్చేలా మన మాట మృదువుగా ఉండాలి. అలా మాట్లాడండి.

**సూక్తి**

మృదువైన మాటలు మనుషుల మధ్య స్నేహాన్ని పెంచుతాయి. అదే మాటలు కఠినమైతే దూరాలు పెరుగుతాయి. మిత్రత్వం, శతృత్వం అంతా మాటల ప్రభావమే

# 5 కర్తవ్యం

## I. ప్రధాన విలువ

బాధ్యతలు నిర్వర్తించడం – కర్తవ్యపాలన

## II. ఉప విలువ

పెద్దలఎడల గౌరవం – వారు చెప్పినట్లుగా నడుచుకోవడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- పెద్దల ఎడల గౌరవం కలిగి యుండడం, వాళ్ళమాటలను గౌరవించడం, అందుకనుగుణంగా ప్రవర్తించడం, పెద్దలపట్ల తమకున్న బాధ్యతలను గుర్తించి ప్రవర్తించడం ఎలాగో తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

'పెద్దలమాట చద్దిమూట' అనే సామెత ఉంది కదా! పెద్దలు ఏది చెప్పినా వారి అనుభవాలతో మన మంచికోసం చెబుతారు. వారి మాటలను గౌరవించి, వాళ్ళు చెప్పినట్లుగా నడుచుకుంటే మనకు ఎంతోమేలు కలుగుతుంది. వారిపట్ల మంచి ప్రవర్తనను కల్గియుండాలి. ఇలా ఇతరులను, పెద్దలను గౌరవించడంవల్ల విలువ, గౌరవం పెరుగుతుంది. మంచి సంబంధాలు ఏర్పడుతాయి. ఇలా మంచి నడవడికతో మెలగడమే మన కనీస బాధ్యత అని తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## V. విషయ వివరణ

*సంఘటన – 1* **మూడు నగలు**

*కలకత్తాలో ఠాకూర్‌దాస్ అనే వయోవృద్ధుడు ఉన్నాడు. ఆయన తన భార్యాపిల్లలతో కలిసి కలకత్తా నుండి బయలుదేరి మోదీనగర్ జిల్లాలోని ఒక గ్రామంలో నివసించసాగాడు. రెండు రూపాయల జీతంతో ఉద్యోగం చేస్తూ కుటుంబపోషణ చేస్తున్నాడు. ముగ్గురు సభ్యులుగల ఆకుటుంబం నెలకు రెండు రూపాయల ఆదాయంతో పొట్టనింపుకోవడం ఎంతో కష్టమౌతున్నది. విధి బలీయం, కొంతకాలానికి ఠాకూర్‌దాసు స్వర్గస్థుడయ్యాడు. సంసారభారం యావత్తూ అతని భార్యమీద పడింది. రోజులు ఎలాగో గడుస్తున్నాయి. ఏళ్ళు గడిచిపోయాయి. ఒక నాటి రాత్రి కుమారుడు తల్లిదగ్గర కూర్చొని ఆమె పాదాలు ఒత్తుతూ "అమ్మా! పెద్దవాణ్ణి అయిన తర్వాత చదువుకొని నేను ఒక విద్వాంసుడవుతాను. నీకు బాగా సేవ చేస్తాను" అన్నాడు ఆ బాలుడు. ఆ మాటలు విని "ఎలాంటి సేవ చేస్తావు?" అంది తల్లి.*

*"నువ్వు నన్ను ఎంతో కష్టపడి చదివిస్తున్నావు. నేను పెద్ద ఉద్యోగం చేసి బాగా డబ్బు సంపాదిస్తాను. అప్పుడు నీకు మంచి ఆహారం తెచ్చి ఇస్తాను. నగలు కూడా తెస్తాను అన్నాడు. "ఔను నాన్న. తప్పకుండా సేవ చేస్తావు నీవు! నాకు తెలుసు. కానీ నాకు మూడు నగలు మాత్రం తేవాలి సుమా!" అంది. "అవి ఏంటో చెప్పు?" అన్నాడు బాలుడు. "నాయనా! మన ఊళ్లో మంచి స్కూలు కావాలి. వైద్యశాల కావాలి. నిస్సహాయులైన పేద పిల్లలకు తిండి, గుడ్డ సమకూర్చాలి ఇవే ఆ మూడు నగలు" అని చెప్పిందా ఆ బాలుడితల్లి.*

*ఆ బాలుడు తల్లి మాటకు స్పందించాడు. ఇటువంటి సామాజిక భావాలున్న తల్లి ధన్యురాలు అనుకున్నాడు. ఆనాటి నుండి తల్లి కోరికను తీర్చడానికి పూనుకున్నాడు. అహర్నిశలు శ్రమించాడు. చదువు పూర్తయ్యాక ఉన్నత పదవులు పొందాడు. తల్లికిచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. వరుసగా విద్యాలయాలు, వైద్యశాలలు, సహాయకేంద్రాలు ప్రారంభించాడు. తన పుత్రుని ద్వారా లభించిన మూడు నగలవల్ల అతని తల్లి ఎంతో గౌరవస్థానాన్ని సంపాదించింది. ఆ వ్యక్తే ఈశ్వరచంద్ర విద్యాసాగర్. అతని సమాజసేవ అందరికీ ఆదర్శప్రాయమైనది. ఈ విధంగా విద్యాసాగర్‌గారు తనకర్తవ్యాన్ని చాటుకున్నారు. పెద్దలఎడ గౌరవం, వారికిచ్చిన మాట ప్రకారం కర్తవ్యాన్ని నిర్వర్తించడం, సమాజసేవ చేయడం ద్వారా ఎంతో పేరు గడించాడు.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఏంచేశాడు?
2) తల్లిమాటలను గౌరవించినప్పుడు ఆ తల్లికెంతో సంతోషం కలిగింది కదా! మీరు పెద్దలను గౌరవించినప్పుడు మీకెలా అనిపిస్తుంది?
3) పెద్దలు చెప్పిన మాటలు విని, మీరు ఆ పనిచేసినప్పుడు మీకెలా అనిపిస్తుంది?
4) పెద్దలుచెప్పినట్లు వినకుండా మీరుంటే మీకెలా అనిపిస్తుంది? మీ గురించి పెద్దవాళ్ళు ఏమనుకుంటారు?
5) పెద్దలు చెప్పినా వినకుండా వారికి బాధకల్గించడం సరైనదేనా?

## తెలుసుకోండి

కనిపెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను గౌరవించడం మానవుని కనీస ధర్మం. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువు మనకు జీవితాన్ని ఇస్తాడు.

మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్యదేవోభవ అనే సూక్తులు నిత్యం వింటూనే ఉన్నాం. మనకు ఆది గురువులు తల్లిదండ్రులే. మనిషి జన్మనిచ్చి, పాలించి పోషించడంలో తల్లిదండ్రులు పడే శ్రమకు మనం ఎన్నివందల జన్మలెత్తినా, ఏమి చేసినా ఋణం తీర్చుకోలేము. తల్లిదండ్రులు దైవసమానులు. కాబట్టి వారు ఏమి చెప్పినా, ఏది చేసినా మనమంచికోసమే చేస్తారు. ఎన్నో కష్టాలకు ఓర్చుకొని మన భవిష్యత్తు బాగుండాలని తాపత్రయపడుతారు. అలాగే తల్లి దండ్రుల తర్వాత గురువు మనకు విద్యాబుద్ధులు నేర్పి మనలో శీల నిర్మాణం జరగడానికి మనం మంచి వ్యక్తులుగా తయారవడానికి తోడ్పడుతాడు. కావున మనం తల్లిదండ్రుల పట్లకాని, గురువులపట్ల కాని ఇతరుల పట్ల, పెద్దల పట్ల ఓరిమితో వినయంతో క్రమశిక్షణ కల్గియుండాలి. వారి మనస్సును బాధపెట్టకుండా వారు చెప్పింది విని వారు చెప్పిన మార్గంలో నడుచుకోవాలి. మనం అలా నడిచినట్లయితే వారు మనల్ని చూసి ఎంతో సంతోషిస్తారు. మనకు కూడా మంచి జరుగుతుంది. ఇలా ఉండడం మన బాధ్యత అని మనం గుర్తించాలి. దీని ద్వారా సమాజంలో మనకు గౌరవం, విలువ పెరుగుతాయి. మంచి సంబంధాలు ఏర్పడుతాయి.

### అ) తరగతి కృత్యం - జట్టుపని

- మీకోసం పెద్దవాళ్ళు ఎన్నో చేస్తున్నారు కదా! మీరు పెద్దవాళ్ళ కోసం ఏమేమి పనులు చేస్తున్నారో జాబితా తయారు చేయండి.

### ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- ఒక వారంరోజులు మీ పెద్దవాళ్ళు (అమ్మ, నాన్న, తాత, నానమ్మ) చెప్పినదల్లా చేయండి. వాళ్ళని గురించి ఏమనుకుంటున్నారో చెప్పండి.

**సూక్తి**

మనం ఇతరులను గౌరవిస్తే, మనం గౌరవించబడతాం.

# 6 విద్యుత్తు పొదుపు

## కష్టకాలం

### I. ప్రధాన విలువ

పొదుపు - ఆవశ్యకత

### II. ఉప విలువ

విద్యుత్తు పొదుపుపై అవగాహన కల్గి ఉండడం

### III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- మానవకోటికి అన్ని రంగాల్లోను విద్యుత్తు అవసరం విపరీతంగా పెరిగింది. కాబట్టి విద్యుత్తును ఎంత అవసరమో అంతే వినియోగించుకోవడం వల్ల మనం విద్యుత్తును ఉత్పత్తిని పెంచుకున్నట్లే అనే విషయం తెలియజేయడం.

### IV. ఉపోద్ఘాతం

నిద్ర నుండి లేవగానే మనం ఉపయోగించే పళ్ళపొడి మొదలుకొని రాత్రి నిద్రపోయే వరకు మనం వాడుకొనే ప్రతి వస్తువు ప్రత్యక్షంగానో మరోక్షంగానో విద్యుత్తుతో ముడిపడి ఉన్నవే. అలాంటి విద్యుత్తును ఎంత ఉత్పత్తి చేస్తున్నామో అంతకంటే ఎక్కువ ఖర్చు చేస్తుంటే, ఆ ఖర్చులో కూడా వృథా ఖర్చు ఉంటే కరెంట్‌తో కష్టాలు తప్పవు. అందుకే మనం విద్యుత్తు ఆవశ్యకతను గుర్తించాల్సిన అవసరం ఉంది. దాన్ని అవసరం మేరకే వినియోగించాలనే విషయం మనం గుర్తుపెట్టుకోవాలి. పది మంది గుర్తుపెట్టుకొనేలా చేయాలి.

## V. సంఘటనలు

**సంఘటన – 1** **"మనమేం చేయాలి?"**

రాధిక పరీక్షలయ్యాక వాళ్ళమ్మమ్మ వాళ్ళ ఊరికెళ్ళింది. ఆ ఊరంటే రాధికకు చాలా ఇష్టం. ఎందుకంటే ఆ ఊళ్ళో ఉండే వాళ్ళందరూ చాలా క్రమశిక్షణతో మెలగుతారు. అందుకే ఏ కొంచెం అవకాశం ఉన్నా ఆ ఊరుకెళ్ళాలని అక్కడ ఎంతో నేర్చుకోవాలని అనుకుంటుంది రాధిక.

ఆ ఊర్లో తీసుకునే ప్రతి నిర్ణయానికి "రచ్చబండ"నే వేదికౌతుంది. గ్రామంలో ఉండే పిల్లా పెద్ద అందరూ వారివారి సమయానుకూలంగా చేరి నిర్ణయాలు తీసుకొని అందరికీ చేరవేస్తే వాటిని అందరూ ఆచరిస్తారు. రాధిక వెళ్ళిన తెల్లవారే రచ్చబండ ఉన్నట్లు తెలవగానే వాళ్ళ తాతయ్యతో కలిసి వెళ్ళాలని అనుకొన్నది. మహాసంతోషంతో వెళ్ళింది. ఆనాటి రచ్చబండ కార్యక్రమం మొదలైంది. ఆనాటి చర్చ "విద్యుత్తు' పైన అని ఆ ఊరి పెద్ద ప్రకటించాడు. మనకు రాబోయే కాలంలో విద్యుత్తు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే మనం ఏం చేయాలో మీ అందరూ చెప్పండి అని అన్నారు.

చర్చ మొదలైంది. ఒక్కొక్కరు ఒక్కోవిషయాన్ని చెబుతున్నారు.

ఒకటోవ్యక్తి : మన గ్రామంలో ఉండే వీధి దీపాల్ని చీకటి పడుతుందనగా వేయాలి మళ్ళీ కోడి కూతతోనే ఆర్పేయాలి.

రెండోవ్యక్తి : మన పొలాల్లో నీళ్ళు పట్టేటప్పుడు మనం దగ్గరే ఉండి అవసరం తీరగానే మోటర్లను బంద్ చేయాలి.

మూడోవ్యక్తి : మనం ఇళ్లల్లో వాడే ఫ్రిజ్‌లు, టివిలు, ఫ్యాన్లు, మిక్సీలు మొదలగు వాటిని మన వినియోగం మేరకే వాడుకోవాలి. ఫ్యాన్లు, ట్యూబ్‌లు, బల్బులు మనం ఎవ్వరం లేని సమయాల్లో బంద్‌చేయాలి.

నాల్గోవ్యక్తి : అదెలా సాధ్యం?

ఐదోవ్యక్తి : ఎందుకు సాధ్యం కాదు? మనలో ఎవరో ఒకరు అక్కడ ఉన్నప్పుడే లేదా వాటి అవసరం ఉన్నప్పుడే వాడేలా జ్ఞప్తికి పెట్టుకొని ఓ వారం రోజులు ఇంటిల్లిపాది ప్రయత్నంచేస్తే బోలెడంత కరెంట్ మిగులుతుంది.

ఆరోవ్యక్తి : మీరెంత సేపటికీ మన ఇళ్ళలోని కరెంటుగూర్చే మాట్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కూడా అలాగే చేయాలి.

రెండోవ్యక్తి : ఔను మీరు చెప్పింది నిజం. ఎక్కడైనాసరే ఎంత విద్యుత్తు ఎంత మనకు అవసరమో అంతే వాడుకొంటే నిలువ చేసుకున్నట్లే కదా!

ఏడవవ్యక్తి : వ్యాపారులు పగటివేళలో వీలైనంతమేరకు సూర్యుని వెలుతురు ఉపయోగించుకొనే ప్రయత్నం చేయాలి. ఆ ఏర్పాట్లు చేసుకొంటే మంచిది.

| | | |
|---|---|---|
| *మొదటివ్యక్తి* | : | *ఒక్క వ్యాపారులకే కాదు. ఇది ఎవరికైనా వర్తిస్తుంది.* |
| *ఐదోవ్యక్తి* | : | *మన గ్రామంలో జరిగే కార్యక్రమాల్లో అంటే పెళ్ళిళ్ళు, దేవతా ఉత్సవాలు, మొదలైన వాటిలో కూడా ఆడంబరాలకు వెళ్ళరాదు.* |
| *నాల్గోవ్యక్తి* | : | *అంటే ఏం చేయాలంటావ్?* |
| *మూడోవ్యక్తి* | : | *ఏముంది? వీధులకు వీధులు విద్యుత్ దీపాలతో అలంకరించటం, సర్వీస్‌లైన్ల నుండి దొంగతనంగా హైటెన్షన్ పెన్సిల్స్‌ను ఎక్కువ మొత్తంలో ఏర్పాట్లు చేసుకోవటం లాంటివి చేయకూడదు.* |
| *ఆరోవ్యక్తి* | : | *ఒకవేళ ఇలా ఎవరైనా చేస్తే వాళ్ళకు పదిహేను రోజులో, నెలరోజులో కరెంట్‌కట్ చేయాలి.* |
| *ఎనిమిదోవ్యక్తి* | : | *ఇళ్ళు, వ్యాపార సంస్థల యజమానులకు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు కూడా ఇలాంటి శిక్షలే అమలుచేయాలి.* |
| *ఊరిపెద్ద* | : | *అందరి చర్చను విన్న తర్వాత మీరు చెప్పిన విధంగానే శిక్షలు అమలుచేసేందుకు సిద్ధం అని ప్రకటించాడు.* |
| *తొమ్మిదోవ్యక్తి* | : | *శిక్షవేయాలనేట్లు కాకుండా అందరం విద్యుత్తును అవసరంమేరకు వాడుకొనేలా చూడాలి. అందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలి.* |
| *ఊరుపెద్ద* | : | *ఔనౌను. విద్యుత్తును పొదుపుచేసుకుని రేపటి కాలానికి నిలువచేసుకొని మనజిల్లాలో మంచి గ్రామంగా పేరొందటానికి మనం ప్రయత్నించాలి.*<br>*అనేక విషయాల్లో మన గ్రామం ముందంజలో ఉంది . ఇప్పటి నుండి మన ఇళ్ళలో, బళ్ళలో పిల్లలకు అవగాహనకల్పించి విద్యుత్తును పొదుపుగా వాడేలా చూద్దాం.* |

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) ఈ పాఠంలోని చర్చయొక్క సారాంశం ఏమిటని మీరు గ్రహించారు?

2) మీ ఇంట్లో విద్యుత్తును అవసరంమేరకే వాడుతున్నారా?

3) విద్యుత్తును వృథాగా ఎక్కడ వాడుతున్నారో చెప్పండి?

4) అ) కార్యాలయంలో ఎవరూ లేరు. ఫ్యాన్లు తిరుగుతున్నాయి. లైట్లు వెలుగుతున్నాయి.
మీ ఇంట్లో ఎవరూ లేరు టీ.వి నడుస్తోంది.

ఈ సందర్భాలను మీరు చూశారు? మీరు ఏమి చేస్తారు? అలా ఎందుకు చేస్తారు?

## తెలుసుకోండి

*ప్రస్తుత కాలంలో విద్యుత్తు మన జీవితంలో ఒక భాగమైపోయింది. ఉదయం నిద్రలేచింది మొదలు మళ్ళీ మరుసటిరోజు ఉదయం నిద్రలేచేవరకు అంటే 24 గంటలలో మనం విద్యుత్తును ఉపయోగించని సమయమంటూ ఉండదు. అంతగా మనకు విద్యుత్తు ఉపయోగపడుతున్నది. విద్యుత్తును మన అవసరం మేరకు ఉపయోగించటంలో తప్పులేదు కానీ మనం విద్యుత్తును అవసరం లేనపుడు కూడా ఉపయోగించి దుర్వినియోగం చేస్తున్నాము.*

*వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో, ఇండ్లలో అవసరం లేకున్నా ఉదయం పూట లైట్లువేయడం వల్ల, వేసిన లైట్లను, ఫ్యాన్లను ఆపకపోవడంవల్ల, ఉదయం సమయంలో కూడా వీధి దీపాలు వెలగడంవల్ల పెళ్ళిళ్ళలో పండుగలలో అలంకరణలో భాగంగా విద్యుత్‌దీపాలను ఉపయోగించడం వల్ల ఇలా చాలా రకాల కారణాలవల్ల మనం విద్యుత్తును దుర్వినియోగం చేస్తున్నాం. ఉత్పత్తి అయిన విద్యుత్తును వాడుకోవడంకన్నా దుర్వినియోగం చేయడం ఎక్కువవుతోంది. దీనివల్లే విద్యుత్ కొరత ఏర్పడుతోంది. ఈ కొరత వేసవికాలంలో ఎక్కువగా ఉంటుంది. మీరు గమనించే ఉంటారు. వేసవికాలంలోనే 'పవర్‌కట్'లు (కరెంటును నిలిపివేయడం) మొదలవుతాయి. దీనివల్ల మీరుకూడా ఇబ్బంది పడే ఉంటారు. ఇది ఇలా ప్రత్యక్షంగా పరోక్షంగా కూడా మనకు కష్టాన్ని, నష్టాన్ని కలుగుజేస్తుంది. ఎలాగంటే పవర్‌కట్‌ల వల్ల కరెంటులేక, మోటర్ ఆడక ఒక రైతు సమయానికి పంటకు నీరు పెట్టక పోవడం వల్ల పంట దిగుబడి తగ్గుతుంది, అలాగే పరిశ్రమలలో కూడా కరెంటు లేకపోవడం మూలాన వస్తువుల ఉత్పత్తి తగ్గుతుంది. ఫలితంగా ధాన్యాలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి మనకు నష్టాన్ని కలిగిస్తాయి.*

*"విద్యుత్ పొదుపు – ప్రగతికి మలుపు" విద్యుత్‌ని ఆదా చేయడం ద్వారా. విద్యుదుత్పత్తికయ్యే వ్యయాన్ని తగ్గించవచ్చు. దీనిని ఇతర ప్రగతిశీల కార్యక్రమాలకు ఉపయోగించవచ్చు. కనుక మీరందరూ విద్యుత్తును పొదుపు చేయండి. మన దేశప్రగతికి తోడ్పడండి.*

### ఆ) తరగతి కృత్యం – జట్టుపని

1) విద్యుత్తును పొదుపుగా వాడడానికి మీగ్రామంలో ఊరిలో ఎవరెవరు ఏమేం చేయాలో చెప్పండి. ఇందుకనుగుణంగా కొన్ని నినాదాలు రాయండి. వాటిని ప్రదర్శించండి.

2) మీ ప్రాంతంలో విద్యుత్తును ఎలా వృథా అవుతుందో దానికి కారణాలు చెప్పండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. ఈ వారంరోజులు మీ ఇంటిలో, మీ పాఠశాలలో జరిగే విద్యుత్ వృథాను అరికట్టడానికి ప్రయత్నించండి. వృథాను ఎలా అరికట్టారో చెప్పండి.

### ఇలా చేయండి

- విద్యుచ్ఛక్తిని పొదుపు చేస్తే విద్యుత్తును ఉత్పత్తి చేసినట్లే. మనకు అవసరం లేదు అనిపించిన వెంటనే కరెంటు దీపాల్ని, ఫ్యానుల్ని, ఎ.సి., ఇతర సాధనాలని నిలిపివేయండి. దీని ద్వారా మనం విద్యుత్తును ఆదా చేసిన వారమవుతాం. విద్యుత్‌ను ఆదాచేసే లైట్లను ఉపయోగించండి. ఒక నెలలో మీ ఇంటిలో అయ్యే విద్యుచ్ఛక్తి వాడకం ఖర్చును రాయండి. పైన చెప్పిన విధంగా ఆదా చేయడం వల్ల కరెంటు బిల్లులో ఎంత ఆదా చేశారో గుర్తించండి.

  1) ప్రస్తుతం మీరు విద్యుత్తును ఆదా చెయ్యడం ద్వారా కరెంటు బిల్లులో ఎంత ఆదా చెయ్యగలరో గుర్తించండి.

  2) ప్రస్తుతం మీ విద్యుత్ బిల్లు ఈ నెలలో ఎన్ని యూనిట్‌లు ఉంది. దీనిని రాబోయే నెలలో తగ్గించగలమా? ఎలా? ఆలోచించండి.

**సూక్తి**

**నేడు నీవు చేసే పొదుపు తరతరాల వారికి ఆసరా అవుతుంది.**

# 7 మన బాధ్యత

## I. ప్రధాన విలువ

పరిసరాల పరిశుభ్రత

## II. ఉప విలువ

అపరిశుభ్ర పరిసరాలు – వాటి పర్యవసనాలు గూర్చి అవగాహన కలిగించడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- మన పరిసరాలను చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచడం

## IV. ఉపోద్ఘాతం

మానవుని శారీరక, మానసిక, సాంఘికాభివృద్ధి భౌతిక పరిసరాల ప్రభావంపై ఆధారపడి ఉంటుంది. పరిసరాలలో అపరిశుభ్రమైన నీరు, మలమూత్ర విసర్జన, చెత్త పేరుకొని పోవడం వలన అవి కుళ్ళిపోయి దుర్వాసన రావడమే గాకుండా సూక్ష్మక్రిములు ఎక్కువగా పెరిగి మానవ శరీరంలోకి ప్రవేశించి వ్యాధులను కలిగిస్తాయి. ఇళ్ళనూ, బడిని, పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవడమే మంచి జీవన విధానం. ఆరోగ్యదాయకం. ఇప్పుడు మనం పరిసరాలలో చెత్త ఎలా పేరుకుపోతుంది. దాని వల్ల కలిగే ఇబ్బందులు ఏమిటి? మన బాధ్యత ఏమిటో తెలుసుకుందాం.

### ఆలోచించండి - చెప్పండి

*1. పిల్లలూ! మన పరిసరాలు అంటే ఏమిటి?*

*2. మనం చెత్తను ఎక్కడ వేస్తున్నాం?*

*3. అందరూ రోడ్లపై చెత్త వేయడంవల్ల ఏమవుతుంది?*

*4. అలాంటి పరిసరాలను మీరు చూసారా? అక్కడి వాతావరణం ఎలా ఉందో చెప్పండి.*

*5. పరిసరాలను ఎవరు అపరిశుభ్రం చేస్తున్నారు?*

## V. సంఘటనలు

***సంఘటన - 1***

*చెత్తను ఏరివేసే పనివారు పని చేయడం మానేసారు. దాంతో చెత్తంతా రోడ్డుపై గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. రోడ్డుకు రెండు వైపులా ఉండే ఫుట్‌పాతులు చెత్తతో నిండిపోయాయి. కాలినడకన రోడ్డుపై వెళ్ళేవారు. ఆ చెత్తనుండి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నారు. ఆ చెత్తగాలికి ఎగిరి ఆ పరిసరాలలో ఉండే ఇళ్ళలోకి వచ్చి పడుతుంది. చెత్త కుళ్ళడం ద్వారా వ్యాధికారక సూక్ష్మజీవులు పెరగడంతో పాటు ఎలుకలు, దోమలు, ఈగల వంటివిచేరి వ్యాధులను వ్యాపింపచేస్తున్నాయి.*

***సంఘటన - 2***

*ఇంటిముందే పెద్ద మురికి కాలువ ఆవీధిలోని వాళ్ళు ఇళ్ళలోని చెత్త అంతా ఆ కాలువలోకే వేస్తున్నారు. ఆ కాలువలో నీళ్ళుపోక చెత్త అడ్డుపడి విపరీతమైన దుర్గంధం. ఆ మురికి నీళ్ళపై తెట్టులాగ దోమగుడ్లూ. ఆ కాలువలోనే పందులు పడి దొర్లుతున్నాయి. కొంతమంది చిన్న పిల్లలు ఆ కాలువ పక్కనే మలమూత్ర విసర్జన చేస్తున్నారు. వర్షాకాలమైతే ఆ మురికి కాలువ నిండిపోయి నీరంతా ఇళ్ళలోకి వచ్చేస్తుంది.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) చెత్తను ఏరేవాళ్ళు లేకుంటే ఏమౌతుందో చెప్పండి.
2) మన పరిసరాలను ఎందుకు శుభ్రంగా ఉంచుకోవాలి?
3) పరిసరాలు శుభ్రంగా ఉండాలంటే మనం ఏం చేయాలి?
4) పరిసరాలు అపరిశుభ్రంగా ఎందుకుంటున్నాయి?
5) చెత్త, మురికి, కుళ్ళు ఉన్నచోట నివసించడం వల్ల మన ఆరోగ్యం ఎలా పాడవుతుంది?
6) మీ ఇంటిచుట్టుపక్కల శుభ్రంగా ఉంచడానికి మీరు ఏం చేస్తారు?

### తెలుసుకోండి

*మనం సృష్టిస్తున్న చెత్తను మనమే భరించలేకపోతున్నాం. వేయకూడని ప్రాంతంలో అంటే చెత్తకుండీలలో కాకుండా రోడ్లపై, కాలువల్లో, ఇళ్ళముందు చెత్త వేయడంవల్ల ఎన్నో సమస్యలు వస్తున్నాయి. రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించే వారి పట్ల కనీస గౌరవం చూపకుండా వారిని అవమానించడం చేస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అనేది వ్యక్తిగతంగా ప్రతిఒక్కరూ, సమిష్టిగా అందరూ చేయవలసిన పని.*

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1) మీ ఇంటి పరిసరాలు, బడి పరిసరాలు ఎలా ఉన్నాయో చెప్పండి. రాయండి.

| ఇంటి పరిసరాలు | బడి పరిసరాలు |
|---|---|
| | |
| | |
| | |
| | |

2) ఈ క్రింది పట్టికలో తప్పు (✗) ఒప్పు (✓)లను గుర్తించండి.

| | |
|---|---|
| అ) చెత్తను ఊడ్చరాదు | |
| ఆ) చెత్తను కుండీలో వేయాలి | |
| ఇ) చెత్త పేరుకుపోవడంవల్ల వ్యాధులు వస్తాయి | |
| ఈ) పరిసరాలు శుభ్రంగా ఉండాలి | |
| ఉ) ఆరోగ్యమే మహాభాగ్యం | |
| ఊ) మురికి వాతావరణం అనారోగ్యం కలుగ చేస్తుంది | |
| ఎ) పరిశుభ్రత బాధ్యత ప్రతి ఒక్కరిదే | |
| ఏ) చెత్తను కాలువల్లో పడేయడం | |

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. బడి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి మీరు బాధ్యతలు పంచుకొని దాని ప్రకారం నిర్వహించండి. వారం తరవాత ఏమేమి చేసారో ఎలా చేసారో చెప్పండి.

### ఇలా చేయండి

- రెండు పనికిరాని పాత డబ్బాలు లేదా మట్టి పాత్రలను సేకరించి వానిపై 'చెత్తబుట్ట' "నన్ను ఉపయోగించండి" అని రాసి అనవసర వస్తువులు చెత్తవేయడానికి ఉపయోగించండి. అవి నిండిన తర్వాత వాటిని తగు ప్రదేశాలలో వేసేలా చూడండి. ఇంట్లోగాని, బడిలోగాని ఇది మీ బాధ్యతగా నిర్వహించండి. మన బడి అనగా బడి బయట, ఆవరణలు, తరగతి గదులు పరిశుభ్రంగా ఉంచడం. మన ఇల్లు, మన ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం అందుకు నేనేమి చేయగలను? నా బాధ్యత ఏమిటి? అని ఆలోచించుకొని పనిచేయండి. ప్రతిఒక్కరూ ఇలా ఆలోచిస్తే మన ఆరోగ్యమే కాదు అందరి ఆరోగ్యం కాపాడినవారమౌతాం.

**సూక్తి**

**మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత**

# 8 గురువు

## I. ప్రధాన విలువ

సంస్కృతి సంప్రదాయాలు

## II. ఉప విలువ

ఆచార్యదేవోభవ

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

♦ గురువుల పట్ల భక్తి గౌరవభావాలను పెంపొందింప జేయడం

## IV. ఉపోద్ఘాతం

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః

గురుర్దేవో మహేశ్వరః

గురుసాక్షాత్ పర బ్రహ్మ

తస్మై శ్రీ గురవేనమః

అనగా గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే ఈశ్వరుడు గురువు ప్రత్యక్షంగా ఉన్నదైవం. అటువంటి గురువుకు నమస్కారం అని అర్థం. ఆచార్యదేవోభవ! భారతీయ సంస్కృతియందు గురువునకు అత్యున్నతమైన స్థానం ఇవ్వబడింది. గురువును కూడా దైవంతో సమానంగా భావిస్తూ భక్తి శ్రద్ధలతో గురువుని సేవించినవారికి, గౌరవించిన వారికి వారి ఆశీస్సులు మనకు అందుతాయని పెద్దలు చెబుతారు.

## V. సంఘటనలు

*సంఘటన – 1*

పిల్లలూ! ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.

1. మీకు విద్యాబుద్ధులు నేర్పించేది ఎవరు?
2. ఉపాధ్యాయుడే లేకుంటే విద్యను పొందడం సాధ్యమేనా? ఎందుకో చెప్పండి.

ఉపాధ్యాయుడు మనలో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతులను వెలిగించే మహనీయ మూర్తి. ఉపాధ్యాయుడు విషయజ్ఞానాన్ని అందించడంతో పాటు ఆ సమాచారాన్ని ప్రతిఒక్క విద్యార్థి అర్థంచేసుకొని జీర్ణించుకునేలా చేయగలడు. అలా ఉపాధ్యాయుడు దారిదీపంలా, మార్గదర్శిలా, స్నేహితునిలా సహాయపడుతూ విద్యార్థులను సన్మార్గంలో నడచుకొనేందుకు తోడ్పడతాడు. అలాంటి మహనీయులలో చెప్పుకొనదగిన మహావ్యక్తి డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్.

21 సంవత్సరాలైనా దాటని వయసులో ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యారు. తత్త్వశాస్త్రంలో అతని ప్రతిభను విని మైసూరు విశ్వవిద్యాలయం అతనిని ప్రొఫెసర్‌గా నియమించింది.

ఆయన ఉపన్యాసాలను ఎంతో శ్రద్ధగా వినేవారు విద్యార్థులు. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్యపదవి చేపట్టమని డా॥అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌లు కోరారు. కలకత్తా వెళ్ళాలని నిశ్చయించుకున్నారు రాధాకృష్ణన్. ఆయన ఇంటిముందు గుర్రపు బండి సిద్ధంగా ఉంది. తమ అధ్యాపకునికి వీడ్కోలు చెప్పడానికై విద్యార్థులు ఆయన ఇంటికి వచ్చారు. బండికి కట్టినగుర్రాలను వదలించారు. రైల్వే స్టేషన్ దాకా బండిని తామే లాక్కొని వెళ్ళారు. అది విద్యార్థులకు ఆయనపట్ల ఉన్న ప్రేమకు సంకేతం. విద్యార్థుల భక్తిశ్రద్ధలను గమనించిన రాధాకృష్ణన్ కళ్ళు చెమ్మగిల్లాయి. అది గురుశిష్యుల హృదయానుబంధం.

ఆ ప్రేమానుబంధం ఈనాటికీ ఎందరో గురుశిష్యులమధ్య కొనసాగుతూనే ఉంది. సర్వేపల్లి రాధాకృష్ణన్‌పై గల అపారమైన ప్రేమతో వారి జన్మదినమైన సెప్టెంబర్ 5వ తేదీని ఉపాధ్యాయ దినోత్సవంగా పరిగణించారు. ఆనాడు వారి సేవలను గుర్తు చేసుకుంటూ వారికి ఘనమైన నివాళులర్పించడం అభినందనీయం.

*సంఘటన - 2*

*తన గురువుగారైన మహేంద్రనాథ్ గుప్త గురించి అతని శిష్యుడు సుబ్రహ్మణ్యం చెప్పిన సంఘటనలు వినండి.*

*నేను ఓ మారుమూల పల్లెలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని, పూర్తిచేశాను. అక్కడ ఉన్నతపాఠశాల సౌకర్యంకూడా లేదు. అందువల్ల ఉన్నతపాఠశాల చదువులకోసం సమీప పట్టణానికి వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ ప్రభుత్వ పాఠశాలలో నేను చేరాను. కాని ఆ కొత్త పాఠశాలలో నేను చాలా అసౌకర్యానికి గురయ్యాను. అక్కడ చాలామంది విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడుతున్నారు. నాకేమో అప్పట్లో ఆంగ్లం అంతగా రాదు. ఊళ్ళో మాపాఠశాలలో అందరికన్నా నాకే ఎక్కువ మార్కులు వచ్చేవి. కానీ ఇక్కడ, నాకన్నా బాగా చదివేవిద్యార్థులు ఉన్నారు. దాంతో నాలో కొంత ఆత్మన్యూనత పొడచూపింది. అందుకే నాకు ఈపాఠశాల సరిపోదని, నాకు ఎవరూ స్నేహితులు కూడా లేరన్న బాధతో మా ఊరికి వెళ్ళిపోదామని అనుకున్నాను.*

*ఇలాంటి పరిస్థితుల్లో ఒకరోజు మధ్యాహ్నభోజన సమయంలో మా తరగతి ఉపాధ్యాయులు మహేంద్రనాథ్‌గుప్త నన్ను తన గదిలోకి రమ్మని కబురు పంపారు. నాకు ఒక్కసారిగా చమటలు పట్టాయి. మాస్టారు ఎందుకు పిలిచి ఉంటారు? ఆంగ్లం, సాంఘికశాస్త్రాల్లో నాకు తక్కువ మార్కులు వచ్చాయి. అందుకు తిడతారో, ఏమో! ఈ పాఠశాల నుండి బయటకు పంపిస్తారేమో! అనుకుంటూ మాస్టార్ దగ్గరకు బయలుదేరాను.*

*కానీ, మాస్టారి గదిలోకి వెళ్ళగానే వారు సుబ్రహ్మణ్యం! నీభోజనం పెట్టుగురూ! కలిసిభోంచేద్దాం! అన్నారు. నేను ఆనందాశ్చర్యాలకులోనై వెంటనే డబ్బానుపట్టుకొని పరుగెత్తుకొని వచ్చాను. వారు ఎంతో ప్రేమతో నాతో కలిసి భోజనం చేస్తూ, అన్నంతోపాటు ఆలోచనల్ని కూడా నాతో పంచుకున్నారు. కొత్త పాఠశాలలో నేను పడుతున్న ఇబ్బందులేమిటని ప్రశ్నించారు. భోజనం అయ్యాక, నేను వస్తుంటే, సుబ్రహ్మణ్యం? పాఠశాల గంట కొట్టాక, నాదగ్గరకు రా! కలసి మా ఇంటికి వెళదాం అన్నారు మహేంద్రనాథ్ మాస్టారు.*

*సాయంత్రం అలా వారితోనడచివెళుతుంటే నన్ను ఎంతో ఆత్మీయంగా దగ్గరకు తీసుకుంటూ "సుబ్రహ్మణ్యం కొత్త పాఠశాలలోని ఇబ్బందులు ఏమిటి? నీకు ఎందుకు తక్కువ మార్కులు వస్తున్నాయి? అని అడిగారు. అప్పుడు నా సమస్య ఏమిటో వారికి వివరించాను. మాస్టారు సావధానంగా విని, ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ "సుబ్రహ్మణ్యం! నీవు చాలా తెలివైన విద్యార్థివి. నీవేమి నిరుత్సాహపడకు. ఆ విషయంలో నేను నీకు సహాయపడతాను" అంటూ పాఠశాల హాకీజట్టులో నన్ను చేరమన్నారు. సాంస్కృతిక పోటీల్లోకూడా పాల్గొనమని ప్రోత్సహించారు. నా సమస్యలన్నీ తీరిపోయినట్లనిపించింది. పాఠశాలలో ఇమిడిపోయి సంతోషకరమైన కొత్తజీవితం ప్రారంభించాను. నాలాంటి చాలామంది విద్యార్థులకు వారు ఎంతో సహాయపడ్డారు.*

*మహేంద్రనాథ్‌గారు ఒక్క సంవత్సరం రెండు సంవత్సరాలు గాదు. వారు పదవీవిరమణ పొందేవారకు ఎంతోమంది విద్యార్థులకు ఏదోవిధంగా అండగానిలుస్తూనే ఉండేవారు. ఆ తరువాత గూడా కొంతమంది విద్యార్థులకు తన ఇంట్లోనే ఉచితంగా పాఠాలు చెప్పేవారు. వందలాది మంది విద్యార్థులు మహేంద్రనాథ్ గారి ప్రేమాభిమానలకు, సహాయసహకారాలకు పాత్రులై వారికి ఋణపడి ఉన్నారనటంలో సందేహంలేదు.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) గురువేదైవం అని అంటున్నారు కదా! ఎందుకు?

2) ఉపాధ్యాయులను ఎందుకు గౌరవించాలో చెప్పండి?

3) మీకు నచ్చిన ఉపాధ్యాయుడు ఎవరు? ఎందుకు?

### తెలుసుకోండి

*శరీరానికి జన్మనిచ్చిన వారిని తల్లిదండ్రులు అన్నట్లే, జ్ఞానాన్ని ప్రకాశింపజేసినవారిని 'గురువు' అంటారు. దీపం చీకటిని తొలగించినట్లు. గురువుయొక్క అనుగ్రహం మనలోని అజ్ఞానాన్ని దూరం చేస్తుంది.*

*"గుణము లేని సుతుడు, గురిలేని విద్యలు, నీతిలేని జాతినిష్ఫలంబు" అన్నారు పెద్దలు. గుణం ముఖ్యం, గురి అత్యవసరం. ప్రతివ్యక్తిలో 'నీతి' ఉండాలి. కనుక ప్రతివిద్యార్థిలో ఈ మూడూ ఉండాలి. ముఖ్యంగా గురువులమీద విద్యార్థులకు గురి ఉండాలి. లేనివానికి విద్యరాదు కనుక ప్రతివిద్యార్థి గురువుల ఎడల భక్తి, శ్రద్ధలు కలిగి ఉండాలి. ఉపాధ్యాయులను గౌరవించాలి.*

*గురువు నిచ్చెనలాంటివాడు నిచ్చెన ఉన్నచోటనే ఉంటుంది కాని దానిని ఎక్కినవారు పైకి చేరుకుంటారు. అలాగే ఎంత ఎత్తుకు ఎదిగినా మొదటిమెట్టును గుర్తుంచుకోవడం నిజమైన కృతజ్ఞత. గురువు అక్షరాలు దిద్దించిన తర్వాత, మనకు చదవటం వచ్చిన తర్వాత ఎన్నో పుస్తకాలు చదువుతాం. అర్థం చేసుకొని వాటి సారాన్ని గ్రహించి మన జీవితానికి అవసరమైన రీతిలో ఉపయోగించుకుంటాం. గురువు ప్రాణమున్న పుస్తకం. ఆయన మనకు చదువుతోపాటు తన జీవిత అనుభవాలు, ఆలోచనలు, జయాలు అన్నింటిని మేళవించి మనకిందిస్తాడు. మనం తనకంటే ఉన్నతంగా ఎదగడానికి కృషిచేస్తాడు.*

*విద్యవల్ల వినయం, వినయం వల్ల సత్ప్రవర్తన, సత్ప్రవర్తన వల్ల గౌరవం, ధనం, ధర్మం, సుఖం అన్నీ సమకూరుతాయి. గురువు పట్ల వినయవిధేయతలు ప్రదర్శించి చదువు నేర్చుకున్నప్పుడే ఇవన్నీ సాధ్యమవుతాయి. మనకన్నీ ఇచ్చేది భగవంతుడైతే చదువునేర్పి మనల్ని ప్రయోజకుల్ని చేసే గురువు ప్రత్యక్షదైవం. అందుకే ఆచార్యదేవోభవ అన్న సూక్తి గతంలోనేకాదు వర్తమానం, భవిష్యత్తులో కూడా వర్తిస్తుంది. గురువుని దేవునిలా భావించే విద్యార్థులు, తండ్రిలా ప్రేమించే విద్యార్థులు జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అందుకుంటారు.*

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

పిల్లలూ! ఈ గేయాన్ని పాడండి.

గురువంటే తల్లితండ్రిదైవము
గురువంటే జాతిగొంతుగానము, వెలుగుతున్నజ్ఞానము

అరిస్టాటిల్, సోక్రటీస్, కౌటిల్యుడు, కౌశికుడు
చరితను మలచే గురువులారా...... ఆ..... (2)
వందనాలు వేల వేల వందనాలు (2)

॥ గురువంటే ॥

పిల్లల చదువుకు అర్థంచెప్పిన ప్రయోగశీలి గిజూభాయి
పల్లె పల్లెలో పిల్లల గుండెలో (2)
జ్ఞాన జ్యోతులను వెలిగిస్తున్న
చరితను మలచే గురువులారా వందనాలు
వందనాలు వేల వేల వందనాలు (2)

॥ గురువంటే ॥

పిల్లలూ! ఈ గేయం విన్నారు గదా!

- గురువు యొక్క గొప్పదనాన్ని గురించి ఏమని చెప్పారో తెలపండి.

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

1. గురువంటే మనకు జ్ఞానాన్ని ఇచ్చేవాడు కదా! కాబట్టి మీ ఉపాధ్యాయుడితో మీరు స్నేహంగా మాట్లాడండి. దీనివల్ల మీరు పొందిన అనుభూతులను తెలపండి.

మనం, తల్లిదండ్రులతో పాటు గురువుపై కూడా భక్తిభావనను పెంచుకోవాలి. గురువులను భక్తితో గౌరవించాలి. వారికి నమస్కరించాలి. గురువు మనకు చదువు నేర్పుతాడు. ఆ చదువుద్వారా మంచి గుణాలు కల్గుతాయి. ఆ చదువు ద్వారా మనం సక్రమంగా జీవించగలగుతాము.

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురుః సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః**

గురువు దేవునితో సమానమైనవాడు. అతను ఎప్పుడు మనం గొప్పవారిమి కావాలని కోరుకుంటాను. ప్రాచీనకాలం నుండి మన దేశంలో ఎందరో గురువులు తమ శిష్యులను తీర్చిదిద్దారు. దేవుడైన కృష్ణుడు, శ్రీరాముడు కూడా గురువుని పూజించి విద్యను పొందారు. గురువు చెప్పిన విధంగా నడుచుకుంటే మనకు మంచి జరుగుతుంది. సద్బుద్ధి, జ్ఞానం, అనుశాసనం, మంచి నడవడిక కలుగుతాయి. కాబట్టి గురువును గౌరవించాలి. వారు ఎదురైనప్పుడు చేతులు జోడించి వినయంగా నమస్కరించాలి.

## గురుభక్తి

గురువులారా! గురువులారా! వందనాలయ్యా
మంచి నడత నేర్పువారు మీరేనయ్యా
మా బాగును కోరువారు మీరేనయ్యా
మా తీరును మార్చు వారు మీరేనయ్యా
తల్లిదండ్రి దైవాలు మీరేనయ్యా
మనసార దీవించే మహనీయులయ్యా

**సూక్తి**

గురువు అంటే తల్లి, తండ్రి, దైవము.

# 9 ప్లాస్టిక్ వద్దు

### I. ప్రధాన విలువ

పర్యావరణ పరిరక్షణ

### II. ఉప విలువ

ప్లాస్టిక్ వినియోగం తగ్గించడంపై అవగాహన

### III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- ప్లాస్టిక్ వల్ల వచ్చే ప్రమాదాన్ని గుర్తించి, వాడకాన్ని తగ్గిస్తారు.

### IV. ఉపోద్ఘాతం

ఈ రోజుల్లో అన్నిచోట్లా ప్లాస్టిక్ విపరీతంగా దర్శనమిస్తుంది. చిన్నపిల్లల ఆటవస్తువుల దగ్గరనుండి గృహోపకరణాల వరకు అన్నింటా ప్లాస్టిక్కే. చూడడానికి బాగుంటుందని, తేలికగా ఉంటుందని అనేక కారణాలవల్ల అందరూ దీన్ని ఉపయోగిస్తున్నారు. షాపుల్లో, మార్కెట్లలో, రంగురంగుల ప్లాస్టిక్ క్యారీబ్యాగులు ఇలా ఎన్నో, ఎన్నెన్నో. అయితే వాటిని వాడిన తరువాత పారవేస్తాం. ఆ ప్లాస్టిక్ భూమికి కలిగించే అపారనష్టం ఏమిటో తెలుసుకుందాం.

**ఆలోచించండి - చెప్పండి.**

- *కూరగాయలు తెచ్చుకోవడానికి ఏ కవర్లు వాడతారు?*
- *పెళ్ళిళ్లలో, పార్టీలలో ఏ గ్లాసులను ఉపయోగిస్తున్నారు?*
- *బాగా చదువుకొన్నవారి దగ్గరనుండి సామాన్యుడి వరకు ఏ సంచులు వాడుతున్నారు?*
- *రోడ్డుపై ఉన్న చెత్తలో ఎక్కువగా మనకు కనిపించేవి ఏవి? వీటివల్ల ఏం జరుగుతోంది?*

## V. సంఘటనలు

***సంఘటన - 1***

*ఇప్పుడు మనం బజారుకు వెళ్ళి ఏదికొన్నా ప్లాస్టిక్ కవర్లోనే తెస్తాం. బడికి వచ్చేటప్పుడు కూడా లంచ్ బాక్సులను ప్లాస్టిక్ బ్యాగుల్లోనే తెచ్చుకుంటాం. అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళు ఇలా అందరూ ప్లాస్టిక్ బ్యాగులనే ఉపయోగిస్తున్నారు. అయితే ప్లాస్టిక్ కానివి భూమిలో కలిసిపోతాయి. ప్రకృతి పరంగా తయారైనవి తిరిగి ప్రకృతిలో కలిసిపోతాయి. భూమి వాటిని గ్రహించగలదు. కాని ప్లాస్టిక్ భూమిలో కరగదు. పైగా అది భూమిని విషతుల్యం చేస్తుంది.*

*ఏవస్తువు ఎన్నాళ్ళకు మట్టిలో కలిసిపోతుందో ఓ సారి పరిశీలించండి.*

| | | |
|---|---|---|
| కూరగాయలు | : | 5 నుండి 30 రోజులు |
| అరటితొక్క | : | 24 రోజులు |
| చెరకు పిప్పి | : | 30 నుండి 60 రోజులు |
| కాగితపు కవర్లు | : | 2 నుండి 5 నెలలు |
| దూది | : | 1 నుండి 5 నెలలు |
| దారం | : | 3 నుండి 14 నెలలు |
| కమలా పండు తొక్క | : | 6 నెలలు |
| ఆకులు | : | 12 నెలలు |
| లెదర్ షూ | : | 25 నుంచి 40 సంవత్సరాలు |
| నైలాన్ గుడ్డ | : | 30 నుంచి 40 సంవత్సరాలు |
| అల్యూమినియం డబ్బాలు | : | 80 నుంచి 100 సంవత్సరాలు |
| పాలిథీన్ కవర్లు | : | వేయి సంవత్సరాలు |

*సంఘటన - 2*

*నిబంధనలకు విరుద్ధంగా తయారవుతున్న కాలుష్యకారక ప్లాస్టిక్ సంచులు ఇటీవల కాలంలో పెద్దసంఖ్యలో వినియోగంలోకి వచ్చి... పర్యావరణానికి హానికరంగా మారుతున్నాయి.*

*దేశవ్యాప్తంగా 2001లో 20 మైక్రాన్ల ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. 2011లో 40 మైక్రాన్ల మందంతో ఉన్న సంచులను కూడా వినియోగించకుండా నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమీషనర్‌గారు హైదరాబాద్ నగరంలో 40 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ సంచులను వినియోగించకుండా నిషేధం పెట్టారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 40 మైక్రాన్లకు మించి ఉన్న ప్లాస్టిక్ సంచులకు రూ. 2ల నుంచి రూ. 5ల వరకు వసూలు చేయాలన్న నిబంధనను విధించారు. ఈ మేరకు దుకాణదారులు వసూలు చేస్తున్నారు కూడా.*

*హైదరాబాద్ శివారులోని కాటేదాన్‌లో దాదాపు వందకుపైగా చిన్నచిన్న ప్లాస్టిక్ తయారీ కంపెనీలు ఉండగా మరో 15 కంపెనీలు పెద్దవి ఉన్నాయి. ఇక్కడ ప్రతి రోజూ లక్షల సంఖ్యలోనే 40 మైక్రాన్ లోపు సంచులను ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రం మొత్తానికి ఇక్కడనుంచి సరఫరా అవుతుంటాయి. ఇక్కడి చిన్న యూనిట్లకు బయట తాళం వేసి ఉంటుంది. లోపల మాత్రం ఉత్పత్తి జరుగుతూ ఉంటుంది. ప్రతి సంచి రూ. 2 ఆపైన వసూలు చేయాలన్న ఆదేశాలను మాత్రం వ్యాపార సంస్థలు అమలు చేస్తున్నాయి. చివరకు ప్రజలకు ఈ భారమే మిగిలిందని, ప్లాస్టిక్ వల్ల ఏర్పడుతున్న అనర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ప్రతిరోజూ 3800 టన్నుల చెత్త వస్తుంటే అందులో కనీసం 400 టన్నుల ప్లాస్టిక్ కవర్లు ఉంటున్నాయని అధికారులు గుర్తించారు. 40 మైక్రాన్ల లోపు సంచులు ఎన్నేళ్ళైనా భూమిలో కరగవు. దీనివల్ల ఆ భూమి సారం కోల్పోవడంతోపాటు వర్షం నీరు భూమిలోకి ఇంకదు. దీంతో భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల నగరంలో ప్లాస్టిక్ వినియోగం చాలా అధికంగా ఉందంటూ జీహెచ్ఎంసీ అధికారులను కాలుష్య నియంత్రణ మండలి హెచ్చరించింది కూడా.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) పై పట్టికలో ఎక్కువ కాలం వరకు భూమిలో కలిసిపోకుండా ఉండేది ఏది? దానివల్ల నీవేవి గ్రహించావు?

2) ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి ఎంతకాలం పడుతుంది?

3) ప్లాస్టిక్ బదులుగా మనం ఏమేమి వాడాలి?

4) ప్లాస్టిక్ వాడకంవల్ల ఏం జరుగుతుంది?

**తెలుసుకోండి**

*ప్లాస్టిక్ వాడకంవల్ల భూకాలుష్యం ఏర్పడుతుంది. తద్వారా భూసారం తగ్గుతుంది. ఇది పంటలు పండటాన్ని ప్రభావితం చేస్తుంది. ప్లాస్టిక్ వాడడాన్ని తగ్గించుకోవాలి. ఇది ప్రతి ఒక్కరి బాధ్యత మనం మన ఇంటి నుండే దీన్ని అమలు చేయాలి.*

*ప్లాస్టిక్ బదులుగా, కాగితం సంచులు వాడవచ్చు. గుడ్డ సంచులు వాడవచ్చు. మనం మన గ్రామంలో, వాడలో కూడా ప్లాస్టిక్ నిషేధం గురించి తెలియజేయాలి. కేరళ రాష్ట్రంలో బడి పిల్లలే ఈ ఉద్యమానికి నాంది చుట్టారు. మీ గ్రామానికి ఎవరు ప్లాస్టిక్ సంచితో వచ్చినా వెళ్ళి ప్లాస్టిక్ నిషేధం గురించి తెలపండి. ఇలా మనం కూడా చేయవచ్చు. తద్వారా ప్రకృతిని కాపాడుకుందాం.*

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1. మీలో ఎవరెవరు ప్లాస్టిక్ బ్యాగులు తెచ్చారో, తేలేదో తెస్తే ఎందుకోసం తెచ్చారో తెలుపుతూ ఒక పట్టిక రాయండి.

| విద్యార్థి పేరు | ప్లాస్టిక్ బ్యాగు తెచ్చింది దేనికోసం తెచ్చింది | తేలేదు |
|---|---|---|
| రాణి | లంచ్ బాక్సుకోసం | |

2. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ఏమి చేస్తారో ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేయండి.

3. ప్లాస్టిక్ నిషేధం తెలిపే పిల్లల ప్రతిజ్ఞ మరియు నినాదాలు రాయండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1. మీ బడిని (No Plastic Zone) ప్లాస్టిక్ నిషేధిత ప్రాంతంగా ప్రకటించుకొని ప్లాస్టిక్ క్యారీబాగులు వాడకుండా, అవి లేకుండా చేయండి. తరువాత క్లాసులో మీ అనుభవాలు చెప్పండి.

**సూక్తి**

పర్యావరణాన్ని పాడుచేసే వస్తువుల వాడకం మానేద్దాం, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములౌదాం.

# 10 మూఢనమ్మకం

**I. ప్రధాన విలువ**

శాస్త్రీయ దృక్పథం

**II. ఉప విలువ**

దేనిని గుడ్డిగా నమ్మరాదని తెలుసుకోవడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు**

- మూఢనమ్మకాలు పనికిరావని తెల్సుకోవడం

## IV. ఉపోద్ఘాతం

*సమాజంలో మనం చాలా మందిని నమ్ముతుంటాం. మన నమ్మకాలను సొమ్ము చేసుకునే వారు చాలామంది ఉంటారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. నమ్మకం ఉండటం మంచిదే కానీ, మరీ గుడ్డిగా నమ్మడం వల్ల మంచీ-చెడు విచక్షణ కోల్పోయి అన్యాయానికి, మోసానికి గురవుతాము. జనం ఎందుకు, ఎలా మోసపోతున్నారో ఈ సంఘటనలో పరిశీలిద్దాం.*

## V. సంఘటనలు

***సంఘటన – 1***

*పట్టణ శివార్లలో ఉంటున్న భవననిర్మాణ కూలీలుంటే మురికి వాడలో ఎనిమిదేళ్ళ పిల్లలందరికీ వరుసగా రెండూ మూడూ రోజులుగా విరోచనాలు కావడం గుర్తించిన తల్లిదండ్రులు భయపడిపోయారు. ఉన్నట్లుండి తమ పిల్లలు ఎందుకు ఇలా అయ్యారో అర్థం కాక అందరూ ఆందోళన పడసాగారు. వీరంతా కలిసి గ్రామంలో ఉన్న ఒక బాబా దగ్గరకు వెళ్ళారు. ఆయనతో విషయమంతా చెప్పారు. అప్పుడు ఆ బాబా "మీ పిల్లలకు గాలి సోకింది. నేనిచ్చే ఈ పసరు వారం రోజులపాటు తాగించండి, అదే తగ్గిపోతుంది" అని చెప్పి వారి దగ్గర నుండి డబ్బులు తీసుకుని పంపించేశాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు వారి పిల్లలకు బాబా ఇచ్చిన పసరు తాగించారు. పిల్లలు ఇలా ఆ పసరును వారం రోజులపాటు తాగారు. కానీ, పిల్లల పరిస్థితిలో ఏమీ మార్పులేదు. వారి ఆరోగ్యం మరింత క్షీణించింది. తల్లిదండ్రులలో ఆందోళన మరింత ఎక్కువైంది.*

*ఒకరోజు అనుకోకుండా ఆరోగ్య కార్యకర్త వీరుండే మురికివాడకు వచ్చింది. చాలామంది పిల్లలు మంచాలపై పడుకుని ఉన్నారు. వారు నీరసంగా ఉన్నారు. లేవలేని స్థితిలో ఉన్నారు. వీరందరికి ఏమైంది? ఎందుకిలా ఉన్నారని ఆరోగ్యకార్యకర్త అడగగానే, తల్లిదండ్రులు విషయమంతా ఆమెకు వివరించారు. మీ పిల్లలు చాలా ప్రమాద పరిస్థితిలో ఉన్నారని వెంటనే వీరందరినీ ఆసుపత్రికి తీసుకెళ్ళాలని చెప్పింది. వీరంతా పిల్లలందరినీ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో వైద్యుడు పిల్లలను పరీక్షించి వీరంతా కామెర్ల వ్యాధితో బాధపడుతున్నారని, అది చాలా ముదిరి పోయిందని చెప్పాడు. అలా చెప్పగానే తల్లిదండ్రులు డాక్టరు కాళ్ళమీదపడి "మా పిల్లల్ని ఎలాగైనా కాపాడండి" అంటూ కన్నీరు మున్నీరుగా ఏడ్చారు. వారి బాధను చూసి అక్కడున్నవారంతా కంట తడిపెట్టారు.*

*కొద్దిసేపటి తర్వాత డాక్టరు గారు బయటకు వచ్చి "మీ పిల్లలకు ప్రమాదం తప్పిందని, ఆసుపత్రికి తీసుకురావడం ఒక్కరోజు ఆలస్యం అయినా వీరు మీకు దక్కేవారు కాదని" చెప్పేసరికి తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎంత మూర్ఖంగా ప్రవర్తించారో గుర్తుకు వచ్చి అవమానంతో తలలు దించుకున్నారు.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందిచడం

1) తల్లిదండ్రులు బాబా దగ్గరకు వెళ్ళడం మీకు సరైనదిగా భావిస్తున్నారా? ఎందుకు?

2) 'మూఢ నమ్మకం' అంటే మీరేమనుకుంటున్నారు?

3) మీరు గుడ్డిగా నమ్మి మోసపోయిన సందర్భాలు ఉన్నాయా? అవేమిటో రాయండి.

4) 'అతడు మోసగాడు. అని నీ స్నేహితుడు చెప్తే నమ్ముతావా? వాస్తవాలు తెలుసుకుంటావా? ఏం చేస్తావు? ఇలాంటివి మీకు ఎప్పుడైనా ఎదురయ్యాయా?

## తెలుసుకోండి

*ఒక సమస్య ఎదురయినపుడు మనకు చాలామంది చాలా రకాలుగా సలహాలు ఇస్తుంటారు. వాటన్నింటిని వినడంలో తప్పులేదు. అయితే దేన్ని గుడ్డిగా నమ్మకూడదు. పూర్వాపరాలు ఆలోచించాలి. వాళ్ళు ఇస్తున్న సూచనలు, పరిష్కారాలు మంచివో, కావో ఆలోచించి, తర్కించి వివేకంతో నిర్ణయం తీసుకోవాలి.*

*అడుగడుగున మోసాలు, దొంగబాబాలు, డబ్బులు పదింతలు చేస్తామని, బంగారాన్ని రెట్టింపు చేస్తామని, ఈ నీళ్ళు తాగితే సంతానం అవుతుందని, తాయెత్తు కట్టుకుంటే తలరాత మారుతుందని, ఇవి చేయకపోతే నష్టాల పాలవుతామని వంటి మోసాలు సమాజంలో నేడు ప్రతీచోట చూస్తున్నాం. అంతే కాకుండా కొన్ని పుకార్లు క్షణాల్లో వ్యాపించి మనుషుల్ని భయభ్రాంతులకు గురిచేసి వారి జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఒక ఉదాహరణ ఏమంటే ఆ మధ్య ఉత్తర భారతదేశంలో ఒక బాబాకు కలలో ఫలానాచోట బంగారం నిల్వలు ఉన్నాయని కనిపించిందట. ఆ విషయం బయట తెలిసే సరికి ప్రభుత్వం వారు ఆ బాబా చెప్పినచోట వారం రోజుల పాటు తవ్వకాలు జరిపితే అక్కడ ఏమీ దొరకలేదు. దీంతో అంతా మోసం అంటూ అక్కడినుండి వెళ్ళిపోయారు.*

*ఇలా చెప్పుడు మాటలు వినడం, గుడ్డిగా నమ్మడం మోసపోయి బావురు మనడం నేడు నిత్యకృత్యాలయ్యాయి. ఏదైనా విన్నప్పుడు వాటి వాస్తవాలను, కారణాలు తెలుసుకొని నమ్మాలి.*

### ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- మూఢనమ్మకాలు మంచివికావు అని అందరికీ తెలియజేయడానికి కొన్ని నినాదాలు రాయండి.

### ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- దేన్నీ గుడ్డిగా నమ్మకూడదు కదా! మీరు కానీ, మీ ఇంట్లో వాళ్ళు కానీ ఏఏ విషయాలను గుడ్డిగా నమ్ముతారు? ఇలా చేయడం సరైందేనా చెప్పండి.

**సూక్తి**

**నమ్మకం మనల్ని నడిపిస్తుంది. మూఢనమ్మకం మనల్ని అంతం చేస్తుంది.**

# 11 గుణపాఠం

## I. ప్రధాన విలువ

న్యాయం

## II. ఉప విలువ

న్యాయబద్ధంగా ప్రవర్తించడంపై అవగాహన కల్గి ఉండడం

## III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు

- మన ఇంటి చుట్టుపక్కల జరుగుతున్న న్యాయాన్యాయాలను గుర్తించడం, న్యాయబద్ధంగా ప్రవర్తించడం తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

ఇంట్లోను, మన చుట్టుపక్కల ఇరుగు పొరుగు వాళ్ళలోను రోజురోజుకూ మనుషుల మధ్య సంబంధాలు తగ్గిపోతున్నాయి. స్వార్థం పెరిగిపోయి బాధ్యతలను మరిచిపోయి మనుషులు న్యాయాన్యాయాలు లేకుండా ప్రవర్తిస్తున్నారు. న్యాయంగా నడుచుకోవడం వల్ల బంధాలు పెరగడమే కాకుండా జీవితంలో సుఖశాంతులు అమరుతాయి.

## V. కథ

### కనువిప్పు

ఒక ఊరిలో రామయ్య అనే ధనవంతుడుండేవాడు. అతను దానధర్మాలు చేసేవాడు. అతనికి ఒకే ఒక కొడుకు రాజయ్య ఎంతో ప్రేమగా పెంచాడు. చదువు చెప్పి ప్రయోజకుని చేసి పెళ్ళి కూడా చేసాడు.

రామయ్య ముసలివాడయ్యాడు. ఆ పరిస్థితిలో కొడుకు కోడలికి దుర్బుద్ధి పుట్టి రామయ్య ఆస్తినంతా తమ చేతికిందకు తెచ్చుకోవాలని పన్నాగం పన్నారు. రాజయ్య తన తండ్రి రామయ్యతో "నాన్నా! మీకు వయసు మీరింది ఆస్తి వ్యవహారాలు మీరేం చూసుకోగలరు! నేను చూసుకుంటాను నాకు ఆస్తినంతా రాసి ఇవ్వండి. మీరు హాయిగా విశ్రాంతి తీసుకోండి" అన్నాడు. రామయ్య అలాగే నంటూ ఆస్తంతా కొడుకు పేరున రాసాడు. కొంతకాలం తండ్రిని బాగానే చూసాడు రాజయ్య. ముసలివాడైన తండ్రికి ప్రత్యేకంగా గది ఎందుకు అని వీధి వరండాలో ఒక మంచం వేసి అక్కడ ఉండమన్నాడు.

కొంత కాలానికి ఈ రాజయ్యకు ఒక కొడుకు పుట్టాడు వాడికి విష్ణు అని పేరు పెట్టారు. విష్ణు తాత రామయ్య దగ్గరికి వచ్చి ఆడుకొనేవాడు. రామయ్య చెప్పే కథలు వినేవాడు తాతతోనే గడిపేవాడు. ఇది నచ్చని రామయ్య కోడలు రామయ్యకు పెరటిలో పాక వేయించి అందులో ఉండమన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి ఒక మట్టి మూకుడులో అన్నం పెట్టేవారు. తాతగారిని తన తల్లిదండ్రులు యింత హీనంగా చూడడం విష్ణుకు బాధ కలిగింది. అన్యాయం అనిపించింది.

ఒక రోజు మధ్యాహ్నం విష్ణు తల్లిదండ్రులు ఏదో వస్తువు కోసం వెదకడం గమనించాడు. విష్ణు నాన్నా! ఏమిటి వెదుకుతున్నారు? అని అడిగాడు. తాతకు అన్నం పెట్టే మూకుడు కనిపించడం లేదురా అన్నాడు రాజయ్య. నాన్నా! నేనే ఆ మూకుడు దాచాను అన్నాడు విష్ణు. ఒరే నీకెందుకురా ఆ మూకుడు వెంటనే తీసుకురా మీ తాతకు అన్నం పెట్టాలి అన్నాడు రాజయ్య. అపుడు విష్ణు తండ్రితో నాన్నా ! నేను ఆ మూకుడు ఇవ్వను. కావాలనే దాచాను. మీకు తాత వయస్సు వచ్చేటప్పటికి నేను కూడా మీకు అపుడు ఇటువంటి మూకుడులో భోజనం పెట్టాలి కదా! అపుడు ఇటువంటి మూకుడు దొరుకుతుందో లేదోననీ భయంతో ఇపుడే దాచి పెట్టాను అన్నాడు.

తల్లిదండ్రుల ప్రేమను పొంది, తిరిగి వారికి ప్రేమను అందించకుండా అన్యాయంగా ప్రవర్తించడం ఎంతవరకు న్యాయమంటూ మీరు చాలా తప్పు చేస్తున్నారు నాన్నా! అన్నాడు విష్ణు. రాజయ్య తన తప్పు తెలుసుకొని సిగ్గు పడ్డాడు. నాన్న రామయ్యను ఇంట్లోకి తీసుకెళ్ళాడు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) రాజయ్య తన తండ్రిపట్ల ఎలా ప్రవర్తించాడు? ఇది సరైందేనా?
2) విష్ణు ఆలోచనతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు? కారణాలు తెల్పండి?
3) ఇంకా ఇలా అన్యాయంగా ఎవరెవరు ఎవరిపట్ల ప్రవర్తిస్తుంటారు?

### తెలుసుకోండి

*భారతీయ సమాజంలో కట్టుబాట్లు, నియమాలు, సమాజశ్రేయస్సు కోసం రూపొందించుకొని అమలు చేసుకుంటున్నాం. కుటుంబవ్యవస్థ, పెద్దలను గౌరవించడం, అతిథులను ఆదరించడం అనేవి మన సంస్కృతికి గుర్తు. ఈ సంస్కృతిని కాపాడుకుంటూ సమాజం ఆశించిన విధంగా మనుషులు ప్రవర్తిస్తుంటారు. ఈ నియమాలకు కట్టుబడి ఉంటే న్యాయమని, అతిక్రమిస్తే అన్యాయమని తెలుస్తూంటాం. అందరూ కలిసి బతకడం స్వేచ్ఛగా, సమానంగా బతకడం అనేది న్యాయబద్ధమైనది. అలా కాకుండా చిన్న పిల్లలని, ఆడపిల్లలు వాళ్ళకేమి తెలుసని, వికలాంగులు కదా అని చులకనగా హేళనగా చూడడమనేది, వృద్ధులు కదా వీళ్ళ అవసరం మనకేంటి అని దూరంగా పెట్టడం వంటివి అన్యాయమైన విషయాలు.*

*ఇళ్ళల్లోగాని, బయటగాని మనం అన్యాయానికి గురైతే ఎంత బాధపడ్తామో, మనం అన్యాయంగా ప్రవర్తిస్తే ఇతరులుకూడా అలాగే బాధపడ్తారు. ఈరోజు మన కళ్ళముందరే జరిగే అన్యాయాలను చూస్తూ ఊరుకున్నా తప్పే. ప్రశ్నించాలి, ఎదుర్కోవాలి ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలి. అలా చూడడం మన బాధ్యత అని అందరూ తెలుసుకొని తదనుగుణంగా ప్రవర్తించాలి.*

### ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- బాలికల పట్ల, వికలాంగుల పట్ల, ఇతర కులాల పట్ల ఎలా ప్రవర్తించాలో జట్లలో చర్చించి రాయండి.

### ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మనం ఇంట్లో చుట్టుపక్కల ఉన్న ముసలివారి పట్ల న్యాయంగా ప్రవర్తిస్తున్నామా? అన్యాయంగా ప్రవర్తిస్తున్నామా? తెలుసుకొని రండి.

**సూక్తి**

మానవుడు దేన్నయినా భరిస్తాడు గాని ఒంటరితనాన్ని మాత్రం సహించలేడు. కలిసి మెలిసి బతకడంవల్ల ప్రేమానురాగాలు పెరుగుతాయి. ఆ ఇంట్లో సుఖశాంతులు వెల్లివిరుస్తాయి.

# 12 మేలు చేద్దాం

**I. ప్రధాన విలువ**

శాంతి/కలిసి మెలసి జీవించడం

**II. ఉప విలువ**

ఇతరులకు మేలుచేసే పనులు శాంతిని కలుగజేస్తాయని అవగాహన చేసుకోవడం.

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు**

- ఇతరులకు మేలుచేసే పనులు చేయడంవల్ల శాంతి కలుగుతుందని తెలుసుకుంటారు.

**IV. ఉపోద్ఘాతం**

మనం ఎవరికైనా మేలు చేస్తే అది మనసుకు సంతోషాన్ని కలుగజేస్తుంది. నావల్ల ఒకరికి మంచి జరిగిందనే తృప్తిని ఇస్తుంది. మంచి మనసున్నవాళ్ళు తమ వల్ల ఇతరులకు మేలు జరగాలని కోరుకుంటారు. తమకు చేతనైన సహాయాన్ని చేయాలని చూస్తారు. అలా ఇతరుల మేలుకోరే వ్యక్తులు మన సమాజంలో బోలెడంతమంది ఉన్నారు. అలాంటి వ్యక్తుల గురించి తెలుసుకోండి.

## V. సంఘటనలు

***సంఘటన – 1***

*ఉదయం దేవాలయం చెంత. రాత్రిళ్ళు ఇల్లు. రేయింబవళ్ళు ఫుట్‌పాత్‌పైనే అతని జీవితం.*

*సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పక్కకు విఘ్నేశ్వరుని గుడి ఉంది. గుడి ముందు ఫుట్‌పాత్‌పై భక్తుల పాదరక్షలు చూసుకుంటూ నలుగురైదుగురు. వారిలో ఒకరు రామకృష్ణ. ఆయన ఫుట్‌పాత్‌పై కూర్చొని ఉన్నాడు. ఆయనకు ఒక కాలు లేదు. జైపూర్ ఫుట్ పెట్టుకున్నాడు. చెప్పులు కాపలా కాయడం అతడిపని. చెప్పులు చూసుకున్నందుకు భక్తులు అతని చేతిలో రూపాయి పెట్టి వెళ్ళేవారు. అదే అతని ఆదాయం. ఇలా వచ్చిన డబ్బుల్లో తన రెండుపూటలా తిండికి తగినంత ఉంచుకొని మిగతాది అనాథాశ్రమానికి, తనకు పెట్టుడు కాలు ఇచ్చిన జైపూర్ సంస్థకు డబ్బు పంపిస్తాడు. ఇలా ఎందుకని రామకృష్ణను అడిగితే నావద్ద ఉన్న డబ్బు నాదికాదు. ఎవరో మీవంటి వారే ఇచ్చారు. ఇలా నాదగ్గర ఉన్న డబ్బును ఇతరులకు మేలు కోసం ఇవ్వడం నాకు సంతోషం కలుగుతుంది అని అంటాడు.*

*ఆ ఆనందం, సంతృప్తితో మళ్ళీ రోజు ప్రారంభిస్తాను అన్నాడు రామకృష్ణ.*

***సంఘటన – 2***

*కోడూరు, పోడూరు రెండు గ్రామాలకు మధ్య ఒక బావి ఉంది. దాని నీటిని రెండు గ్రామాల ప్రజలు వాడుకుంటున్నారు. కొన్ని రోజులు బాగానే వాడుకున్నారు గాని కొంత కాలానికి వాళ్ళ మధ్యలో నీటి కోసం గొడవలు ప్రారంభమయ్యాయి. అంతవరకు స్నేహంగా మెలిగిన ఆ గ్రామాల ప్రజల మధ్య విభేదాలు తలెత్తాయి. అశాంతి నెలకొంది ఇది కోడూర గ్రామంలోని ఒక పెద్దాయన దృష్టికి వచ్చింది. ఆయన పాఠాలు చెప్పిన మాస్టారు. ఆయన పేరు హనుమంతరావు. ఆయన వెంటనే రెండు గ్రామాల ప్రజలను కూర్చోబెట్టి సమస్యను విన్నాడు. తనవద్దనున్న డబ్బుతో రెండు గ్రామాలకు చెరొక బావిని గ్రామం మధ్యలో తవ్వించాడు. అంతేగాక రెండు గ్రామాల మధ్య ఉన్న బావికి మోటారు పెట్టి పైపుల ద్వారా రెండు గ్రామాల్లో నీరందించే ప్రయత్నం చేశాడు. గ్రామస్థుల సమస్య తీరడమేగాక హనుమంతరావు చేసిన మేలు తరతరాలు గుర్తుండిపోయింది.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) మొదటి సన్నివేశంద్వారా మీరు గ్రహించినదేమిటి?
2) రెండు గ్రామాల మధ్య అశాంతి ఎందుకు మొదలైంది?
3) హనుమంతరావు చేసిన మేలు ఏంటి? దానివల్ల ఏమి జరిగింది?
4) "ఇతరుల మేలుకోసం ఇవ్వడం నాకు సంతోషం కలుగుతుంది" అని రామకృష్ణ అన్న మాటలకు అర్థం ఏమిటి?
5) ఇతరుల మేలుకోసం పాటుపడేవారు మీకు తెల్సిన వారి గురించి చెప్పండి.

### తెలుసుకోండి

*మనుషులుగా పుట్టాక మంచిపనులు చేయాలి. మనం చేసే పనుల వల్ల కేవలం మనకే మేలు జరిగితే అది స్వార్థం అవుతుంది. అందులో గొప్ప ఏమీ ఉండదు. కాని మనం చేసే పనులు ఇతరులకు మేలు కలిగిస్తే దానివల్ల ఇతరులు సంతోషించడమేగాక మనకు సంతోషం, తృప్తి కలుగుతుంది.*

*నేటి సమాజంలో ఇతరుల గురించి ఆలోచించే వాళ్ళు చాలా తగ్గిపోయారు. ఎవరెటుపోతే నాకేం నా సంతోషం మాత్రమే నాకు ముఖ్యం అనుకునేవాళ్ళు స్వార్థపరులేగాక వాళ్ళ వల్ల సమాజానికి ఎటువంటి ఉపయోగం ఉండదు. ఇతరులకు మనం చేసే చిన్న చిన్న పనులవల్ల మనకు కలిగే ఆనందం, తృప్తి అనుభవిస్తేగాని తెలీదు.*

*మన చుట్టూ జరిగే చిన్న చిన్న సంఘటనలు గమనించండి బస్సు రద్దీగా ఉన్నప్పుడు ఒక ముసలివాడు నిలబడి ఉంటే అతనికి సీటు ఇస్తే అతని కళ్ళలో ఎంత ఆనందం కనిపిస్తుందో. అది చూస్తే మనకు తృప్తిగా అనిపిస్తుంది. రోడ్డుదాటలేని వారికి సహాయపడినా, ఇతరులు ఎవ్వరైనా ఏదైనా కష్టం వచ్చి మన దగ్గరికి వచ్చినపుడు అవి తీర్చడానికి మనం సహకరించినా వాళ్ళు పొందే ఆనందం మనకు కూడా ఆనందాన్ని కలిగిస్తుంది.*

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- మీకు ఏఏ పనులు చేస్తే మనసుకు ప్రశాంతంగా అనిపిస్తుందో చెప్పండి.
- మీరు ఇతరులకు మేలు చేసిన పనులు ఏవి? రాయండి. అప్పుడు మీకు ఎలా అనిపించిందో చెప్పండి.
- ఇతరులు చేసే ఎలాంటి పనులవల్ల మీకు బాధకలుగుతుంది?

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- ఈ వారం రోజులు మీరు ఇతరులకు మేలు కలిగే పనులు చేయండి. ఎలా అనిపించిందో మీ అనుభవం చెప్పండి.

**సూక్తి**

**మంచి మనసువల్ల ఎన్నో సద్గుణాలు అలవడతాయి. కష్టాలలో సహాయసహకారాలు అందించడం మనిషి యొక్క గొప్ప సద్గుణం.**

# అనుబంధం

1. శ్లోకాలు
2. పద్యాలు
3. పాటలు / గేయాలు
4. కథలు
5. స్ఫూర్తిదాతలు

అనుబంధంలో ఉన్న శ్లోకాలు, పద్యాలు పాటలు, కథలు, స్ఫూర్తిదాతల చరిత్రలు మొదలగు వాటిని తరగతి గదిలో పిల్లలచే చదివించాలి. దానిపై మాట్లాడించాలి. ఉపాధ్యాయులు దాని ప్రాశస్త్యం గురించి వివరించాలి.

# 1. శ్లోకాలు

## శాంతి మంత్రము :

1) ఓం ద్యౌ శాంతి ఔ అంతరిక్షన్ం శాంతిః
పృధ్వీ శ్శాంతిః ఆపః శాంతిః
ఓషధయ శ్శాంతిః వనస్పతయ శ్శాంతిః
విశ్వేదేవా శ్శాంతిః బ్రహ్మశాంతిః
సర్వగ్ం శాంతిః శాంతిరేవ శాంతిః
సామా శాంతిరేధిః ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

**భావం :** స్వర్గము, ఆకాశము, భూమి, నీరు, వనమూలికలు, చెట్లు, దేవతలు, బ్రహ్మదేవుడు మరియు చరాచర సకల వస్తువుల యందును ప్రశాంతత ప్రాప్తించుగాక !

2) ఓం సహనావవతు సహనౌభునక్తు – సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావ హై – ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

**భావం :** మమ్ముల నుభయులను అతడు రక్షించుగాక ! మమ్ములనిరువురినీ పోషించుగాక! మాకు అతడు జ్ఞానము కలుగజేయుగాక! తేజోవంతమైన జ్ఞానము మాకు ఫలప్రదమగుగాక! పరస్పరము మాకు ద్వేషము కలుగక ఉండుగాక!

3) యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః ।
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాః అఫలాఃక్రియాః ॥

**భావం :** ఏ ఇంటిలో స్త్రీలు గౌరవింపబడుదురో ఆ ఇంట దేవతలు ఆనందంతో నాట్యమాడుతుంటారు. ఏ ఇంటిలో స్త్రీలు అవమానమును పొందుతుంటారో ఆ ఇంటిలో జరిగే కార్యములన్నియు నిష్ఫలములే అవుతుంటాయి.

# 2. పద్యాలు

1) మర్మము పరులకు తెలుపకు,
దుర్మార్గుల చెంత నెపుడు దూరకు, మిల దు
ష్కర్మముల చేయినొల్లకు
నిర్మల మతి నుంట లెస్స నిజము కుమారా !

2) చిత్తశుద్ధి గల్గి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియు కొదువకాదు
విత్తరంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత
విశ్వదాభిరామ వినురవేమ.

3) విద్యలేక యున్న విత్తములేకున్న
మూఢయైన తుదకు మూగయైన
ఇష్టబంధువైన కష్టమే కలుగును
విశ్వదాభిరామ వినురవేమ.

4) వాక్కుకున్న పదును వాడికత్తికిలేదు
మార్చగలదు మాట మనిషి మనసు
జారవలదు నోరు జాగ్రత్త జాగ్రత్త
శబ్దములకు గొప్ప శక్తి కలదు.

5) ఉబుకజేయు నొక్క ఉత్సాహ వాక్యమ్ము
యువకు లందు అణగి యుండు ప్రతిభ
మాట మంచితనము మర్యాదగొని తెచ్చు
మాట వలన మనిషి మాన్యుడగును.

6) మంచిమాట చాలు మనసులో గాయమ్ము
మాన్పజాలు గొప్ప మందువోలె
సౌమ్యమైన మాట సంతాపమును బాపు
మాట చూరగొనును మనిషి ఎడద.

7) నిండు నదులు పారు నిలిచి గంభీరమై
వెర్రివాగు పారు వేగబొర్లి
అల్పుడాడురీతి నధికుండు నాడునా ?
విశ్వదాభిరామ వినురవేమ.

8) మిత హిత ఋత వాక్కు మేధావి పాటించు
వాక్కు కూర్పు వేదఋక్కులగును
మనిషి చచ్చిపోవు! మాట చావకనిల్చు
అక్షరములు జగతి అక్షరములు

9) అమ్మ అనెడి రెండు అక్షరములెకాని
అందులోని మహిమ కంతులేదు
అమ్మమాట మధుర మానందభరితమూ
అంతులేని ప్రేమ అమ్మ ప్రేమ.

10) ప్రేగు తెంచి నన్ను పెద్దచేసెను అమ్మ
ఎన్ని జన్మ లెత్తి ఏమి ఇత్తు
తనదు జీవమెల్ల ధారపోసెను నాకు
తూకమేసి తనను తూచ లేను.

# 3. పాటలు / గేయాలు

## 1. పర్యావరణం - ప్రాణం

పర్యావరణమే ప్రాణం - అది
పరిరక్షించుట ధ్యేయం
కాదు, కూడదని అనుకుంటే - అది
విశ్వమానవ వినాశనం.

నేల, నీరు, నిప్పు, నింగి, గాలి
పంచభూతాత్మ ప్రకృతి
స్వార్థంతో మానవుడు ప్రకృతిని
కొల్లగొడ్తున్న....దానవుడు

కోరికోరి వినాశనం....
కొని తెచ్చుకుంటున్న మానవుడు
చేజేతులా తన గోతిని తానే
తవ్వుకుంటున్న దౌర్భాగ్యుడు

చిలకపచ్చతోటలు లేవు
వనమహోత్సవాలు లేవు
నేలతల్లి గుండెలపైన
పరిమళాల జాడలు లేవు.

చెట్టు తల్లి ఏడుస్తోంది
తలలేని మొండెంతో
చెరువు గుండె రోదిస్తోంది
తడి ఆరిన కన్నీటితో

చిట్టి చినుకు పలకరించదు
నేలతల్లిని
విత్తు, కళ్ల తెరచి నవ్వదు...
ఆకు నోటితో
ఎటు చూచిన ఎడారివాసన
కాలుష్యపు గాలులలో
పలుకరించు మేఘమాల
మూగదాయె బాధతో.....

కాలుష్యం కోటి తలలుగా
బుసలు కొడుతూ వస్తోంది
కత్తులకు పదునుబెట్టి
మేధస్సుతో నరకండి

పర్యావరణం పరిరక్షణ
పౌరులందరిది తెలియండి
ఎవరికి వారుగ, ఎందుకులేయని
ప్రభతపై నిందలు మానండి

ప్రకృతిలోని సమతుల్యాన్ని
పౌరులందరూ కాపాడాలి
మొట్టమొదటగా....మనిషి తాను
తన స్వార్థాన్ని దహించాలి
సామూహిక చైతన్యం...పాటించాలి
చెట్లూ, చేమలు పెంచాలి
పొగ, నీటి, ధ్వని కాలుష్యాలను
కడకంటూ తరిమేయాలి
నీటిని పొదుపు చేయాలి
చెరువులు, కుంటలు కట్టాలి

ప్లాస్టిక్ వస్తువాడకం పదేపదే
నిషేధించాలి...
పర్యావరణం...మన తల్లి....
పచ్చంగా వర్ధిల్లాలి......

ప్రకృతి... విశ్వం... రెండూ....
కవల పిల్లలంటారు. వాటి
సమతుల్యం దారితప్పితే... జీవులు
సర్వనాశనం అవుతారు.

– డా.మౌని

## 2. చెట్టుతో మమేకమై

రాజమండ్రి నుండి
రాజధానికి బదిలీ అయి వొస్తుంటే
ఆప్తమిత్రుడొకడు
ఆప్యాయంగా
వేలెడంత నందివర్ధనం మొక్కను బహుకరించాడు.

చెట్టు జ్ఞానానికి ప్రతీక అన్న సాదీ మహాకవి మాటల్ని
ఇంగితం గుర్తు చేస్తే
భయపడుతూనే వెంట తెచ్చుకున్నాను.
నా అదృష్టం కొద్దీ కాంక్రీటు కీకారణ్యంలో
చారెడు మట్టిగల ఇల్లే దొరికింది.
ఇచ్చినవాడి అభిమాన బలమో
నాటిన మా ఆవిడ చేతి చలవో
లేక భూసారమో తెలియదు గానీ
పాతిన మూడు రోజులకే
పసిపిల్లాడు ఎత్తుకోమని చేతులు చాచినట్టు
కొమ్మల చేతులు పైకెత్తి నిగనిగలాడుతూ నవ్వింది.

ఆరోజు నుండీ మా యింట్లో పిల్లలు
ఇద్దరికి ముగ్గురయ్యారు
మీగాళ్ళ మీద కూచుని పాదుచేసిన మొక్క
మోకాళ్ల మీద వొంగుని నీళ్ళు పోసిన మొక్క
చూస్తుండగానే చేయెత్తు చెట్టయింది.
తోకల్లేని మా రెండు కోతులకు
ఉయ్యాలా జంపాలా అయింది.

## 3. భారత దేశం

నిర్మలసుర గంగా జల సంగమక్షేత్రం
రంగుల హరివిల్లులు విలసిల్లిన నిలయం
భారతదేశం మన జన్మప్రదేశం
భారత ఖండం ఒక అమృత భాండం ॥

1) ఉత్తరాన ఉన్నతమౌ హిమగిరి శిఖరం
దక్షిణాన నెలకొన్నది హిందు సముద్రం
తూరుపుదిశ పొంగిపొరలె గంగాసంద్రం
పశ్చిమాన అనంతమౌ సింధు సముద్రం ॥ భారతదేశం ॥

2) ఒకే జాతి సంస్కృతి ఒకటున్న ప్రదేశం
రత్నగర్భ పేరుగన్న భారతదేశం
ధీర పుణ్య చరితలున్న ఆలయ శిఖరం
సత్యధర్మ శాంతులున్న ప్రేమ కుటీరం ॥ భారతదేశం ॥

3) కోకిలమ్మ పాడగలదు జాతీయగీతం
కొండ కోన వాగు పాడు సంస్కృతిగీతం
గుండెగుండె కలుసుకొంటె సమరస భావం
చేయి చేయి కలిపితేనే ప్రగతుల తీరం ॥ భారతదేశం ॥

4) మనది అన్న భావముంటె మనుగడ సాధ్యం
శక్తి శూన్యమై ఉంటే ప్రగతి అసాధ్యం
సంఘటనమె ఈ యుగాన సర్వశక్తి పీఠం
నిత్యశాఖ మన శక్తిని నిలిపే నిలయం ॥ భారతదేశం ॥

## 4. ప్రపంచ బాలల గీతి

ఎల్ల లెరుగని వాళ్ళము – కల్లలెరుగని వాళ్ళము
బాలలంమేమొక్కటే – లోకమూ మాకొక్కటే

గోధుమ రంగున కొందరు – పసుపువన్నె ఇంకొందరు
తెలుపు, నలుపు, ఆపిల్ఎరుపు – ఏరంగైనా ముచ్చట గొలుపూ
రంగేదైనా, రూపేదైనా – నివసించే ఆచోటేదైనా
బాలలం మేమొక్కటే – లోకమూ మాకొక్కటే

అన్నం పప్పు, చారూ కూరా – శాకాహారం తినువారైతే
గుడ్డూ, చేపా, కోడికూరా – మాంసాహారం తినువారైతే
తిండేదైనా, తీరేదైనా – తినగోరే ఆరుచులేవైనా
బాలలం మేమొక్కటే – లోకమూ మాకొక్కటే

అవునందురు, ఎస్ అందురు కొందరు – ఒకే, టాటా అందురు కొందరు
సీ, దేఖో, జా అంటూ కొందరు – పలు విధాలుగా పలుకుచుందురు
మాటేదైనా పాటేదైనా – పెదాలు కలిపే భాషేదైనా
బాలలం మేమొక్కటే – లోకమూ మాకొక్కటే
దేశాల్ వేర్వేరైనా కానీ – సందేశం మాదిదే యిదే
సంతోషంతో సకల ప్రపంచం – పకపకలాడాలన్నదే.

(UNICEF బాలలగీతి – అనువాదం – సుధామ)

## 5. అడవి అందాలు

అడవి కడుపులో దాగినవెన్నో ఎన్నో అందాలు
ఆ అందాలను మన కందించిన తల్లికి దండాలు
అడవి తల్లికి దండాలు ॥ అడవి ॥

1) పక్షులు వదలిన విత్తనము పలకరించిన జల్లులతో
పచ్చని అడవిగ పరిణితి చెంది పంచెను జగతికి అందాలు
ఆ అందాలను తనలో దాచిన తల్లికి దండాలు – అడవి తల్లికి దండాలు

2) చల్లని గాలిని పంపి నల్లని మబ్బును దింపి
ఝల్లున వానలు కురిసే సిరి సిరి పంటల మురిసే
ఆ మురిపాలకు మూలమైన మన తల్లికి దండాలు – అడవికి తల్లికి దండాలు

3) పులులూ, సింహాలైన పురి విప్పిన మయూరమైన
పడగెత్తిన పాములనైనా పసిపాపల లాగే పెంచి
తన ఒడిలోనే లాలించే అసలైన అమ్మకు దండాలు – అడవి తల్లికి దండాలు

# 6. ఎందరో ఉన్నారు మహాను భావులు

ఎందరో ఉన్నారు మహాత్ములు – మంచిని ఎంతో మనకు బోధించారు
మానవతను మనసులలో నింపమన్నారు – మహానీయులై మాన్యతను పొందమన్నారు

1) కర్తవ్యం దైవమని భావించిన రాముడు
ప్రజా వాక్య పాలనకు పేరు గాంచినవాడు
ఒకే మాట – ఒకే పత్ని వ్రతమన్నాడు
ఆదర్శ మానవుడై అవతరించినాడు ॥ ఎందరో ॥

2) కర్మ సిద్ధాంతం బోధించిన కృష్ణుడు
జగతికి గీతా జ్ఞానము నందించాడు
పరోపకారమే ప్రగతికి మూలమన్నాడు
అంతకు మించిన ధర్మం లేదన్నాడు ॥ ఎందరో ॥

3) ప్రేమించే మంచి గుణం నేర్చుకొమ్మనీ
నీవలె నీ పొరుగు వారి నిష్టపడమనీ
క్షమా గుణము నేర్పాడు క్రీస్తు ప్రభువు
పశ్చాత్తాపమే పాప క్షయమన్నాడు ॥ ఎందరో ॥

4) ఉన్నదానిలో కొంచెం – నిరుపేదల కిమ్మన్నాడు
దీనులనూ వృద్ధులను దయ చూడమన్నాడూ
పంచి ఇచ్చు మంచి గుణం నేర్పాడు
ప్రవక్త మహ్మద్ – ప్రవక్త మహ్మద్ ॥ ఎందరో ॥

5) అందరూ మంచినే – బోధించారు
అది నిన్నూనన్నూ నేర్చుకొమ్మన్నారూ
అది గొప్ప ఇది గొప్ప వాదులాట వద్దన్నారు
మంచి ఎక్కడున్నా అది మనదన్నారు, మనదేనన్నారు ॥ ఎందరో ॥

## 7. ఆడపిల్లా - ఆడపిల్లా

ఆడపిల్లా... ఆడపిల్లా...
ఇది నాకే ఎందుకు పుట్టాల
అని బావురుమనకే అమ్మా
బెంగపడకు నాన్నా! ॥ ఆడపిల్లా ॥

వయసు ఉడిగినా కాలంలో - నే
ఊతగర్ర నౌతా!
కష్టాల కన్నీళ్ళ తేలే వేళ కంటి తుడుపునౌతా
సేవ చేసుకొని సేదదీర్చగా చలవ పందిరౌతా
నే చలవ పందిరౌతా ॥ ఆడపిల్లా ॥

1) ఆడపిల్లలే పుట్టకపోతే - పుట్టుకలెట్లా సాగేనూ
ఈ సృష్టికి మూలం మేమేనూ...
మీ అమ్మా... మా అమ్మా... ఆ అమ్మను గన్న మరియొక అమ్మా!
అందరూ ఆడవాళ్ళే గదా! అన్నిటాసగపాలే గదా! ॥ ఆడపిల్లా ॥

2) కడుపులోనె నన్ను కాలరాయకా -
కన్నందుకు నీకూ నా కోటి వందనాలూ...
కంటిపాపలా పెంచుకో... నీ ఇంటి దీపమై వెలుగుతా
కమ్మగా చదివించుకో... నీ కంటి వెలుగునేనౌతా ॥ ఆడపిల్లా ॥

## 8. కవులెవ్వరు తాతా?

కవులు, కవులంటారు
కవులెవ్వరు తాత ?
మనకంటె వారికే
మహిమలుంటాయి ? తాత

కవులంటె మనకంటే
ఘనులేనె తల్లి
కళ్ళు మనకీ రెండు
కవి కొక్క టధికము

రవి చూడ లేనిది
కవిచూడ గలడమ్మ
చూచి అతడు దాన్ని
చిత్రించ గలడమ్మ
చిత్రమ్ములో మనసు
హత్తుకొని పోయేను
కవు లంటె మనకంటె
ఘను లేనె తల్లి.
జంట కవులంటారు
వారెవ్వరో తాత?
నీ జంట నేనుంటె
కవనాలు వచ్చేన ? తాత.

జంట కవులంటూను
ఉంటారు తల్లీ
భావాలు ఒకరివీ
భాష వేరొకరిదీ
కలబోసి వడబోసి
కవితలల్లేరమ్మ
చెంబులేనీ చేద
చేదలేనీ చెంబు
చేదగా, నరౌన
ఆరీతినే వీరు కవితలల్లేరమ్మ
ఘనత వందేరమ్మ
జంటకవు లంటాను
ఉంటారె తల్లీ.....

– రావూరి వేంకట సత్యనారాయణ రావు.

## 9. కలపండి చేయి చేయి

కలపండి చేయి చేయి కలపండి
పదిమంది భుజం భుజం కలపండి
కలిసుంటే మనం మనం
పనిచేస్తే క్షణం క్షణం
క్షణం క్షణం పని చేస్తే
అందరికీ సుఖం సుఖం
సుఖం సుఖం అందరికీ.

కొండరాళ్ళు పగులగొట్టి లోన చదును చేద్దాం
కోన వెంట దారి తీసి గోదారులు వేద్దాం
కొండ కోన లొంగ దీసి కొల్లలు పండిద్దాం

కోడికన్న ముందు లేచి కూతెట్టును ఫ్యాక్టరీ
కూడు గుడ్డ వద్దామరి కునుకు తుంటె సోమరీ
పాడుకుంటు పనిచేస్తే పదిమందికి లాహిరి
ఆడుకుంటు పని చేస్తే అనిపించదు చాకిరి.

కలకత్తా కాశ్మీరం కాశీ కన్యాకుమారి
కలిపేస్తాం రైలుదారి కాన కోన రహదారి
కానొద్దాం భూమంతా విమానాల బైలుదేరి.

– దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి

## 10. భారతీయులు

భారతీయులు కర్మవీరులు
భారతీయులు జ్ఞానయోగులు
భారతీయులు త్యాగమూర్తులు
యుగయుగమ్ములలో

బుద్ధదేవుడు గాంధి పుట్టిన
పుణ్యభూమిని విశ్వమానవ
శాంతి దీపస్తంభదీధితి
మార్గదర్శి యగున్

తుంగ భంగ తరంగ సంగతి
కథల గర్భము కనలి మ్రోగెను
కలము నడుపుము కర్ణధారీ
తొట్రు పడకుండన్

గగన మందున కారుమబ్బుల
కటిక చీకటి గ్రమ్ముచున్నది
ప్రళయ ఝుం ఝూ పవన ఘోషా
ఘూర్ణ గర్జనలన్

వెనుక చూపును వీడి ముందుకు
వేగ పోవలె వెనుక నిలిచెడి
అలసహృదయులు కొరకు ఆగెడి
అదను కాదు సుమా!

పారుబోతుల వదలి వేయుము
పిరికి పందల విడిచి పుచ్చుము
కదము త్రొక్కుచు కదలిపోరా
ఓ భరతవీరా !

భరతమాతకు భాగ్యధాత్రికి
శాంతిసీమకు ఆర్షభూమికి
అన్నపూర్ణకు అమృతశీలకు
హృదయ వందనములన్.

# 4. కథలు

## 1. నచికేతుడు

వాజశ్రవుడొక ముని. ఆయన భార్య విశ్వావర దేవి. వీరి కుమారుడు నచికేతుడు. నచికేతుడు చిన్నప్పటి నుండి కొత్త విషయాలు తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ ఉండేవాడు. ఎంతో జాగ్రత్తగా వినేవాడు. ఒకసారి విన్నది మరచిపోయేవాడు కాదు.

ఒకనాడు వాజశ్రవుని కుటీరానికి ఒక ముని వచ్చాడు. నచికేతుడు నమస్కరించాడు. ఆ ముని తియ్యని మామిడిపండు ఇచ్చాడు. నచికేతుడు దానిని కాదని అంతరదృష్టిని కలిగించే జ్ఞానం కావాలన్నాడు. వాజశ్రవుడు కోపంతో కొడుకును గద్దించి అవతలకు పొమ్మన్నాడు. ముని నచికేతుని సమర్థించాడు. అయితే మీరే వాడికి చదువు చెప్పండి అని కుమారుని అప్పగించాడు. నచికేతుడు గురుకులంలో ఉత్తమ విద్యార్థిగా పేరు పొందాడు.

నచికేతుడు గురుభక్తి కలిగి గురుశుశ్రూష చేస్తున్నాడు. ఇంతలో తండ్రి వాజశ్రవుడు విశ్వజద్యాగము చేస్తున్నాడని తెలిసి గురువుతో కలిసి ఇంటికి వచ్చాడు.

వాజశ్రవుడు ఆవులను దానం ఇస్తున్నాడు. అదిచూచి తండ్రీ ! నన్నెవరికి దానమిస్తున్నారని నచికేతుడు అడిగాడు. తండ్రి తన సహజ కోపంతో "మృత్యువుకు" దానమిస్తున్నానన్నాడు. అంతే! నచికేతుడు యమలోకానికి వెళ్ళాడు. అక్కడ యముడు లేడు. మూడు రోజులు ఆహారం లేకుండా ఉపవాసవ్రతాన్ని ఆచరించాడు. ఇంతలో యముడు వచ్చాడు. సంగతి తెలిసి నచికేతునికి ఆతిథ్యం ఇచ్చాడు.

మూడు రోజులు ఉపవసించిన నచికేతునికి మూడు వరాలు ఇవ్వదలిచాడు యముడు. వరాలు కోరుకోమన్నాడు. మొదటివరంగా నచికేతుడు తన తండ్రికోపం పోవాలన్నాడు. రెండవ వరంగా అగ్ని విద్యను అడిగాడు. యముడు రెండు వరాలిచ్చాడు. అగ్ని విద్యను బోధించి తిరిగి చెప్పమన్నాడు. నచికేతుడు తప్పులేకుండా తిరిగి చెప్పాడు. యముడు సంతోషించి ఇకపై ఈవిద్య "నచికేతాగ్ని"గా ప్రసిద్ధి పొందుతుందని చెప్పాడు. అదనంగా అందమైన మణిహారాదులను బహూకరించాడు. మూడవ వరంగా ఆత్మవిద్యను ప్రసాదించాడు యముడు. యముని అనుమతితో తిరిగి భూలోకానికి వచ్చాడు నచికేతుడు. ఆత్మజ్ఞానంతో ప్రకాశిస్తున్న నచికేతుని చూచి, తండ్రి సంతోషించాడు.

బాల్యంలోనే గొప్ప ఋషులను మించి జ్ఞానం పొందిన బాల ఋషి నచికేతుడు, శ్రద్ధకు మారు పేరుగా గుర్తింపబడుతున్నాడు.

## 2. కష్టపడేవారికి విజయం తథ్యం

పార్వతీపరమేశ్వరులు ఆకాశమార్గాన వెళ్తుండగా ఒకరైతు పొలంలో విత్తనాలు జల్లుతూ కన్పించాడు. వెంటనే వాళ్ళిద్దరూ భూమిమీదకు దిగారు. "వర్షం వచ్చే అవకాశం లేదు. ఈ విత్తనాలు ఎలా మొలకెత్తుతాయి?" ప్రశ్నించాడు శివుడు. ఈ రాత్రికి వర్షం వస్తుంది అన్నాడు రైతు. రాదని శివుడు, వస్తుందని రైతు వాదించుకున్నారు సరే, ఎవరిమాట నిజమవుతుందో రాత్రికి తెలుస్తుందిలే అన్నాడు రైతు.

శివుడు వర్షాధిపతి అయిన ఇంద్రుని దగ్గరకెళ్ళి వర్షం పడకుండా చూడమన్నాడు. "అది నా వల్ల కాదు కప్పలు బెకబెకలాడితే మాత్రం వర్షం పడేటట్లు చూడాల్సిందే" అన్నాడు ఇంద్రుడు. శివుడు కప్పల వద్దకు వెళ్ళి వాటిని బెకబెకలాడవద్దన్నాడు. "అది మా వల్లకాదు, మిణుగురు పురుగులు కనుక ఎగిరితే మేం బెకబెకలాడాల్సి వస్తుంది" అన్నాయి కప్పలు. శివుడు మిణుగురు పురుగుల దగ్గరకెళ్ళి వాటిని ఎగరవద్దన్నాడు. అవి సరే అన్నాయి. శివుడు తనే గెలుస్తానని ఆనందించాడు.

రాత్రికాగానే వర్షం మొదలయింది. శివుడికి కోపం వచ్చింది. సంగతి కనుక్కోవాలని ఇంద్రుడి దగ్గరకు వెళ్ళాడు. అతను "కప్పలు బెకబెకలాడాయి. దాంతో వర్షం కురిపించాల్సి వచ్చింది" అన్నాడు. శివుడు కప్పల్ని కలిశాడు. "మిణుగురు పురుగులు ఎగిరాయి. దాంతో మేం అరవాల్సి వచ్చింది. అన్నాయి కప్పలు. శివుడు పురుగుల్ని కలిసాడు. అవి మేం ఎగరలేదన్నాయి. సంగతేమిటో పరిశీలిద్దామని శివుడు పొలం దగ్గరకు వెళ్ళాడు.

అక్కడ పొలంలోని చెట్టుక్రింద మినుకుమంటూ వెలుతురు కన్పించింది. మరింత దగ్గరగా వెళ్ళిచూస్తే రైతు ఒక మండుతున్న చిన్న కర్రను పట్టుకుని విత్తనాలు జల్లుతున్నాడు. అంటే మండుతున్న పుల్లను చూసి కప్పలు మిణుగురు పురుగులనుకొని అరిచాయన్నమాట అని శివుడు గ్రహించాడు. రైతు ముందు తన ఓటమిని అంగీకరించి శివుడు కైలాసం చేరాడు. అంటే కష్టపడి పనిచేసే వ్యక్తికి విజయం లభించకుండా చివరికి దేవుడు కూడా అడ్డుకోలేడన్నమాట.

*మనం చేసే పని సక్రమంగా చెయ్యాలి. అందులో లోపం కనిపించకూడదు.*

*"సమస్త దుర్గుణాలకు మూలం గర్వమే"*

*అన్ని చెడుగుణాలకు, అన్ని పాపాలకు మూలం గర్వమే. గర్వంతో కోపం వస్తుంది. ఈకోపంతో అసహనం, ఓర్వలేనితనం, ఈర్ష్య, మొదలైన చెడుగుణాలు పుడతాయి. ఈగర్వం వల్లనే ఇతరుల మనసు నొప్పించటం జరుగుతుంది. ఇదే పరనిందకు కారణం అవుతుంది. మనసులో మానవత్వం, మర్యాద, మన్నన, లేనంతవరకు మనిషికి ఈ చెడునడతల నుండి పరిష్కారం లభించదు. దైవదాసుడు, దైవభక్తుడు, దైవవిశ్వాసి అయిన వ్యక్తి గర్వం వంటి చెడునడతలకు దూరంగా ఉంటూ మర్యాదా మన్ననలతో ఇతరులను తనవారి మాదిరిగానే గౌరవించాలి. నీవు*

*ఇతరులను గౌరవించకపోయినట్లయితే ఇతరులు కూడా నిన్ను గౌరవించరు. సర్వమానవులను సమానంగా చూస్తూ గర్వాన్ని వదలి అంతా దైవాభీష్టం మేరకు జరుగుతుంది అని భావించడంలోనే శుభం కలుగుతుంది.*

*మానవత్వం, సోదరభావం, స్వార్థరాహిత్యం, సహనం, ఓర్పు, మృదువుగా మాట్లాడటం, ఇతరుల మనసును నొప్పించకుండా ఉండడం, మర్యాదగా మసలుకోవడం, కల్మషం లేకుండా మాట్లాడడం – ఇవే మనస్సు అందానికి మూలకందాలు.*

*– మూలం : సందేశసుంగధం*

*మానవుడు సంఘజీవి. ఎలాగైతే సముద్రాన్ని దాటి అలలు వెళ్ళలేవో అలాగే సంఘాన్ని వదలి మానవుడు ఉండలేడు, జీవించలేడు. ప్రతి మనిషికి అవసరాలు అనేవి సాధారణం. సంఘంలోని ప్రజలందరూ పరస్పరాశ్రయంతో నడుచుకుంటూ ఉంటారు.*

*ఒకవ్యక్తికి అవసరం వచ్చినపుడు తనకు తెలిసిన వారి ద్వారా, లేక బంధువుల ద్వారా, స్నేహితుల ద్వారా అవసరాన్ని నెరవేర్చుకుంటాడు. ఆ అవసరం తీరిన తర్వాత సహాయం చేసిన వారికి కృతజ్ఞత తెలుపుకోవడం ఆవ్యక్తి ధర్మం. కొందరు తమకు చేసిన సహాయానికి ధన్యవాదాలు తెలుపుతారు. మరికొందరైతే తమ కార్యం నెరవేరేంత వరకు ఎంతో వినయవిధేయతలు, భక్తిశ్రద్ధలు చూపుతుంటారు. ఆకొంచెం పని ముగిసిందనుకోండి, ఇక అతన్ని పట్టించుకోరు. ఇలా చేసిన మేలు మరచిన వాణ్ణి 'కృతఘ్నుడు' అని అంటారు. ఈ విషయాన్నే విపులంగా మహాప్రవక్త (స) ఇలా ప్రవచించారని హజ్రత్ జాబర్ బిన్ అబ్దుల్లా (రజి) ఇలా ఉల్లేఖించారు. "ఒక వ్యక్తి మరొక వ్యక్తి ద్వారా సహాయం పొందినపుడు, ఆ సహాయానికి మారుగా ఏదైనా సహాయం చేయడానికి తన వద్ద ఏమీ లేనపుడు, కనీసం తాను పొందిన సహాయానికి ప్రతిఫలంగా అతనికి కృతజ్ఞత తెలియజేయటం లేక అతని సహాయాన్ని ప్రశంసించడం విధేయుల లక్షణం" అని మహాప్రవక్త బోధించారు. ఇంకా ఆయన (స) "సహాయం చేసిన వ్యక్తి కూడా తాను చేసిన సహాయాన్ని బయటికి చెప్పకుండా ఉండడం కృతజ్ఞతగా లెక్కించాలని" వక్కాణించారు.*

*– మూలం : సందేశసుంగధం*

## 3. పదిమంది మూర్ఖులు

ఒకరోజు బీర్బల్‌తో కలిసి ఉద్యానవనంలో నడుస్తున్నాడు అక్బర్. బీర్బల్ నీకు తెలుసా! మన ఆగ్రాలో మూర్ఖులెవరైనా ఉన్నారా అని చూస్తున్నాను. నాకింతవరకు ఒక్కడు కూడా కనపడలేదు అకస్మాత్తుగా చెప్పాడు అక్బర్. అదంతా మీ ప్రజల గొప్పతనం ప్రభూ! అన్నాడు బీర్బల్.

"నా ఉద్దేశాన్ని నువ్వు సరిగా అర్థం చేసుకోలేదు. మూర్ఖులను ఎలా గుర్తించాలా అని నేను తిరుగుతున్నాను" చెప్పాడు అక్బర్.

"మహారాజా! తెలివైన వారు కూడా ఒక్కో సందర్భంలో మూర్ఖంగా ప్రవర్తిస్తారు. మనం సరిగా పరిశీలిస్తే లెక్కించలేనంత మంది మూర్ఖులు తారసపడతారు" అన్నాడు బీర్బల్.

"అలాగా! అయితే నీకు పదిరోజుల గడువు ఇస్తున్నాను. కనీసం పది మంది మూర్ఖులను నాముందు నిలబెట్టమని" ఆదేశించాడు అక్బర్.

బీర్బల్ సరేనని చెప్పి సెలవు తీసుకున్నాడు. తెల్లవారినప్పటినుండి అతను దర్బారుకు వెళ్ళకుండా మూర్ఖులకోసం తిరగసాగాడు. నాలుగురోజుల వరకు అతనికి ఒక్క మూర్ఖుడూ తారసపడలేదు.

మరుసటి రోజు తన ఇంటి కిటికీలోంచి వీధిలోకి చూశాడు బీర్బల్. గుర్రంపై ఒక వ్యక్తి కూర్చుని తన తలపై గడ్డిమోపు పెట్టుకుని వెళ్తూ కనిపించాడు. బీర్బల్ వెంటనే వీధిలోకి వెళ్ళి అతన్ని ఆపి "గడ్డిమోపు నీ తలపై ఎందుకు పెట్టుకున్నావు? గుర్రంపైన నీ వెనుక పెట్టుకోవచ్చు కదా?" అని ప్రశ్నించాడు.

అందుకు ఆ వ్యక్తి "నా గుర్రం బాగా అలసిపోయింది. నన్ను మొయ్యడమే దానికి కష్టంగా ఉంది. అందుకే నన్ను అది మోస్తుంది, గడ్డిమోపును నేను మోస్తున్నాను" అని జవాబిచ్చాడు.

బీర్బల్ అతని పేరు, చిరునామా తెలుసుకొని మూర్ఖుల జాబితాలో రాసుకున్నాడు. బీర్బల్ వెనక్కు తిరిగి ఇంటికి వెళ్ళబోతుండగా ఒక వ్యక్తి పరిగెడుతూ వచ్చి ఢీకొన్నాడు. బీర్బల్ అతన్ని ఆపి "ఎందుకు అలా పరిగెడుతున్నావు? నువ్వు ఎక్కడికి వెళ్తున్నావో తెలుసా?" అని ప్రశ్నించాడు అతను తనను ఢీకొన్నందుకు క్షమాపణ అడుగుతాడని బీర్బల్ భావించాడు కానీ ఆ వ్యక్తి "నేను నా గొంతు నుండి వెలువడే ధ్వనిని పట్టుకోవడానికి వెళ్తున్నాను. మీరు నన్ను ఆపారు" అన్నాడు చిరాకుగా.

బీర్బల్ అతని పేరు, చిరునామా తన జాబితాలో రాసుకున్నాడు. ఇంకా ఎనిమిది మంది అతని జాబితాలో ఎక్కవలసి ఉంది.

మరుసటి రోజు బీర్బల్ నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటూ కన్పించారు. బీర్బల్ వారి మాటలు వినసాగాడు. వారిలో ఒకడు "ఒక వేళ దేవుడు ప్రత్యక్షమై నీకేం కావాలని అడిగితే ఏం కోరుకుంటావు?" అని ప్రశ్నించాడు రెండవ వాణ్ణి.

"నాకు బాగా పాలిచ్చే ఆవుని ఇమ్మని కోరతాను. దాంతో నా పిల్లలు బాగా పాలు తాగుతారు" అని బదులిచ్చాడు. "నువ్వేం కోరుకుంటావు?" అని ప్రశ్నించాడు మొదటి వాడ్ని.

"నీ ఆవును తిని వేయడానికి ఒక పులిని యిమ్మని కోరతాను" చెప్పాడు మొదటివాడు.

"నా ఆవును వీడి పులి తినేసింది" అంటూ ఏడవడం మొదలెట్టాడు రెండవవాడు

నెత్తిన నూనెతో కూడిన కుండ ఒకటి పెట్టుకొని ఆదారిన వెళ్తున్న ప్రయాణికుడొకడ్ని ఆపి తమ తగవు పరిష్కరించమన్నారు ఇద్దరూ తన ఆవును ఎదుటివాడి పులి తినేసిందని, దాని వల్ల తన పిల్లలకు పాలు లేకుండా పోయాయని రెండవవాడు గగ్గోలు పెట్టాడు. ప్రయాణికుడు అయోమయంలోపడి వాళ్ళు ఊహల్లో ఆవుని, పులిని ఊహించుకొని కొట్లాడుతున్నారని గ్రహించలేక పోయాడు. "మీరిద్దరూ మూర్ఖులు. నేను కుండలోవున్న నూనె, నీళ్ళలా ప్రవహిస్తుందా? లేదా? అని ఆలోచిస్తుంటే నన్ను ఆపారు." అంటూ కోపంతో కుండపై చేతులు తీశాడు.

అంతే కుండ రోడ్డుపై పడి పగిలిపోయింది. నూనె ప్రవహించింది. బీర్బల్ ఆ ముగ్గురి చిరునామాలను తన జాబితాలో చేర్చుకున్నాడు. అతనికి ఇంకా ఐదుగురు మూర్ఖులు కావాలి.

ఆ రాత్రి బీర్బల్ ఇంటికి తిరిగి వెళ్తుండగా ఒక వ్యక్తి వీధి దీపం కింద ఏదో వెదుకుతూ కన్పించాడు. ఏం వెతుకుతున్నారని బీర్బల్ అతనిని ప్రశ్నించాడు. "నా ఉంగరం పడిపోయింది" అని సమాధానమిచ్చాడా వ్యక్తి.

"ఎక్కడ పడిపోయింది?" మళ్ళీ బీర్బల్ ప్రశ్నించాడు.

"అక్కడ" అంటూ చీకట్లోకి చూపించాడా వ్యక్తి.

"అక్కడ పడితే ఇక్కడ ఎందుకు వెదుకుతున్నావు?" అర్థంకాక ప్రశ్నించాడు బీర్బల్.

"అక్కడ చీకటిగా ఉంది. ఇక్కడ వెలుతురు ఉందికదా! అందుకని" సమాధానమిచ్చాడు ఆవ్యక్తి.

బీర్బల్ వెంటనే అతనిపేరు, చిరునామా తన జాబితాలో రాసుకున్నాడు. ఇంకా ఒకరోజు గడువు మాత్రమే మిగిలింది. ఇంకా నలుగురు మూర్ఖులు దొరకాలి.

బీర్బల్ కొద్దిదూరం నడవగా రోడ్డుపక్కన గుంతలో ఒక వ్యక్తి సహాయం చేయమని అరుస్తూ కన్పించాడు. బీర్బల్ అతని చేతులుపట్టి బయటకు లాగబోయాడు. అప్పుడా వ్యక్తి "నా చేతులు ముట్టుకోవద్దు. నేను నా స్నేహితుడి పెట్టె కొలతలు చేతులతో చూసి వస్తూ ఈ గుంతలో పడ్డాను. నా చేతులు పట్టుకుంటే పెట్టె కొలతలు పోతాయి. నా జుట్టు పట్టి బయటకు లాగండి" అంటూ చేతుల్ని కదలకుండా అలాగే ఎత్తిపట్టాడు.

బీర్బల్ నవ్వుకుంటూ అతని జుట్టుపట్టి బయటకులాగి అతని పేరు చిరునామా రాసుకున్నాడు. అతను తిరిగి ఇంటికి వెళ్తుండగా అక్కడక్కడ గోతులు తవ్వుతూ ఒక వ్యక్తి కన్పించాడు. "ఏమిటి? మొక్కలు నాటుతున్నారా?" ప్రశ్నించాడు బీర్బల్.

"లేదు. నా కష్టార్జిత సొమ్మును ఇక్కడే ఎక్కడో గొయ్యి తీసి దాచాను. దానికోసం వెదుకుతున్నాను" బదులిచ్చాడు అతను.

"మీరెక్కడ గొయ్యి తీసి దాచారో ఆనవాలు ఉంచుకోలేదా?" ప్రశ్నించాడు బీర్బల్.

"ఎందుకు ఉంచుకోలేదు. నేను గొయ్యి తీసి పెట్టేటప్పుడు పైన ఆకాశంలో నల్లటి మేఘం ఒకటుంది. దాని క్రిందే గొయ్యి తీసి పెట్టాను" చెప్పాడు ఆ వ్యక్తి.

బీర్బల్ వెంటనే ఆ వ్యక్తి పేరు, చిరునామా రాసుకున్నాడు. అతని జాబితాలో మొత్తం ఎనిమిది మంది చేరారు.

మరుసటి రోజు జాబితాను అక్బరుకు సమర్పించాడు. బీర్బల్. అక్బర్ ఆ జాబితాను పరిశీలించి "ఎనిమిదిమంది జాబితా ఇచ్చావు. ఇంకా ఇద్దరు ఉండాలి వారేరి?" అని ప్రశ్నించాడు అక్బర్.

"తొమ్మిదవ వాడు మీ ప్రక్కనే ఉన్నాడు మహారాజా! అతను నేనే. ఎందుకంటే పది రోజుల కాలాన్ని పదిమంది మూర్ఖులను వెదకటానికి ఉపయోగించిన నేనూ మూర్ఖుణ్ణే కదా!" అని బదులు చెప్పాడు బీర్బల్ .

"నిజమేననుకో, మరి పదవవాడు ఎవరు?" అక్బర్ ప్రశ్నించాడు.

"మీరేమి అనుకోకపోతే ఆ పదవవారు మీరే మహారాజా!" అన్నాడు బీర్బల్ వినయంగా. "ఎందుకంటే చక్రవర్తిగా రాజ్యంలో మీకు ఎన్నో పనులు ఉండగా వాటిని వదలి మూర్ఖులకోసం వెదకడం ఒక రాజు చెయ్యవలసిన పనేనా? వినమ్రంగా చెప్పాడు బీర్బల్.

బీర్బల్ సమాధానంతో నిజం గ్రహించిన అక్బర్. భయపడకుండా సమయస్ఫూర్తితో నిజాన్ని తెలియజెప్పిన బీర్బల్‌ను సముచితంగా సత్కరించాడు అక్బర్.

## 4. అబద్ధం

"ఇవాళ స్కూలుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి నా ఫ్రెండ్స్‌తో సినిమాకు వెళ్ళాను. ఈ విషయం తెలిస్తే నాన్నగారు కొడతారు. అందుకని స్కూలుకే వెళ్ళానని అబద్ధం చెబుతాను" అనుకుంటూ ఇంట్లోకి అడుగుపెట్టాడు కిషోర్. అప్పుడు సమయం సాయంత్రం నాలుగు గంటలైంది.

కిషోర్ తండ్రి రాజారావు సోఫాలో కూర్చుని ఏదో పత్రిక చదువుతున్నాడు. ఆయన కిషోర్ రాకను గమనించి ఓసారి వాచీకేసి చూసుకుని "ఏరా కిషోర్! రోజూ ఐదు గంటలకు స్కూలు నుండి వచ్చేవాడివి. ఇవాళ నాలుగు గంటలకే వచ్చావేమిటి?" అని అడిగాడు. దానికి కిషోర్ "మరేమో నాన్నగారు ఈ రోజు మా స్కూల్లో సభ జరిపారు. సభ అయిపోయిన వెంటనే మమ్మల్ని పంపించి వేశారు" అని జవాబిచ్చాడు. "అలాగా! మరి సభ దేని గురించి జరిపారు" అని ప్రశ్నించాడు రాజారావు. కిషోర్ అయోమయంలో పడ్డాడు. ఆ అయోమయాన్ని కప్పిపుచ్చుకుంటూ "ఈ రోజు మా స్కూలుకు ఒకాయన వచ్చాడు. ఆయన గాంధీజీతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడట.

ఆయన కోసమే సభ ఏర్పాటు చేశారు" అని చెప్పాడు. "ఓహో అలాగా! సరేగాని శేఖర్ మాస్టారు మీకు ఏం చెప్పారు" అని అడిగాడు రాజారావు. "లెక్కలు చెబుతారు" చెప్పాడు కిషోర్. "ఈ రోజు ఆయన స్కూలుకు వచ్చారా?" "వచ్చారు నాన్నగారు" అని చెప్పాడు కిషోర్ అసహనంగా. "హోంవర్క్ ఇచ్చారా?" అని అడిగాడు రాజారావు. కిషోర్ ఏం చెప్పాలా అని సంధిగ్ధంలో పడ్డాడు. ఏదో ఒకటి చెప్పకపోతే తన బండారం బయట పడుతుందని మెల్లగా "ఇచ్చారు నాన్నగారు! పది లెక్కలు ఇంటి వద్ద చేసుకుని రేపు క్లాసులో చూపించమన్నారు" అని చెప్పాడు. "సరే ఇక నువ్వు లోపలికెళ్ళి చదువుకో" అంటూ తిరిగి పత్రిక చదవడంలో నిమగ్నమయ్యాడు రాజారావు.

కిషోర్ గుండెల నిండా ఊపిరి పీల్చుకుని "హమ్మయ్య బతికిపోయాను" అనుకుంటూ లోపలికి నడిచాడు. సరిగ్గా అప్పుడే శేఖర్ మాస్టారు వాళ్ళింట్లోకి వచ్చాడు. "నమస్కారమండి శేఖర్‌గారు! ఏమిటీ ఇలా అనుకోకుండా దయచేశారు" అని పలకరించాడు రాజారావు. "ఏం లేదు ఇవాళ ఆరోగ్యం కాస్త బాగా లేదు. అందుకే సెలవు పెట్టి ఇంట్లోనే ఉన్నాను. ఊరికే ఉండలేక మీతో కాసేపు మాట్లాడి వెళదామని ఇలా వచ్చాను" అన్నాడు శేఖర్ సోఫాలో కూర్చుంటూ. "అదేమిటి మీరీ రోజు స్కూలుకు వెళ్ళలేదా?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు రాజారావు. దానికి శేఖర్ "చెబుతున్నాను కదండీ! ఆరోగ్యం బాగాలేక వెళ్ళలేదని" అన్నాడు. "మరి మా కిషోర్ మీరీరోజు స్కూలుకు వచ్చారని చెప్పాడే!" అన్నాడు రాజారావు. "అలాగా! అతన్ని ఇల్లా పిలవండి" అన్నాడు శేఖర్. "కిషోర్....ఒరే కిషోర్" అంటూ గట్టిగా పిలిచాడు రాజారావు.

"వస్తున్నా నాన్నగారు!" అంటూ లోపలి గదిలోంచి బయటికి వచ్చిన కిషోర్ శేఖర్‌ను చూసి గతుక్కుమన్నాడు. తడబాటును కప్పిపుచ్చుకుంటూ మాస్టారుకు గుడ్‌ఈవినింగ్ చెప్పాడు. "ఏరా కిషోర్ నేనీ రోజు స్కూలుకు వచ్చానని మీ నాన్న గారితో చెప్పావట నిజమేనా?" అన్నాడు శేఖర్. కిషోర్ కాళ్ళల్లో వణుకు మొదలైంది. "మాట్లాడవేరా?" అంటూ గద్దించాడు రాజారావు. కిషోర్ ఏడుపు దిగమింగుతూ "నన్ను క్షమించండి నాన్నగారూ! నేనీ రోజు స్కూలుకు వెళ్ళలేదు" అన్నాడు. "మరి ఎక్కడికి వెళ్ళావు?" కోపంగా అడిగాడు రాజారావు. "మా ఫ్రెండ్సందరూ సినిమాకు వెళదామన్నారు. నేను కూడా వాళ్ళతో కలిసి వెళ్ళాను" అని జవాబిచ్చాడు భయంగా. "మరి స్కూలుకు వెళ్ళానని నాతో ఎందుకు అబద్ధం చెప్పావు" అన్నాడు రాజారావు తీక్షణంగా చూస్తూ. "స్కూలు మానేసి సినిమాకు వెళ్ళానని చెబితే మీరు కొడతారని అబద్ధం చెప్పాను" అన్నాడు కిషోర్. రాజారావు కోపంతో "స్కూలు మానేసి సినిమాకు వెళ్ళింది కాక నాతో అబద్ధాలు చెబుతావా, సిగ్గులేదు" అంటూ కిషోర్ మీదికి చెయ్యెత్తబోయాడు. శేఖర్ రాజారావును వారించాడు.

శేఖర్ కిషోర్‌ను దగ్గరకు పిలిచి "చూడు కిషోర్ బాగా ఆలోచించుకో, స్కూలు వదిలి సినిమాకు వెళ్ళావు. అది తప్పే. కానీ నిజాన్ని నాన్నగారికి చెప్పకుండా స్కూలుకే వెళ్ళానని అబద్ధం చెప్పావు. ఆ అబద్ధాన్ని కప్పిపుచ్చుకోవడానికి నువ్వు మళ్ళీ ఇన్ని అబద్ధాలు ఆడవలసి వచ్చింది. అందుకే పెద్దలు అన్నారు ఒక్క అబద్ధాన్ని కప్పిపుచ్చడానికి మరో వంద అబద్ధాలు ఆడవలసి వస్తుందని. ఇకనుంచి అబద్ధాలాడకుండా, సినిమాలకు, షికార్లకు వెళ్ళకుండా బుద్ధిగా ఉంటానని నాన్నగారికి క్షమాపణ చెప్పు" అన్నాడు. కిషోర్ రాజారావు కేసి తిరిగి "నన్ను క్షమించండి నాన్నగారు! ఇంకెప్పుడూ అబద్ధాలు చెప్పను. స్కూలుకు వెళ్ళి చక్కగా చదువుకుంటాను" అన్నాడు.

రాజారావు చిరునవ్వుతో కిషోర్‌ను దగ్గరకు తీసుకుని తల నిమిరాడు.

## 5. విలువైన బహుమతి

సంవత్సర పరీక్షలు మరో పదిరోజుల్లో ప్రారంభం కానున్నాయి. పద్మారావు మాష్టారు ఓరోజు ఆరోతరగతి పిల్లలతో "పిల్లలూ! జరుగబోయే పరీక్షల్లో ప్రతి సబ్జెక్టులో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న వారికి నేను మంచి బహుమతి ఇవ్వబోతున్నాను. కనుక మీరంతా బాగా కష్టపడి చదవాలి మరి" అన్నాడు.

పిల్లలందరికీ సంతోషం కలిగింది. ఉత్సాహంగా పోటీపడి మరీ చదవసాగారు. బహుమతి తనకే రావాలన్న పట్టుదల ప్రతి ఒక్కరిలో కనిపించింది. పరీక్షలు పూర్తయ్యాయి. ఎవరికివారు బాగా రాశామన్న తృప్తితో ఉన్నారు. "ఏప్రిల్ 23వ తేదీ మన పాఠశాలకు చివరి పనిదినం. ఆ రోజు మీకు ఫలితాలు చెప్పడంతోపాటు బహుమతులు కూడా ఇస్తాను" అని చెప్పారు మాష్టారు.

ఏప్రిల్ 23కు ఇంకా రెండు రోజులు ఉంది. మాష్టారు తమకు ఏ బహుమతి ఇవ్వబోతున్నారనే చర్చ పిల్లలందరిలో మొదలైంది. బహుమతి గురించి ఎవరికివారు ఊహించుకోసాగారు. "పెద్ద మెమొంటో ఇస్తారేమో" అన్నారొకరు.

"తప్పకుండా స్టీలు గిన్నె ఇస్తారు" అన్నారు మరొకరు.

"కాదు, కాదు కంపాస్‌బాక్స్‌లు ఇవ్వవచ్చు" అన్నారు ఇంకొకరు. ఇలా మాట్లాడుకుంటూనే అందరూ ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నారు.

ఆరోజు రానే వచ్చింది. పద్మారావు మాష్టారు ఆరు సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న వారిపేర్లు బోర్డుమీద రాసిపెట్టారు. అనిత, సుదర్శన్, నిర్మల, యుగంధర్, పద్మ, నర్మదలు బహుమతులు గెలుచుకున్నారు. మిగతా పిల్లలంతా వారివైపు గొప్పగా చూశారు. ఆ ఆరుగురికి కూడా చెప్పలేనంత సంతోషం కలిగింది.

అందరికి ప్రోగ్రెస్ రిపోర్టులు ఇచ్చారు. చివరగా మాష్టారు ఆ ఆరుగురికి ఆరు ప్యాకెట్లను అందించారు. ఏమై ఉంటుందా? అనే ఆత్రుతతో అందరూ తెరిచి చూశారు. అందమైన బొమ్మలతో ఉన్న ఒక కథల పుస్తకం. ఆ పుస్తకం చూస్తూనే యుగంధర్ "అయ్యో! పుస్తకమా!" అన్నాడు మెల్లగా.

ఆ మాటలు మాష్టారు విన్నారన్న విషయం గ్రహించిన యుగంధర్ నాలుక కరుచుకున్నాడు. మిగతా పిల్లలంతా పుస్తకం వైపు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నారు.

అప్పుడు మాష్టారు, "పిల్లలూ! ఈరోజుకు ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటో మీకు తెలుసా?" అడిగారు.

తెలియదన్నట్లు చూశారు పిల్లలంతా.

"ఈ రోజు జాతీయ పుస్తక దినోత్సవం. అందుకే మీకు పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చాను. పుస్తకాన్ని చూడగానే యుగంధర్ కొంచెం నిరాశపడ్డాడు. కానీ పుస్తకం విలువ తెలుసుకుంటే అతనికి ఇంకెప్పుడూ అలా అనిపించదు" అన్నారు.

మాష్టారు చెప్పే మాటల్ని పిల్లలంతా శ్రద్ధగా వింటున్నారు.

"బహుమతులుగా కేవలం స్టీలుపాత్రలు, మెమొంటోలు, ఇంకేవో వస్తువులు ఇవ్వాలని ఏమీ లేదు. నిజానికి పుస్తకం ఇచ్చే ప్రయోజనం ముందు అవన్నీ తీసికట్టే. మీరంతా స్కూలు పుస్తకాలతోపాటు ఇలాంటి మంచి మంచి కథల పుస్తకాలెన్నో చదవాలి. స్కూల్లో చెప్పని ఎన్నో పాఠాలను మీకు ఈ పుస్తకాలు చెబుతాయి. మీలో మంచి ఆలోచనలు కలిగిస్తాయి. మీకు చక్కగా చదవగల, రాయగల శక్తినిస్తాయి. వినోదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తాయి. అందువల్ల మీరంతా తప్పక పుస్తకాలు కొని చదవండి. మీ అమ్మా, నాన్నల్ని కొనిపెట్టమని అడగండి" చెప్పారు మాష్టారు.

మాష్టారి మాటలతో అక్కడున్న పిల్లలందరికీ పుస్తకాలు చదవాలన్న ఆసక్తి కలిగింది. యుగంధర్ పుస్తకం కూడా మంచి బహుమతే అని అర్థం చేసుకున్నాడు. పుస్తకాన్ని తడిమి చూశాడు.

"సెలవుల్లో ఈ పుస్తకాన్ని బాగా చదవండి. బడి తెరిచాక ఈ పుస్తకం నుంచి మీరేం గ్రహించారో తెలుసుకునేందుకు ఒక పోటీ పెడతాను, సరేనా" అన్నారు పద్మారావు మాష్టారు.

సరేనంటూ పిల్లలంతా ఇళ్ళకు పరుగుతీశారు.

## 6. స్నేహబంధం

సుధాకర్, గిరిధర్ పక్క పక్క ఇళ్ళల్లో ఉంటారు. సుధాకర్ కొడుకు వినయ్, గిరిధర్ కొడుకు కిరణ్. వాళ్ళిద్దరూ ఒకే స్కూల్లో ఒకే క్లాసు చదువుతున్నారు. రెండు కుటుంబాల వాళ్లు కలిసిమెలిసి ఉంటారు. వినయ్, కిరణ్ స్నేహంగా ఉంటూ ఒకరికొరకు ఒకరు సహాయం చేసుకుంటూ ఉంటారు. చదువులో ఏమైనా సందేహాలొస్తే ఒకరినొకరు అడిగి తెలుసుకుంటారు. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలిసే స్కూలుకు వెళ్ళొస్తుంటారు.

ఇదిలావుండగా రెండిళ్ళ మధ్య ప్రహరీగోడ కట్టే విషయంలో ఓ రోజు సుధాకర్, గిరిధర్ మధ్య వివాదం తలెత్తింది. అది కాస్తా చిలికి గాలివాన అయినట్లు పెద్ద తగాదాకు దారితీసింది. వాళ్ళ భార్యలు విమల, సరోజలు కూడా ఒకర్నొకరు తిట్టుకున్నారు. శాపనార్థాలు పెట్టుకున్నారు. ఆఖరికి ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు.

ఆరోజు సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన వినయ్‌తో సుధాకర్ "ఒరేయ్! రేపట్నుండి నువ్వు ఆ కిరణ్‌గాడితో తిరగడం మానెయ్. వాడితో స్నేహం చెయ్యకు" అన్నాడు ఆవేశంగా. "ఎందుకు నాన్నా?" అని అడిగాడు వినయ్ విషయం తెలియక. "వాళ్ళకు మనకు తగాదా అయిందిలే. ఐనా అదంతా నీకెందుకు? నేను చెప్పినట్లు చెయ్యి" అన్నాడు సుధాకర్. "మీరు తగాదా పెట్టుకుంటే నేనెందుకు స్నేహం మానెయ్యాలి నాన్నా? కిరణ్ చాలా మంచివాడు కదా! మేం స్నేహంగానే ఉంటాం" అన్నాడు వినయ్ దృఢంగా. ఆ మాటలు వినేసరికి సుధాకర్‌కు చిర్రెత్తుకొచ్చింది. "రేయ్! రేపట్నుంచి వాడితో కలిసి కనపడ్డావో నీ కాళ్ళు విరగ్గొడతా" అంటూ గుర్రుమన్నాడు.

కిరణ్ ఇంట్లో కూడా ఇదే పరిస్థితి. "వినయ్ వాళ్ళు మంచి వాళ్ళు కాదు. వాళ్ళతో తిరిగితే నువ్వు కూడా చెడిపోతావు. ఇకపై వినయ్‌గాడిని మనింటికి రానివ్వకు" అన్నాడు గిరిధర్ కిరణ్‌తో. అందుకు కిరణ్ "తగాదా మీరు

పెట్టుకున్నారుగానీ మేం కాదుగా! చిన్నప్పట్నుంచీ కలిసే ఉన్నాం. ఇకముందు కూడా అలాగే ఉంటాం" అన్నాడు. కిరణ్ మీదికి గయ్యిమని లేచాడు గిరిధర్.

మర్నాడు వినయ్, కిరణ్ స్కూల్లో కలుసుకున్నారు. ఇద్దరి ఇళ్ళల్లో జరిగిన విషయాలు తెలుసుకున్నారు. రెండు కుటుంబాలను తిరిగి కలపాలనుకున్నారు. సరిగ్గా అప్పుడే హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు జరుగుతున్నాయని తమ పాఠశాల నుండి కూడా విద్యార్థులు పాల్గొనవచ్చని హెడ్మాస్టరు క్లాసుకు నోటీసు పంపించారు. తామిద్దరూ ఒక గ్రూపుగా ఏర్పడి వెళ్దామనుకున్నారు వినయ్, కిరణ్ బాగా ప్రిపేరయ్యారు. పోటీలో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. పత్రికల్లో వారి ఫోటోలతో సహా వార్త వచ్చింది. బహుమతులతో ఇంటికి తిరిగివచ్చాక తమ పిల్లల్ని చూసి రెండు కుటుంబాల వాళ్ళు ఆనందంతో ఉబ్బితబ్బిబయ్యారు.

తాము అనవసరంగా తగాదా పడి పిల్లల్ని విడదీసే ప్రయత్నం చేసినందుకు సుధాకర్, గిరిధర్ సిగ్గుపడ్డారు. ఒకరినొకరు క్షమాపణ చెప్పుకున్నారు. విమల, సరోజ కూడా తప్పు చేశామని తెలుసుకున్నారు. ఇక ముందెప్పుడూ తగాదా పడకూడదని తమ పిల్లల్లాగే తామూ కలిసిమెలిసి ఉండాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నారు. తల్లిదండ్రుల్లో మార్పు వచ్చినందుకు వినయ్, కిరణ్ ఎంతో సంతోషించారు. దాని ముందు వారికొచ్చిన బహుమతి తెచ్చిన సంతోషం తక్కువే అయ్యింది.

## 7. అంతులేని కథ

అక్బర్ చక్రవర్తి జబ్బు పడ్డాడు. అతనికి సరిగా నిద్రపట్టడం లేదు. రాజవైద్యులు ఎంత ప్రయత్నించినా రోగం కుదరలేదు. చక్రవర్తికి సరిగా నిద్ర పట్టాలంటే అతని మనసు ప్రశాంతంగా ఉండాలని, అందుకుగాను కథలు వినడం మంచిదని ఒక హకీం సలహా ఇచ్చాడు.

"ఈ సలహా బాగుంది అయితే ప్రతి రాత్రీ నాకు కథలు ఎవరు చెబుతారు?" అని ప్రశ్నించాడు చక్రవర్తి.

"అది పెద్ద సమస్య కాదు ప్రభూ! మీ దర్బారులో ఉన్న సభాసదులందరినీ రోజుకొకరి చొప్పున కథలు చెప్పమనండి" అని సూచించాడు హకీం.

ఈ సూచన ఆమోదించబడింది. రోజుకొకరు చొప్పున వచ్చి చక్రవర్తికి కథలు వినిపించసాగారు. అయితే చక్రవర్తి ప్రతిసారీ "ఆ తర్వాత....?" అంటూ పదే పదే ప్రశ్నిస్తున్నాడు. ఇది కథలు చెప్పే వారికి ఇబ్బందిగా పరిణమించింది. చక్రవర్తి ఈ అలవాటును తట్టుకోలేక తరుణోపాయం సూచించమని బీర్బల్‌ను ఆశ్రయించారు. బీర్బల్ భయపడాల్సిందేమీ లేదని చెప్పి ఆ రాత్రి కథలు చెప్పడానికి స్వయంగా తానే వెళ్ళాడు.

అక్బర్, బీర్బల్‌ని సంతోషంగా ఆహ్వానించాడు. బీర్బల్ కథ మొదలు పెట్టాడు. ప్రతిసారీ చక్రవర్తి "ఆ తర్వాత...?" అంటూ అడ్డుతగులుతూనే ఉన్నాడు. బీర్బల్ ఎన్ని కథలు చెప్పినా అక్బర్ మాత్రం "ఆ తర్వాత....?" అంటూనే ఉన్నాడు.

అక్బర్‌కు ఉన్న ఈ అలవాటుని ఎలాగైనా మాన్పించాలనే ఉద్దేశంతో బీర్బల్ మరో కథ మొదలు పెట్టాడు. "అడవిలో ఒక గుడిసె ఉంది. ఆ గుడిసెలో ఒక వేటగాడు నివసిస్తుండేవాడు. ఆ అడవిలో అనేక వన్యమృగాలు, పక్షులు ఉండేవి. వేటగాడికి అడవి జంతువులనుండి తనను తాను రక్షించుకోవడం తెలుసు. కానీ పక్షుల బాధ అతను పడలేకపోతున్నాడు. అవి అతని గుడిసెలోకి ప్రవేశించి అతను దాచుకున్న ధాన్యాన్ని ముక్కులతో పట్టుకుపోతుండేవి.

"ఆ తర్వాత ఏమైంది?" ప్రశ్నించాడు అక్బర్.

"ఆ వేటగాడు ఆలోచించి సంతకు వెళ్ళి పెద్దబుట్ట కొని తెచ్చాడు. అందులో ధాన్యం పోసి మూత గట్టిగా పెట్టాడు.

"ఆ తర్వాత ఏమైంది?" చక్రవర్తి ప్రశ్నించాడు.

"రోజులాగానే పక్షులు వచ్చాయి. వాటికి ధాన్యం దొరకలేదు. అయితే ధాన్యం బుట్టలో ఉందని అవి కనిపెట్టాయి ముక్కులతో పొడిచాయి. ఫలితం లేదు"

"ఆ తర్వాత...?" ప్రశ్నించాడు అక్బర్.

"ఆ పక్షుల్లోవున్న ఒక చిన్నపిచ్చుక చాలా తెలివైనది. దానికి ఒక ఎలుక మిత్రుడు ఉన్నాడు. అది ఆ మిత్రుడి సహాయం కోరింది. ఎలుక ఆ బుట్టను కొరికి రంధ్రం చేసింది."

"ఆ తర్వాత.....?" అక్బర్ ప్రశ్న.

"ఈ విషయం తెలిసి పెద్ద సంఖ్యలో పక్షులన్నీ ఆ గుడిసె బయట గుమికూడాయి. మహారాజా! వాటి సంఖ్య ఎంతో మీకు తెలుసా?" మధ్యలో ప్రశ్నించాడు బీర్బల్.

"ఎంత?" ఎదురు ప్రశ్నించాడు అక్బర్.

"ఐదు వందలకు పైగా ఉన్నాయి" చెప్పాడు బీర్బల్.

"ఐదు వందలా! ఆ తర్వాత...?" అడిగాడు అక్బర్.

"ఒక పక్షి గుడిసెలోకి వెళ్ళి దాని ముక్కుతో ధాన్యాన్ని కరచుకొని ఎగిరి పోయింది."

"ఆ తర్వాత....?"

"రెండవ పక్షి లోపలికి వెళ్ళి ధాన్యాన్ని కరచుకొని ఎగిరిపోయింది."

"ఆ తర్వాత....?"

"నాల్గవ పక్షి లోపలికి వెళ్ళి ధాన్యాన్ని కరచుకొని ఎగిరిపోయింది."

"ఆ తర్వాత....?"

"ఐదవ పక్షి లోపలికి వెళ్ళి ధాన్యాన్ని కరచుకొని ఎగిరిపోయింది."

"ఏమిటి బీర్బల్? ఇంకా ఎన్ని పక్షులు మిగిలి ఉన్నాయి?" అసహనంగా ప్రశ్నించాడు అక్బర్ చక్రవర్తి

"మహారాజా! ఇప్పటి వరకు ఐదు పక్షులే ఎగిరివెళ్ళాయి. ఇంకా నాలుగు వందల తొంభై అయిదు పక్షులు మిగిలే ఉన్నాయి" అని చెప్పి "ఆఁ..... తర్వాత ఆరవ పక్షి గుడిసెలోకి వెళ్ళి...." అని చెప్పబోయాడు బీర్బల్.

చక్రవర్తికి కోపం వచ్చింది. "ఆ పక్షులు ధాన్యం తీసుకుపోవడం ఎప్పుడు అవుతుంది?" అని ప్రశ్నించాడు అసహనంగా.

"ఆ తర్వాత.... అని మీరు ప్రశ్నించడం ఆపినప్పుడు మహారాజా!" అని చల్లగా బదులిచ్చాడు బీర్బల్

చక్రవర్తికి తన తప్పేమిటో తెలిసి వచ్చింది. కథలు చెప్పించుకునే కార్యక్రమాన్ని రద్దుచేశాడు. ఈలోపు ఆయన ఆరోగ్యం కూడా కుదుట పడింది.

## 8. దంతిలుడి కథ

పూర్వం వర్ధమానం అని పెద్ద నగరం ఉండేది. ఆ నగరంలో దంతిలుడనే వర్తకశ్రేష్ఠుడు మహా ధనసంపన్నుడు. రాజానుగ్రహంచేత నగరపాలన యావత్తూ అతడి అధీనంలో ఉండేది. సామాన్యులు, రాజు.... ఉభయులూ అతని పాలనాదక్షత ఫలితంగా ఏ చీకూచింతా లేకుండా సుఖశాంతులతో ఉన్నారు. అటు రాజుని, ఇటు ప్రజల్ని సమానంగా సంతోషపర్చగలిగిన అంతటి ధీమంతుణ్ణి, సమర్థుణ్ణి కనీవినీ ఎరుగమంటారు సమకాలికులు.

"రాజు శ్రేయస్సును కాంక్షించేవాడంటే... ప్రజాసామాన్యం రుసరుస... ప్రజాక్షేమాన్ని కోరేవాడంటే... రాజు బుసబుస..."

ఇలాంటి విరుద్ధ పరిస్థితులలో సైతం రాజు, ప్రజలుభయుల హృదయాలను గెలుచుకున్న దంతిలుడులాంటి వ్యక్తి ఇంతవరకూ లేడు. దంతిలునికొక కుమార్తె. ఆమెకి యుక్తవయస్సు రాగానే అతడు భూదేవి అంత అరుగు, ఆకాశమంత పందిరి వేసి వర్ణించలేనంత ఘనంగా పెండ్లి జరిపించాడు. పెండ్లికి నగర పౌరులు, రాజోద్యోగులు యావన్మందిని ఆహ్వానించాడు. కమ్మని భోజనం పెట్టాడు. విలువైన బట్టలు పెట్టాడు, కానుకలిచ్చాడు. అతిథులతని సత్కారాలకు పొంగిపోయారు. రాజు, పట్టమహిషి, దర్బారులోని ముఖ్యులు యావన్మంది దంతిలుడి గృహాన్ని పావనం చేశారు. అతడు అన్ని మర్యాదలు జరిపాడు. సంపూర్ణంగా సంతుష్టులను చేశాడు.

రాజు పరివారంతోపాటు గోరంభుడు అనే రాజభృత్యుడు కూడా ఆ వివాహ మహోత్సవానికి వచ్చాడు. అతడు రాజమందిరాన్ని రోజూ ఊడ్చి శుభ్రం చేస్తాడు. పిలవని పేరంటానికి వచ్చిన గోరంభుడు వేరే పెద్ద కోసం ఏర్పాటు చేసిన ఆసనం మీద కూర్చున్నాడు. దంతిలుడది చూచి అతడిని మెడబట్టి బయటకు గెంటించాడు. గోరంభుని మనస్సు కుతకుత ఉడికిపోయింది. ఆ రాత్రి అతనికి కంటిమీద కునుకు లేదు. దంతిలుడిమీద ఎలా ప్రతీకారం

తీర్చుకోవాలా అని ఆలోచించాడు. రాజుముందు అతని పరువు తీసే ఉపాయమేదైనా ఉందా అని బుర్ర బద్దలు కొట్టుకున్నాడు. "నేనెక్కడ? దంతిలుడెక్కడ? నక్కకు, నాగలోకానికి సామ్యమెక్కడ? అంతటి అత్యున్నత స్థానంలో ఉన్నవాడిని ఈ అధమాధముడేమి చేయగలుగుతాడు?" అని నిరాశపడిపోయాడు, మనసంతా విచారంతో నిండిపోయింది.

చాలాకాలం తరువాత ఒకరోజు ఉదయం భూపతి ఇంకా పూర్తిగా నిద్ర మేల్కొనకముందే గోరంభుడు రాజు శయనమందిరం ఊడవసాగాడు. మంచం కింద శుభ్రం చేస్తూ, 'హవ్వ! దంతిలుడెంత బరితెగించాడు? రాణి గార్ని కావలించుకోటానికి వాడికెన్ని గుండెలు?" అని గోరంభుడు గొణిగాడు.

రాజు దిగ్గున మంచం దిగి, "ఏమన్నావ్? దంతిలుడు అంత పని చేశాడా? నిజం చెప్పరా!" అనరిచాడు.

"దేవరా, మన్నించాలి. రాత్రంతా జూదమాడుతూ నిద్రపోలేదు. మగతగా ఉండి నేనేం మాట్లాడుతున్నానో నాకే తెలవదు. క్షమించండి, దేవరా!" అని తెలివిగా జవాబు చెప్పాడు.

రాజుగారి మనస్సులో అనుమాన బీజం పడింది. మొలకెత్తి, మహావృక్షం కావటమే తరువాయి! "గోరంభుడు అంతఃపురమంతా నిరాటంకంగా తిరుగుతూ ఉంటాడు. దంతిలుడు కూడా అంతఃపురానికి స్వేచ్ఛగా, నిరభ్యంతరంగా వస్తూ పోతూ ఉంటాడు. వాడు రాణిని వాటేసుకుని ఉండగా గోరంభుని కంట పడివుండవచ్చు. అందుకే వాడట్లా గొణిగివుండాలి." అని మనస్సులో కుళ్ళిపోయాడు.

ఆ తరువాత దంతిలుడిని దూరంగా ఉంచాడు. పదవి ఊడబెరికాడు. ఆదరించినవాడే ఆగ్రహించాడు. అంతఃపురం ప్రవేశించరాదని ఆంక్షలు విధించాడు. భూపతి వైఖరి హఠాత్తుగా వచ్చిన ఈ మార్పు దంతిలుడిని దిగ్భ్రాంతపర్చింది. మనస్సులో ఇలా తలపోశాడు :

"ఎవరైనా విన్నారా, ఎక్కడైనా కన్నారా

తెల్లని కాకుల్ని

నీతి తప్పని జూదరిని

పగబట్టని పాముని

తాగుబోతులో నిగ్రహాన్ని

రాజుల చెలిమిని!...

కలలో సైతం ఎవ్వరికీ హాని చేసి ఎరుగనే? రాజుకుగాని, రాజకుటుంబంలోని వారెవరికిగాని అపకారం తలపెట్టి ఎరుగనే? రాజుకు నా మీద ఎందుకీ కక్ష?"

దంతిలుడు విచారభారంతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. కొన్ని రోజులు గడిచాక ఒకనాడు దంతిలుడు రాజప్రాసాదానికి వెళ్ళాలని రాగా ద్వారపాలకులు అతడిని అనుమతించలేదు. గోరంభుడది దూరం నుంచి చూసి, "ఓ ద్వారపాలకులూ, అతడెవరనుకున్నారు? రాజుకు ప్రియతముడు. అతడు తల్చుకుంటే ఎవర్నయినా కారాగృహంలో

తోయించగలడు, లేదా విడుదల చేయించగలడు. నన్ను మెడబెట్టి గెంటించాడు. కాబట్టి ఒళ్ళు దగ్గరపెట్టుకోండి. మీకూ నాకు పట్టిన గతే పడుతుంది" అన్నాడు వెటకారంగా.

దంతిలుడు ఆ మాట వినగానే తన దుర్దశకు కారణభూతుడెవరో అర్థమైపోయింది. రాజుగారి సేవకుడు తెలివితక్కువవాడైనా, గుణహీనుడైనా అతడు వెళ్ళినచోటల్లా మన్నన పొందుతాడు. ఇలా ఆలోచిస్తూ అతడు ఇల్లు చేరాడు. నిరాశ ఆవరించింది. చేసిన పొరపాటును సరిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఒకరోజు సాయంకాలం దంతిలుడు రాజభృత్యుడు గోరంభుని తన ఇంటికి సగౌరవంగా ఆహ్వానించాడు. మర్యాద చేశాడు. కొత్త బట్టలు పెట్టాడు.

"మిత్రమా! ఆనాడు నిన్ను బయటకు గెంటించానంటే నీ మీద కోపంతో కాదు. నువ్వారోజు ఆక్రమించిన ఆసనాన్ని ఒక బ్రాహ్మణశ్రేష్ఠుని కోసం ఏర్పాటుచేసి ఉంచాను. తనకేర్పాటు చేసిన స్థానంలో నిన్ను చూసిన ఆ బ్రాహ్మణుడు అవమానం జరిగినట్లుగా భావించడంతో నిన్ను బయటకు పంపించాల్సి వచ్చింది. గోరంభా, నన్ను క్షమించు!" అన్నాడు దంతిలుడు.

గోరంభుడు కరిగిపోయాడు. తనకు పెట్టిన బట్టలు చూసుకొని తన్మయుడు అయ్యాడు. "అయ్యా, మిమ్మల్ని క్షమిస్తున్నాను. మీరు విచారం వెలిబుచ్చారు. పైగా నాకు మర్యాదలు జరిపారు. మీకు ఉపకారం చేస్తాను. మళ్ళీ మీరు రాజానుగ్రహం పొందుతారు. ఆ విధంగా నా తెలివిని రుజువు చేసి చూపిస్తా" అన్నాడు గోరంభుడు. అతడు అల్పసంతోషి.

మరుసటి రోజు ఉదయం యథావిధిగా రాజగారి శయనమందిరం శుభ్రం చేస్తున్నాడు. రాజు నిద్రనుంచి సగం మేలుకున్నట్టుగా రూఢిచేసుకుని ఓ వాగ్బాణం వదిలాడు... "రాజుకు బుద్ధి లేదు. ఉంటే, దొడ్డికి పోయి దోసకాయ తింటాడా?" అన్నాడు.

రాజు ఉలిక్కిపడ్డాడు. కోపం కట్టలు తెంచుకుంది.

"ఒరేయ్! ఏం కూశావురా? నువ్వు మా సేవకుడవు కాబట్టి బ్రతికిపోయావు! కాకపోతే నిన్ను నరికి పోగులు పెట్టేవారం. అలాంటిది చేస్తుండటం నువ్వేనాడైనా చూసిచచ్చావా?" అని కేకలు వేశాడు.

"దేవరా! నన్ను క్షమించు. రాత్రంతా జూదం ఆడాను. నిద్ర ముంచుకొస్తున్నది. మగతలో ఏం మాట్లాడుతున్నానో నాకే తెలవదు. తప్పుడు మాట మాట్లాడివుంటే ఈ దాసుడిని క్షమించు. దేవరా!" అని వేడుకున్నాడు. అంతా నాటకం అని తనకు తెలుసు. రాజుకు తెలవదు.

గోరంభుడి మాటలు నమ్మి దంతిలుడిని పరాభవించిన సంగతి రాజు గుర్తుచేసుకున్నాడు. దంతిలుడి నిష్క్రమణతో నగరపాలన వ్యవస్థ ఎలా భ్రష్టుపట్టిందో ప్రత్యక్షంగా కనిపిస్తూనే ఉంది. రాజు చాలా పశ్చాత్తాపపడ్డాడు. వెంటనే రాజు దంతిలుడిని రప్పించి వజ్రవైఢూర్యాలు, చీనిచీనాంబరాలు వగైరా కానుకలతో సత్కరించి, పూర్వపు పదవిలో పునర్నియమించాడు.

## 9. ఆషాఢభూతి కథ

ఒకానొకప్పుడు ఒంటరిగా ఉన్న ఒక మఠంలో దేవశర్మ అనే సన్యాసి ఉండేవాడు. చుట్టుపక్కనుంచి, దూరదూరాల నుంచి అనేకమంది గృహస్థులు ఆయనను దర్శించేవాళ్ళు. అతడు చెప్పే వేదాంతార్థం విని తరించిపోయినట్లుగా పరవశించి కానుకలు సమర్పించుకొని తిరిగి వెళ్ళిపోయేవాళ్ళు. పైకి కోరికలు సమస్తం పరిత్యజించినవానిలా కనపడ్డా లోలోపల లోభం, లాభాపేక్ష అతనిలో చావలేదు. చిత్తమెల్ల విత్తంపై కాంక్షతో నిండిపోయివుంది. కానుకలపై అనాదర సూచకంగా మొహం పెట్టి, విరాగి తరహా చిరునవ్వు నవ్వి, భక్తులను అనుగ్రహించడానికే తాను కానుకల్ని అంగీకరిస్తున్నట్టుగా నటించేవాడు. కానుకల రూపేణా కురిసిన ధనం ఓ బొంతలో పదిలపర్చి దానిని కప్పుకొని తిరుగుతుండేవాడు.

అషాఢభూతి అనే మాయగాడు సన్యాసి లోగుట్టు ఎరిగి ఎలా వలపన్నాలా అని కాచుక్కూచున్నాడు. ఒకనాడు సన్యాసి వేదాంతబోధ చేస్తుండగా, ఆషాఢభూతి సాష్టాంగప్రమాణం చేసి, లేచి చేతులు జోడించి, ఒకపక్క నిలబడ్డాడు. తాను సన్యాసి దృష్టిని ఆకర్షించినట్లుగా రూఢిపర్చుకున్న ఆషాఢభూతి గురువాక్యాన్ని గుండెపెట్టి ఆలకిస్తున్నవానిలా కన్పించాడు. మౌని వచోధారలో తడుస్తూ తరించిపోతున్నట్లుగా గోచరింపజేసుకున్నాడు. బహుకాలంగా తనని విడువని ధర్మసంశయాలు ఆనాటి రుషి ప్రసంగంతో దూదిపింజల్లా ఎగిరిపోతున్నట్లుగా సూచించే ముఖ భావాలు ప్రదర్శించాడు. అలతి అంతరాయాన్ని సైతం సహించలేనివానిలా భ్రుకుటి ముడిచాడు. చేతి సైగలతో వారించాడు. కట్టకడపట, స్వామి వేదాంత శ్రవణంతో అవధులెరుగని ఆనందం వరదెత్తి కళ్ళలో నీళ్ళు నిలిచాయి. బోధ ముగిసిన తరువాత, అక్కడ మూగిన జనాన్ని ఉద్దేశించి, "స్వాములు కడు బడలి ఉన్నారు. కాస్సేపు అవతలికి పొంది. భిక్ష తరువాత వద్దురుగాని" అని చొరవ తీసుకుని అందర్నీ అవతలికి పంపేశాడు. తానుమాత్రం తాటాకు విసనకర్ర పుచ్చుకుని సన్యాసి పక్కన నిలబడి మెల్లగా విసరసాగాడు.

సన్యాసి అతనివంక సాదరంగా చూస్తూ, "నాయనా! ఎవరు నీవు? మాకు సేవలు చేస్తున్నావు. మా వలన నీవు ఏ ప్రయోజనం ఆశిస్తున్నావు?" అనడిగాడు.

"స్వామీ, నేను ఆషాఢభూతిని. తమరు జ్ఞానసంపన్నులు. తమవద్ద గుప్తంగా, అనన్యసాధ్యంగా గల అర్థాన్ని తమకు శుశ్రూష చేసి గ్రహించాలని నా కోరిక నన్ననుగ్రహించండి."

అర్థమనగా వేదార్థం కావచ్చు. ధనమూ కావచ్చు. ద్వంద్వార్థాలతో కూడిన ఆషాఢభూతి మాటల మర్మం సన్యాసికి బోధపడలేదు. చిన్నతనంలోనే ఇతగాడు సన్యసించడానికి సిద్ధమయ్యాడే అని అబ్బురపడ్డాడే గాని సన్యాసికి ఆషాఢభూతి మీద అనుమానం కలగలేదు.

"రుషుల విషయంలో మొదట మనస్సు ముసలిదైపోతుంది. శరీరం యవ్వనంతో నవనవలాడుతూ ఉంటుంది. దుష్టులకు శరీరం ముసలిదైపోతుంది. బుర్ర బిర్రుగా ఉంటుంది" అన్నాడు సన్యాసి.

ఆషాఢభూతి సన్యాసిముందు సాగిలపడ్డాడు. పాదాభివందనం చేశాడు. "స్వామీ! తత్త్వరహస్యాలను ఈ అజ్ఞానిని తెలుసుకోనివ్వండి. తమ శుశ్రూషలో ఈ శిష్యుడి జీవితం ధన్యం కానివ్వండి."

"బిడ్డా, అలాగే కానివ్వు. కానీ ఒక్క షరతు. రాత్రివేళ నీవు మందిరంలో ఉండే వీలు లేదు. విరాగులైన సాధువులు రాత్రులందు ఒంటరిగా ఉండాల్సిన నియమం ఉన్నది. మన ఇరువురమూ అది పాటించక తప్పదు.

రాజు తన సచివునివల్ల, సన్యాసి తన సన్నిధిలోని వారివల్ల, తనయుడు అతిగారాబం వల్ల బ్రాహ్మణుడు శాస్త్రాధ్యయనరాహిత్యం వల్ల, వ్యాపారమూ వ్యవసాయమూ నిర్లక్ష్యంవల్ల, మనిషి గుణశీలాలు దుర్జనసాంగత్యం వల్ల నాశనం కావటం తథ్యం" అన్నాడు సన్యాసి.

"చిత్తం, స్వామీ! మీ అభీష్టానుసారం నడుచుకుంటాను" అన్నాడు ఆషాఢభూతి. సన్యాసి శాస్త్రసంప్రదాయానుగుణంగా క్రతువు పూర్తిచేసి ఆషాఢభూతిని శిష్యుడిగా చేర్చుకున్నాడు. ఆషాఢభూతి రోజూ గురువు చేతులు, పాదాలు ఒత్తుతూ, మర్దన చేస్తూ అవసరమైన ఇతర సేవలన్నీ చేస్తూ దేవశర్మను బహుధా ఆనందింపజేశాడు. కానీ సన్యాసి ఆషాఢభూతిని తన బొంత ముట్టుకోనివ్వలేదు.

"గురువుకు నా మీద ఇంకా నమ్మకం కలగలేదు. పట్టపగలు వీడి పొట్ట చీల్తునా, విషప్రయోగం చేద్దునా, క్రూరజంతువును చంపినట్లుగా వీడిని అంతం చేద్దునా?" అని ఆషాఢభూతి ఆలోచించసాగాడు.

అదే సమయంలో దేవశర్మ భక్తుల్లో ఒకని కుమారుడు పక్క ఊరునుంచి వచ్చి సన్యాసిని సమీపించి నమస్కారంచేసి, "స్వామీ! మా ఇంట్లో ఈ దినం ఉపనయన కార్యక్రమానికి తమరిని ఆహ్వానించడానికి వచ్చాను. తమరు తప్పక మా గృహాన్ని పావనం చెయ్యాలి" అన్నాడు.

సన్యాసి అతని ఆహ్వానాన్ని మన్నించి ఆషాఢభూతిని వెంటబెట్టుకుని ప్రయాణమయ్యాడు కొంతదూరం నడిచి నది ఒడ్డుకు చేరారు ఇద్దరూ. సన్యాసి తన బొంతని జాగ్రత్తగా మడిచిపెట్టి "శిష్యా! ఏమాత్రం ఏమరక ఈ బొంతను కనిపెట్టుకుని ఉండు"మని అనుష్ఠానాలు తీర్చుకుందుకు నీళ్ళలో దిగాడు. అదే సమయంలో ఒడ్డుకు దగ్గర్లో పోతరించిన రెండు పొట్టేళ్ళు భీకరంగా ఢీకొన్నాయి. నెత్తురు ధారకట్టినా అవి పోరు ఆపలేదు. అంతలో ఒక నక్క మాంసం మీద ఆవతో అది యుద్ధమని కూడా ఆలోచింపకుండా వాటి మధ్యకు పరుగు పరుగున వచ్చింది. ఒకదానినొకటి ఢీకొనడానికి ముందు, రెండూ వెనుకకు జరిగి మహారోషావేశాలతో మళ్ళీ తలపడే సమయంలో మధ్యలో దూరింది నక్క, పొట్టేళ్ళ తలల తాకిడికి నక్క నుజ్జునుజ్జయిపోయింది. సన్యాసి ఆ దృశ్యాన్ని చూసి, "అయ్యో, లోభంతో కదా నక్క దుర్మరణం తెచ్చుకుంది! లోభమంతటి దుర్గుణం మరొకటి ఉందా?" అని ఆలోచించాడు.

ఆచమనాదులు పూర్తయి సన్యాసి ఒడ్డెక్కి శిష్యుని కోసం చూశాడు. జాడ లేదు. బొంత నేలమీద పారేసి ఉంది. "ఓయి, ఆషాఢభూతీ! ఆషాఢభూతీ!" అని బిగ్గరగా కేకలు పెట్టాడు. కనుచూపుమేర పారజూచాడు. వచ్చేపోయే జనాన్ని ఆపి ఆషాఢభూతి గుర్తులు చెప్పి వారెవరైనా చూచారా అని ఆరాతీశాడు. వెదకి వెదకి వేసారిపోయి, వేషగాని చేతిలో మోసపోతినే అని మొత్తుకుంటూ, "ఆషాఢభూతిచేత నేను, పొట్టేళ్ళ పోరులో నక్క నాశనమైపోయాం. స్వయం కృతమేగాని వేరు కాదు" అని పశ్చాత్తాపంతో సన్యాసి కుంగిపోయాడు.

## 10. పేను - నల్లి - కథ

"అదొక అందమైన రాజమందిరం. అందు రాజు శయనాగారం ఇంకా సుందరంగా ఉంది. రాజు పవ్వళించే హంసతూలికా తల్పం వర్ణనాతీతం. శయ్యమీద పాలనురుగులాంటి తెల్లటి మెత్తటి పట్టు వస్త్రం పరచివుంది. ఆ బట్టమడతల నడుమ మందవిసర్పిణి అనే పేను దాగి ఉండేది. రాజు గాఢనిద్రలో ఉన్నప్పుడు ఆయన రక్తం కడుపార తాగి గంపెడు సంతానాన్ని కని సుఖంగా కాలక్షేపం చేస్తుండేది. ఒకనాడు డిండిమం అనే నల్లి రాజు శయనాగారంలోకి చొరబడింది. అది చూచి మందవిసర్పిణి అగ్గిమీద గుగ్గిలం అయ్యింది.

"నల్లీ! నీ విక్కడేం చేస్తున్నావు? రాకూడని చోటికొచ్చావు. మారు మాటడక వచ్చిన దోవనే తక్షణం వెళ్ళిపో" అనరిచింది పేను.

"అక్కా! అతిథిగా వచ్చిన నన్ను అలా కసరుకోవటం భావ్యమా? బ్రాహ్మణుడు భక్తితో అగ్నికి అర్ఘ్యమిస్తాడు. భార్య భర్తకు పూజలు చేస్తుంది. గృహస్థులు అతిథిని దేవుడుగా భావించి సత్కారాలు చేస్తారు. అతిథి దేవోభవ! అని సూక్తి" అని నల్లి అనగానే పేను చల్లబడింది.

"అక్కా, నేను అనేక రకాల రక్తం రుచి చూశాను. బ్రాహ్మణ పండితులు, క్షత్రియ వీరులు, వర్తక ప్రముఖులు, యజమానులు, సేవకులు – అందరి రక్తం తాగాను. ఉప్పగా, చప్పగా, అరుచికరంగా ఉండి నాకు అసంతృప్తి మిగిలింది. రాజ రుధిరం గ్రోలే భాగ్యం నాకింత వరకు కలగలేదు. రాజుగారి రక్తం బహురుచిగా ఉండి ఉండాలి. ఎందుకంటే రాజు పంచభక్ష్య పరమాన్నాలు భుజిస్తాడు. అమృతోపమానమైన పానీయాలు, నానా ఫల ఆసవాలు సేవిస్తాడు. రాజవైద్యులు నిరంతరం ఆయన ఆరోగ్యం కనిపెట్టి అప్రమత్తంగా ఉంటారు. అలాంటి రాజు రక్తం మహామధురంగా ఆస్వాదింపదగిందిగా ఉంటుందని విన్నాను. ఈశయ్య మీద నక్కి ఉండటానికి నీవు నన్ననుగ్రహిస్తే నా కోరికా తీరుతుంది" అని వేడుకుంది డిండిమం.

"నల్లీ, రాజు గాఢ నిద్రలో ఉన్నప్పుడే నేనాయన రక్తం పీలుస్తాను. నీ సంగతి వేరు. నువ్వు కుట్టావంటే పదునైన సూది మొనతో పొడిచినట్లుగా ఉంటుందాయె! రాజు పూర్తి నిద్రామైకంలో కూరుకుపోయేదాకా నువ్వు ఆగాలి. ఆ తరవాత నెమ్మదిగా రాజుగారి రక్తం తాగాలి. అర్థమైందా?" అంది మందవిసర్పిణి.

"అక్కా నువ్వు చెప్పినట్లే నడుచుకుంటాను. నీవు సుష్టుగా తాగి సంతుష్టురాలివి అయ్యాకనే, నేను నా పనికి ఉపక్రమిస్తాను" అంది నల్లి.

వారిద్దరూ గుసగుసలాడుకొంటూ ఉండగా రాజు తన శయనాగారంలో ప్రవేశించాడు. మెత్తటి పాన్పు మీద మేనువాల్చాడు. రాజు రక్తం ఎప్పుడు తాగుదునా అని నల్లి లొట్టలు వేస్తున్నది. మనస్సు నిలువనీయడంలేదు. క్షణమొక యుగంలా తోచింది. రాజుకు అప్పుడే నిద్ర పడుతుండగా నల్లి, రాజు వీపుమీద కసిక్కిన కొరికింది. రాజు ఉలిక్కిపడి లేచాడు. తేలు కుట్టినట్టయింది. ఆగ్రహంతో రాజు తన సేవకుల్ని కేకేశాడు.

"ఏదో పురుగు కుట్టింది. పక్కంతా వెతికి దాన్ని పట్టుకుని నలిపెయ్యండి" అని రాజు ఆజ్ఞాపించాడు. నల్లి ఆ మాటలు విని ఎవరికీ కానరాని మూలన నక్కింది.

పరిచారకులు శయ్య నలువంకల కలయ వెతకసాగారు. పక్క దుప్పటి మడతల్లో నలుసులాగా కరచుకొని దాగున్న చీర పేను కర్మకాలి వారి కంటపడింది. వారు కసిగా దానిని నలిపి చంపేశారు. నేరం నల్లిదే అయినా మరణం పేనికి ప్రాప్తించింది. కాబట్టి స్వరూప మెరుగక పరునికి ఆశ్రయమిస్తే అవశ్యం హాని కలుగుతుంది" అని దమనకుడు కథ ముగించాడు.

## 11. దిలీపుని కథ

దిలీపుడు ఇక్ష్వాకు వంశంలో జన్మించిన గొప్పరాజు ఇతని భార్య పేరు సుదక్షిణాదేవి. అత్యంత పరాక్రమవంతుడైన దిలీపుడు దేవేంద్రునకు కూడా సహాయపడేవాడు. ఒకసారి ఇంద్రలోకము నుండి వస్తూ దేవతావృక్షము కింది విశ్రమించియున్న కామధేనువు గమనించలేదు. అందుచేత దానిని పూజించక తిరిగివచ్చెను. దానితో కామధేనువు అతనికి సంతానం లేకుండునట్లు శపించింది. ఈ విషయం దిలీపునికి తెలియదు. తనకు ఎన్నటికీ సంతానం కలుగకపోవుటచేత తన కులగురువైన శిష్యుని చేరి తన బాధను విన్నవించుకొనెను. వశిష్ఠుడు దిలీపుని పరిస్థితికి బాధపడి దివ్యదృష్టితో కామధేనువు ఇచ్చిన శాపమును తెలుసుకొని అతనికి తెలిపెను. ఐతే, ప్రస్తుతం కామధేనువు పాతాళలోకములో ఉండుటచేత దానిని పూజించుట సాధ్యము కాదని చెప్పి, దాని పుత్రిక అయిన నందినీ ధేనువు తన ఆశ్రమంలో నున్నదని, దానిని నలుబది దినములు భక్తిశ్రద్ధలతో కొలువసాగిరి. ఒకసారి నందినీ ధేనువు హిమవత్పర్వత ప్రాంతమునకు పోయిమేస్తూ ఒక గుహలో ప్రవేశించింది. కొంతసేపటికి గుహలో నుంచి నందిని యొక్క అంబా అనే అరుపు వినిపించింది.

ఆ పిలుపుకి త్రుళ్ళిపడి దిలీపుడు గుహలో ప్రవేశించాడు. అక్కడ నందినిపై ఒక సింహము పడి చంపబోవుచున్న దృశ్యము కనబడింది. దిలీపుడు ఆ పులిని చంపడానికి బాణము తీయబోయాడు. కానీ, దిలీపుడు కదలలేక స్తంభించిపోయాడు. సింహము మనుష్యభాషణలో "ఓ రాజా! ఇక్కడ గల దేవదారు వృక్షాలను సంరక్షించుటకై శివపార్వతులచే నియమించబడిన సేవకుడను. నా పేరు కుంభోదరుడు. ఈ వృక్షాలను ఏ జంతువు తాకినా వాటిని చంపి భక్షించమని శివుని ఆజ్ఞ. కాబట్టి ఈ ధేనువు నాకు భగవంతుడు ప్రసాదించిన ఆహారము. నువ్వేమీ చెయ్యజాలవు" అంటూ చెప్పింది.

దానికి దిలీపుడు "ఓ సింహరాజమా! ఇది కామధేనువు యొక్క పుత్రిక. పైగా, నా కులగురువు యొక్క ధేనువు. దానిని విడిచిపెట్టు. నీకు దీనికి బదులుగా ఆహారంగా ఏమి కావాలన్నా ఇచ్చెదనని పలికెను. దానికి సింహము సమ్మతించలేదు. ఐనా, దిలీపుడు "నా అజాగ్రత్తవలననే ఈ ధేనువు ఇచ్చటకు సమీపించింది. కాబట్టి నా శరీరాన్ని భక్షించి ఈ ధేనువును విడిచిపెట్టు" అంటూ అనేక విధాలుగా ప్రార్థించాడు. దానికి సింహము సమ్మతించి ధేనువును విడిచిపెట్టింది. వెంటనే దిలీపుడు తన శరీరాన్ని సింహానికి సమర్పించడానికి బోర్లా సింహము ముందుపడ్డాడు. వెంటనే సింహము సంతోషించి కామధేనువుగా ప్రత్యక్షమయింది. "దిలీపమహారాజా! నీవు గావించి గోపూజ – గోసేవ ప్రశంసించదగినది. నాకు బదులుగా నా పుత్రికను భక్తితో పూజించావు. దానికి నేను మెచ్చుకున్నాను. నా పుత్రిక యొక్క క్షీరమును ప్రసాదముగా స్వీకరించు. దానివలన నీవు ఉత్తమ సంతానం కలుగుతుంది" అని చెప్పి అదృశ్యమయింది.

దిలీపుడు ఆనందంగా ఆశ్రమం చేరుకొని గురువుకి, తన భార్యకు సంగతినంతా విశదీకరించారు. దిలీపువు గురువు ప్రసాదించిన నందినీ ధేనువు క్షీరముగా త్రాగి రాజ్యానికి చేరుకున్నాడు. కొంతకాలానికి వారికి నందినీ ధేనువు అనుగ్రహంతో పుత్రుడు జన్మించాడు. అతనే రఘుమహారాజు. అతని పేరుతోనే తరువాత కాలంలో సూర్యవంశానికి రఘువంశమనే పేరు వచ్చింది.

## 12. జూ కుక్...

ఆమె సంసారం గంపెడంత. కాదు... కాదు... అక్షరాలా అడివంత! ఒకరా... ఇద్దరా... ఎనిమిదివందల మంది పిల్లలు. ప్రతి రోజూ లక్షా తొంభై రకాల వంటలు చేసిపెట్టాలి. ఏ పూటయినా రుచికాస్త తప్పిందనుకోండి. కుర్రనాగన్నలంతా కంచాలు విసిరి కొడతారు. భోజనం చేయకుండా కూర్చుంటారు. ఆ తల్లి పేరు సూర్యకాంతం. వైజాగ్ ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో వంటలక్క. రెండు దశాబ్దాలుగా వన్యప్రాణుల ఆకలెరిగి అన్నం పెడుతున్న అన్నపూర్ణ. మూగజీవాలను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆ మాతృమూర్తి పరిచయం ఆమె మాటల్లోనే... "నాపేరు వెలమ సూర్యకాంతం. మాది విజయనగరం జిల్లా గరివిడి. తల్లిదండ్రులు కాంతారావు, బంగారమ్మ. మా అయ్య ఇక్కడే, జూలో కూలి పనిచేసేవాడు. సుస్తీ చేసి చనిపోయాడు. క్యాజువల్ లేబర్‌గా ఇదే జూలో నాకు ఉద్యోగమిచ్చారు. ఇదంతా ఇరవైయేళ్ళ కిందటి మాట. మొదట్లో స్వీపర్‌గా ఎన్‌క్లోజర్లు శుభ్రం చేసేదాన్ని. తొలినుంచీ మూగజీవాలంటే పంచప్రాణాలు. జూ యానిమల్స్ సేవకు గతంలో ప్రత్యేకంగా ఒకామె ఉండేవారు. ఆమె రిటైరయ్యాక ఈ బాధ్యత నాకప్పగించారు. పదిహేనేళ్ళుగా ప్రతీరోజూ రెండు పూటలా జంతువులకు వండి వారుస్తున్నాను.

***తేడా వస్తే***

మృగాలే కదా ఎలాగో ఒకలా వండిపడేయొచ్చులే... అనుకుంటే పప్పులో కాలేసినట్టే. వేలమంది మనుషులకు సులువుగా వంట చేసిపెట్టొచ్చు. కాని పుంజీడు పిట్టలకి ముద్ద పెట్టాలన్నా కష్టమే. ఎందుకంటే పశువులకి తెలిసినన్ని రుచులు మనకి తెలీదు. మేతలో తేడా వచ్చిందంటే ముద్దముట్టవు. ఎన్ని రోజులయినా పస్తుపడుంటాయి. అందుకే ఒళ్ళు దగ్గరపెట్టుకుని గరిటె తిప్పాలి. ఉద్యోగంలా చేద్దామంటే మాత్రం ఇదంతా కుదరదు. మూగప్రాణుల్ని స్వంత బిడ్డలుగా భావిస్తేనే పని చేయగలం. జూపార్కులో మొత్తం ఎనిమిది వందల మృగాలు, పక్షులు ఉన్నాయి. వీటిలో మళ్ళీ వెజిటేరియన్లూ, నాన్‌వెజిటేరియన్లూ ఉంటాయి. వాటి కోసం రోజూ అవసరమయ్యే పచారీ సామాన్లు, కూరల లిస్టు చెబితే ఆశ్చర్యపోతారు. ఆరువందల కిలోల పళ్లు, కూరలు, దుంపలు, నూట ఇరవై కేజీల మాంసం, చేపలు... వంద కిలోల చెరుకు ముక్కలు, వందల్లో కోడిగుడ్లు, నాలుగైదు బెల్లం దిమ్మలు, రెండు మూడు కిలోల తేనె... బస్తాల కొద్దీ రాగిపిండి, పౌల్ట్రీఫీడ్... ఇంకా చాలానే ఉన్నాయి.

మా జూలో ఉన్న కోతులు, జింకలు, కణుసులు, అడవి దున్నలు, కొండమేకలు, పక్షులు, పందులు వీటన్నింటికీ కూరలు, పండ్లు, దుంపలు పెడతాం. ఎలుగు బంట్లు, పులులు, సింహాలకు చేపలు, చికెన్, గొడ్డు మాంసం, కోడిగుడ్లు వంటివి పెడతాం. నీటి గుర్రమైతే మరీ కచ్చితం. రోజూ ఏభై కిలోలకుపైగా ఆకుకూరలు, దుంపలు తింటుంది. దీనికి అన్నీ శుచిగా ఉండాల్సిందే.

***మహా తెలివైనవి***

మనుషులు ఎలా అయితే ఏకాంతంలో తినాలని కోరుకుంటారో జంతువులు కూడా అలాంటి ఏకాంతాన్నే కోరుకుంటాయి. సందర్శకులు లేనప్పుడే అన్నానికి కూర్చుంటాయి. అరణ్యంలోలాగానే పద్ధతి పాటించాలి. పళ్ళెంలో

తేనె పోస్తే ఎలుగుబంట్లు తాగవు. చెట్టుమీద ఉట్టిలాంటిది కట్టి, అక్కడ పెడితే సహజమైనదిగా భావించి చప్పరిస్తాయి. నక్కలు, రేచుకుక్కలు, పులి, సింహం రుచి విషయంలో శ్రద్ధపెడతాయి. మాంసంలో ఆరోగ్యం కోసం క్యాల్షియం పౌడర్ కలుపుతుంటాం. దీనివల్ల కొంచెం చేదు తగుల్తుంది. మాంసం వేయగానే ఆ ముక్కల్ని నోట కరుచుకుని నేరుగా నీళ్ళ కుండీ దగ్గరకు వెళతాయి. వాటిని చేదుపోయేలా చక్కగా కడిగేసుకుని ఆరగిస్తాయి. నువ్వేనా తెలివైనదానివి, మాకు లేదా తెలివి... అన్నట్టుగా నావైపు చూస్తాయి. కొండ చిలువలు బతికున్న కోడినే కోరుకుంటాయి. వేటాడి తింటేనే వాటికి తృప్తి. కొన్ని రకాల పాములున్నాయి. కోడిపిల్లలు, కప్పలు, ఎలుకలు జీవంతో ఉన్నవే వేయాలి. ఏనుగయితే చెరుకు, అరటి దవ్వ తింటుంది. దీని కోసం రాగిపిండితో ప్రత్యేకంగా తోప (అంబలి) తయారుచేస్తాను. రాగులు, బియ్యం బాగా ఉడికించి, బెల్లం కలిపి పెద్ద పెద్ద ముద్దలు చేసి నోటికందిస్తూ ఉండాలి. కొన్ని రకాల మృగాలకి తియ్యని జావపెట్టాలి. వేడివేడిగా ఉండాలి. నూకలు, రొట్టె ముక్కలు, పాలు కలిపి పరమాన్నంలా వండితే లొట్టలేస్తూ లాగిస్తాయి. కొన్నింటికి చోళ్ళు దంచి పులుసులా తయారుచేయాలి. కోడి గుడ్లు ఉడికించిపెట్టాలి. మరికొన్నింటికి వేడిపాలల్లో గుడ్లు కొట్టి జ్యూస్‌లా కలిపి ఇవ్వాలి.

***టైమ్ తెలుసు***

జూ జంతువులకు భోజనం టైమ్ బాగా తెలుసు. వంటలన్నీ అయ్యాక వ్యాన్‌లో పెట్టుకుని బయలుదేరతాను. వ్యాన్ శబ్దం వినగానే కేరింతలు కొడుతూ సిద్ధమైపోతాయి. అంబలి వాసనకు ముక్కు పుటాలెగరేస్తాయి. ఏళ్ళ తరబడి అలవాటయిన మనిషిని కదా. లేళ్ళు, దుప్పులు, కోతులు గుర్తుపట్టి చిందులేస్తుంటాయి. తల్లిని చూసినట్టుగా సంతోషపడతాయి. నా దగ్గర కొచ్చేసి పిల్లల్లాగానే వెర్రులోడుతాయి. ఆ క్షణంలో వాటిని చూస్తే నా కళ్ళు చెమరుస్తాయి. ఈ బంధం ఏనాటిదో అనిపిస్తుంటుంది. నా కడుపున పుట్టిన పిల్లలు కార్తీక, గిరిజనులను – వీటిని నేనెప్పుడూ వేరుగా చూడను. వంట పని కొన్ని నిముషాలు లేటయిందనుకోండి. నా పిల్లలు ఇంట్లో ఎలా కంచాలు చప్పుడు చేస్తారో ఎన్‌క్లోజర్ తలుపులు కొడుతూ ఇవీ అలాగే గోలపెడతాయి. పిల్లలు పెద్దయ్యాక నా దగ్గరకొస్తారో లేదో గానీ, నేను ఆహారం తీసుకువెళితే చాలు పరుగులమీదొచ్చి జూ ప్రాణులన్నీ చుట్టుముట్టేస్తుంటాయి. ఇదంతా అలవాటయిపోయి సాయంత్రం ఇంటికెళితే అదోలా ఉంటుంది. అక్కడ మరో అవతారమెత్తాలి. చిన్న చిన్న గిన్నెలతో వంట చేయడం లక్కపిడతలతో వండినట్టుంటుంది.

***మొక్కులు పెడతా***

గత సంవత్సరం ఒంట్లో బాగోలేక పదిరోజులు సెలవు పెట్టాను. జంతువులు నన్ను మరచిపోతాయనే అనుకున్నాను. మళ్ళీ డ్యూటీలో చేరాక నన్ను చూసి అవి పడ్డ ఆనందం అంతా ఇంతా కాదు. ఆకలికి సెలవుండదు కదా. అందుకే జంతువుల ఆకలితో బంధం ఉన్న నాకూ శలవుండదు. జూలో ఏ రోజు ఏ ఒక్క జీవమైన తిండి తినకపోతే నాకూ అన్నం సహించదు. వాటికి వంట్లో బాగులేకపోయినా నిద్రపట్టదు. వాటి ఆరోగ్యం కోసం వేయి దేవుళ్ళకి మొక్కులు పెడుతుంటాను. పులులు, సింహాలకు జీర్ణక్రియ మందగించకుండా ఉప్పు మూటల్ని చెట్లకు కట్టి నమిలిస్తాం. కొవ్వుపడితే ఆరోగ్యం పాడవుతుంది. వారానికోరోజు ఒంటిపూట చేయిస్తుంటాం. కోతులకి అనారోగ్యమైతే అరటి పళ్ళల్లోనూ, పులులకు బాగోలేకపోతే మాంసం ముక్కల్లోనూ మాత్రలు పెట్టి తినిపిస్తాం.

***ఇదే నా ఇల్లు***

ఈ ఆరు వందల ఏభై ఎకరాల జంతు ప్రదర్శనశాలే నా ఇల్లు. ఇక్కడి వన్యప్రాణులే నా బిడ్డలు. ఇలాంటి జన్మనిచ్చిన భగవంతుణ్ణి మరచిపోలేను. జన్మజన్మలకీ ఈ కొలువే కావాలని కోరుకుంటున్నాను. ప్రాణమున్నంత కాలం జంతుసేవలోనే గడుపుతాను. ఉదయమంతా శాకాహార జంతువులకు మేత సిద్ధం చేస్తా. మధ్యాహ్నం మాంసాహార వంటలు మొదలెడతా. బీఫ్, చికెన్ ముక్కల్ని కొన్నింటికి పచ్చిగానే వేయాలి. కొన్నింటికి కాల్చి పెట్టాలి. మరికొన్నింటికి ఉడికించి ఇవ్వాలి. అప్పుడప్పుడు మనలాగానే అవి కూడా వెరయిటీలు కోరుతుంటాయి. చికెన్‌సూప్ గట్రా చేసి హితవుగా పెడతా. పులులు. సింహాలకు ఆహారం ఇవ్వడం చిన్న విషయం కాదు. నచ్చేలా వండటం సరే. విడివిడిగా వడ్డించాలి... ఇలా చెబుతున్న సూర్యకాంతం లాంటి అమ్మ దొరకడం వైజాగ్ జూపార్కు జంతువుల పూర్వజన్మఫలం.

## 13. మార్కండేయుడు

పూర్వం మృకండుడు, మరుద్వతి అనే దంపతులు ఉండేవారు. మృకండుడు అరణ్యంలో తపస్సు చేసేవాడు. వారికి సంతానం లేదు. సంతానం కోసం మృకండుడు కాశీకి వెళ్ళి శివుని ప్రార్థించాడు. అప్పుడు పరమేశ్వరుడు ప్రత్యక్షమై "నీకు నూరు సంవత్సరాలు ఆయుర్దాయం గల తెలివి తక్కువ కొడుకు కావాలా? లేక పదహారు సంవత్సరాలు జీవించే అల్పాయుష్కుడు, తెలివిగలవాడు, భక్తుడు అయిన కొడుకు కావాలా?" అని ప్రశ్నించాడు. అప్పుడు మృకండుడు "తెలివిగలవాడు, శివభక్తుడు అయిన కొడుకు కావాలి. వాడు అల్పాయుష్కుడైనా పరవాలేదు" అని కోరుకున్నాడు. కొన్నాళ్ళకు వారికి అలాగే కొడుకు పుట్టాడు. అతనికి మృకండుఋషి మార్కండేయుడు అని పేరు పెట్టి ఎంతో ముద్దుగా పెంచాడు. విద్యలన్నీ నేర్పించాడు. మార్కండేయుడు పెరిగి పెద్దవాడయ్యాడు. అతనిలో సుగుణాలు, వినయవిధేయతలు కూడా పెరిగాయి. కొడుకుకు ఆయుష్షు దగ్గర పడుతున్నదని తెలుసుకున్న తల్లిదండ్రులు బాధపడ్డారు. ఈ సుపుత్రుడు కొద్ది రోజుల్లో మనకు దూరం అవుతాడేఁ అని ఏడ్వసాగారు. మార్కండేయుడు తల్లిదండ్రుల బాధను తెల్సుకున్నాడు. "తండ్రీ! నన్ను పుట్టించినవాడు శివుడు. ఆ శివుని వద్దకు చేరి అతని సన్నిధిలోనే గడుపుతాను. అతనే రక్షిస్తాడు" అంటూ కాశీకి వెళ్ళి శివదీక్ష చేపట్టి భక్తితో శివుని అర్చించసాగాడు.

మార్కండేయుడికి పదహారేళ్ళ వయసు రాగానే అతని ప్రాణాలు తియ్యడానికి యమదూతలు వచ్చారు. కానీ, మార్కండేయుడు శివదీక్షలో ఉన్నందువలన వారు అతనిని సమీపించలేకపోయారు. అప్పుడు యమధర్మరాజే స్వయంగా వచ్చి మార్కండేయుని తనతో రమ్మన్నాడు. మార్కండేయుడు శివా! శివా! అంటూ శివలింగాన్ని గట్టిగా కౌగలించుకున్నాడు. అయినా యముడు అతని ప్రాణాలు తియ్యాలని ప్రయత్నించాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై యమధర్మరాజుని పంపివేసి, మార్కండేయుని చిరంజీవిగా దీవించి పంపివేశాడు. చూశారా! శివుని మీద భక్తితో ప్రాణాలను కాపాడుకున్నాడు మార్కండేయుడు.

## 14. తల్లి ప్రేమ ముందు సముద్రమూ చిన్నదే

'ప్రేమలో భూమికన్నా భారమైనది ఏది?' అని యక్షుడు వేసిన ప్రశ్నకు పాండవాగ్రజుడైన ధర్మరాజు 'తల్లి' అంటూ సమాధానమిచ్చాడు. తల్లి, తన పిల్లలను నవమాసాలూ మోసి కనడమేకాక ఆ పిల్లలు ఆరోగ్యంగా పెరిగి పెద్దవారై తమ కాళ్ళమీద తాము నిలబడే వరకూ కూడా వెనుదన్నుగా ఉండి వారి రక్షణకు పూర్తిబాధ్యత వహిస్తుంది.. అంతేకాక తన పిల్లలకు ఎటువంటి కష్టమొచ్చినా ముందు తనకే వచ్చినంతగా విలవిల్లాడుతుంది.

ముందుగా పిల్లలను ఓదార్చడమే కాకుండా, మరలా అటువంటి కష్టం రాకుండేటట్లు శాయశక్తులా కృషిచేస్తుంది. ఒకవేళ అది తనకుమించిన భారమైనా తన బిడ్డల రక్షణ విషయంలో దేన్నీ లెక్కచేయక ఆ సమస్యపరిష్కారమే ధ్యేయంగా పనిచేసి కృతకృత్యురాలవుతుంది. పశు, పక్షి, జంతుజాలాల్లో ఎక్కడ చూచినా మాతృమూర్తి ప్రేమ ఎంతో ఉన్నతంగా ఉంటుంది.

ఒకానొక సముద్రతీరాన ఒక చెట్టుమీద టిట్టిభం అనే లకుముకిపిట్ట చిన్న గూడుకట్టుకొని నివసిస్తూ ఉండేది. సముద్రప్రాంతం కావటం మూలాన కొత్త కొత్త చేపలతో చక్కటి ఆహారం లభించేది. చల్లటి గాలికి హాయిగా ఆ గూటిలో సుఖజీవనం గడుపుతూ ఉండేది.

కొంతకాలానికి ఆ పక్షి తన గూటిలో కొన్నిగుడ్లు పెట్టింది. ఆ గుడ్లను చూసుకుంటూ, వాటి నుండి వచ్చే తన సంతానం గూర్చి కలలు కంటూ ఆనందిస్తుండేది. ఈ విధంగా ఆలోచనలతో రోజులు ఆనందంగా గడుస్తున్నాయి. కాని ప్రతీ ఆనందం వెనుకా నీడలా విపత్తు పొంచి ఉంటుందేమో!

ఆ పక్షి ఆనందం ఎంతోకాలం నిలువలేదు. కారణం తాను నివసిస్తున్న ప్రాంతం సముద్రానికి పెద్దపెద్ద అలలతో వచ్చి చెట్టుపైన గూట్లో టిట్టిభం పెట్టిన గుడ్లు లాక్కుపోయింది.

టిట్టిభం తిరిగి వచ్చేసరికి గూటినిండా సముద్రపునీరు. గూట్లో తన సంతానమైన గుడ్లు లేకపోవడం చూసింది. ఈ పాడు సముద్రమే తన గుడ్లను తీసుకుపోయిందని చాలాసేపు విచారించింది. తన కలలన్నీ కల్లలు అయిపోయాయని బాధపడింది. ఏం చేయగలదు? ఎవరిని అడుగగలదు? అలా దిగులుతోనే కాలం వెళ్ళబుచ్చుతోంది.

మరికొంతకాలానికి టిట్టిభం తన గూటిలో మరలా గుడ్లుపెట్టింది. ఈసారి జాగ్రత్తగా తన గుడ్లు చూసుకోవాలని అనుకుంటూ సాధ్యమయినంత వరకు గూటి దగ్గరే తన గుడ్లకు కాపలా ఉండటం మొదలుపెట్టింది.

కాని పెద్ద సముద్రం తన కెరటాలతో పరుగు పరుగున వచ్చింది. ఓ పెద్ద కెరటం వచ్చి గూటిలో ఉన్న గుడ్లను లాక్కుపోయింది. టిట్టిభం సముద్రపు కెరటాలను అరుస్తూ వెంబడించింది. గాని తన గుడ్ల జాడ కనబడక గొల్లున ఏడ్చింది. అంతలో టిట్టిభానికి చాల కోపం వచ్చింది.

ఎవరికి కోపమొచ్చినా ఏమోగాని అమ్మకు కోపమొస్తే మాత్రం అంతుండదు. తన బిడ్డలకు కష్టం కలిగిస్తే ఏ మాతృమూర్తి అయినా తన శక్తి ఏమిటో చూపిస్తుంది. తనకు కోపం కలిగిందంటే తన బిడ్డల క్షేమంకోసం ఎటువంటి కష్టతరమైన త్యాగాలకైనా సిద్ధమైతుంది.

ఆవిధముగా 'ఈ సముద్రపు అంతు చూడాలి. ఈ సముద్రాన్ని ఎండింప చేసేస్తాను' అంటూ సముద్రుడుని ఎండింప చేయడానికి సిద్ధపడింది. పక్షిచూస్తే చిన్నది. సముద్రమేమో చాలా పెద్దది. దీనిని ఎండిపచేయడం

సాధ్యమా, కాదా? అన్న విషయం ఈ చిన్నపక్షి ఆలోచించలేదు. తననుండి తన పిల్లలను దూరం చేసే ఈ సముద్రాన్ని అంతం చేయాలి. ఆ ధ్యేయంతోనే ఈ మహాయజ్ఞానికి సిద్ధపడింది.

తన శరీరాన్ని ఒడ్డునున్న ఇసుకలో పొర్లించింది. ఎగిరి సముద్రం పైకి వెళ్ళి తన ఒంటిపైనున్న ఇసుకను సముద్రంలో దులిపింది. ఈ విధంగా పదేపదే చేయసాగింది. ఏమిటిదీ! అయ్యేపనేనా! ఈ చిన్నపక్షి రాల్చే ఇసుకకు సముద్రం ఎండిపోతుందా!?

కానీ తన ప్రయత్నం మానలేదు. పదే పదే వస్తోంది ఇసుక రాలుస్తోంది. ఇలా రోజులు గడుస్తున్నాయి. తల్లికి శ్రమ పెరుగుతోందేగాని ప్రయత్నం మాత్రం మానలేదు.

ఎటువంటి ప్రయత్నాన్నైనా నిష్కల్మషంగా సాగిస్తున్నామంటే దానికి భగవత్కృప కూడా తప్పనిసరిగా తోడవుతుంది.

దానికి నిదర్శనంగానే ఈ చిన్నపక్షి చేసే ప్రయత్నాన్ని ఒకరోజు ఆకాశంలో విహారానికి వచ్చిన పక్షిరాజు ఆశ్చర్యంతో గమనించాడు. తన జాతి పక్షికదా! విషయం తెలుసుకుందామని కిందకు దిగి, "మిత్రమా ఏమిటి నీ ఈ దుస్సాహసం!" అంటూ ఆప్యాయతతో అడిగాడు పక్షిరాజు.

అంతవరకు పలకరించినవారే లేరు. ఒక్కసారి ఆప్యాయత కనబరిచిన పక్షిరాజు ముందు తన కష్టం చెప్పుకుని గొల్లుమని ఏడ్చింది టిట్టిభం.

ఈ సముద్రం అంతకష్టాన్ని కలిగించిందా! నీవు ఏమీ బాధపడకు, నీకష్టాన్ని నేను తొలగిస్తాను అని ధైర్యంచెప్పి, పక్షిరాజైన గరుత్మంతుడు మనోవేగంతో వైకుంఠానికి చేరి తన ప్రభువుతో "స్వామీ! శ్రీమన్నారాయణా! మా పక్షిజాతిలోని చిన్నపక్షికి చాలా కష్టం కలిగింది" అంటూ నమస్కరించి వివరించాడు.

"ఏం జరిగింది?" అడిగాడు శ్రీమన్నారాయణుడు. జరిగిన విషయాన్ని విన్నవించాడు గరుత్మంతుడు.

'అలాగా!' అంటూ వెంటనే సముద్రుని పిలిపించాడు స్వామి. "ఏమయ్యా! సముద్రా! నీవు చేసినపని మంచిదేనా? ఈ పని గనుక నీవు మానకపోతే కఠిన శిక్ష అనుభవించవలసి ఉంటుంది జాగ్రత్త! నీవు పట్టుకెళ్ళిన గుడ్లను టిట్టిభానికి అప్పగించు. అర్థమయిందా" అంటూ స్వామి సముద్రుణ్ణి మందలించాడు.

"సరే స్వామీ! నన్ను క్షమించండి" అని వేడుకున్నాడు సముద్రుడు.

సముద్రం గట్టున ఉన్న చెట్టుమీద విచారంతో కూర్చున్న టిట్టిభం దగ్గరకు సముద్రుడు వచ్చి తాను తీసుకుపోయిన గుడ్లన్నీ గౌరవంగా తెచ్చి "నన్ను క్షమించవమ్మా! నీవూ, నీ పిల్లలూ క్షేమంగా ఉండండి. ఇక మీదట నీకెటువంటి ప్రమాదమూ నావల్ల రాదు" అంటూ అభయమిచ్చి వెళ్ళిపోయాడు.

టిట్టిభం. తన గ్రుడ్లు అన్నీ క్షేమంగా వచ్చినందుకు ఆనందంతో మురిసిపోయింది. గ్రుడ్లనుండి పిల్లలు బయటకు వచ్చాక తన సంతానాన్ని చూసుకుని టిట్టిభం ముఖంలో ఆనందం సముద్రమంత అయింది.

పిల్లల విషయంలో తల్లిపడే వేదన అంతా ఇంతా కాదు. ప్రతీతల్లి, తన పిల్లల భవిష్యత్తుకై ఎంతో మథనపడుతుంది. పిల్లలు మంచివారై పెరిగి పెద్దైన తరువాత, తమ తల్లి తమకు చేసిన మేలు మరువని వారై, ఆ తల్లి యందు ప్రేమ, గౌరవాలతో మెలగుతూంటే ఆమె ఆనందంముందు సముద్రం కూడా చిన్నదయిపోతుంది.

# స్ఫూర్తిదాతలు

## సయ్యద్ నశీర్ అహ్మద్
## బేగం హజరత్ మహల్

**మాతృభూమి, స్వేచ్ఛ, విముక్తి కోసం సాగే పోరాటంలో మరణమే తప్ప మరేదీ ఆఖరి మజిలీ కాదని చాటిన యోధురాలు బేగం హజరత్ మహల్.**

ప్రథమ స్వాతంత్ర్య సమరంలో భాగంగా దేశవ్యాప్తంగా సాగిన తిరుగుబాట్లలో ప్రధానమైనది 'లక్నో' పోరాటం. ఈ చారిత్రాత్మకమైన పోరు అవధ్ మహరాణి బేగం హజరత్ మహల్ నేతృత్వంలో జరిగింది. బ్రిటిష్ ముష్కరమూకల సామ్రాజ్య విస్తరణకాంక్షకు భరతగడ్డ మీద ఒక్కొక్క సంస్థానం బలైపోతున్న పరిస్థితులవి. లక్నోను కూడా తమ అధీనంలోకి తెచ్చుకోవాలన్న కాంక్షతో బ్రిటిష్ పాలకులు ప్రతిపాదన చేయగా, లక్నో సంస్థానాధీశుడైన నవాబ్ వాజిద్ ఆలిషా వ్యతిరేకించాడు. లక్నో వజీర్ అలీనబీఖాన్‌ను లోబర్చుకుని, నమ్మక ద్రోహంతో ఆలిషాను బ్రిటీష్ ప్రభుత్వం నిర్బంధంలోకి తీసుకొని కలకత్తా కారాగారానికి రహస్యంగా తరలించింది. సంస్థానాధీశుని అడ్డు తొలగించుకున్న బ్రిటీష్ ప్రభుత్వం లక్నో సంస్థానం రద్దయినట్టు ప్రకటించింది.

ఈ కుతంత్రాలను తొలుత నుండి గ్రహించిన అవధ్ బేగం తీవ్రంగా వ్యతిరేకించింది. బేగంను కూడా నిర్బంధంలోకి తీసుకునేందుకు బ్రిటీష్ సైనికాధికారులు వలపన్నగా ఎంతో చాకచక్యంతో తప్పించుకుని ఆమె అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. బేగం సురక్షితంగా తప్పించుకున్నారన్న వార్త విన్న ప్రజానీకం బ్రిటిష్ ప్రభుత్వం మీద తిరుగుబాటు చేశారు. బేగం హజరత్ మహల్ తన 13 సంవత్సరాల కుమారుడు బిర్జిస్‌ఖదీర్‌ను వెంట తీసుకుని మారువేషంలో లక్నో సంస్థాన ప్రాంతమంతా తిరుగుతూ తిరుగుబాటు వీరులైన నానాసాహెబ్. తాంతియాతోపే, మౌల్వీ అహమ్మదుల్లాఖాన్ తదితరులను కలుసుకుని బ్రిటిష్ ముష్కరులను మాతృగడ్డ నుండి తరిమివేసేందుకు నడుంకట్టారు.

ప్రజలలో రహస్యంగా తిరుగాడుతూ తిరుగుబాటు ఉద్దేశ్యాలను వివరిస్తూ ప్రజానీకాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రేరేపించసాగారు. అదను చూసి 1857 మే 30వ తేదీన లక్నో 'ఛావనీ'లో ఫిరంగిపేల్చి బేగం హజరత్ మహల్ తిరుగుబాటు ప్రకటించారు. ఈ తిరుగుబాటు తాకిడికి తట్టుకోలేకపోయిన బ్రిటిష్ సైన్యం పరారవ్వగా, బ్రిటిష్ తిరుగుబాటును నడిపించిన బేగం హజరత్ మహల్ తిరిగి లక్నోను స్వాధీనం చేసుకున్నారు. ఆనాటి కులీనవర్గాలు ఒక మహిళను పాలకురాలిగా అంగీకరించేందుకు సిద్ధంగా లేరని గ్రహించిన ఆమె తన కుమారుడ్ని రాజుగా ప్రకటించి పరిపాలనను తాను చేపట్టారు. హిందూ ముస్లింల ఐక్యత యొక్క బలాన్ని గ్రహించిన ఆమె రాజా జియాలాల్. రాజామాన్‌సింగ్, రాజా దేవీ బక్షసింగ్. రాజా బేణిమధులాంటి హిందూ ప్రముఖులను ఆహ్వానించి తన ఆస్థానంలో తగిన స్థానం కల్పించారు.

బేగం హజరత్ మహల్‌గా ఖ్యాతిగాంచిన ఆమె అసలు పేరు మహమ్మదీ బేగం. పద్నాల్గవ ఏట వివాహం చేసుకునే నాటికే ఆమె అన్ని రకాల యుద్ధ విద్యలను నేర్చి ఉండటంతో షాజాన్‌పూర్, లక్నో యుద్ధాలలో తాను స్వయంగా పాల్గొన్నారు. ప్రజలను, స్వదేశీ సైనికులను ఆకట్టుకునేట్టుగా, తిరుగుబాటు సైనికులను ప్రోత్సహించే విధంగా తన అద్భుత ప్రసంగాలను అనూహ్యమైన సైనిక విన్యాసాలకు ఆమె పెట్టింది పేరు.

బేగం హజరత్ మహల్ చేతిలో ఎదురైన పరాభవాన్ని భరించలేని బ్రిటిష్ సైనాధికారులు అపార సైనిక శక్తిని సమకూర్చుకుని మళ్ళీ లక్నో మీద దాడి చేశారు. అప్పటికే పలుచోట్ల తిరుగుబాటును అణచివేసిన ఉత్సాహంతోనున్న బ్రిటిష్ సైనికాధికారులు లక్నోను నాలుగువైపుల నుండి చుట్టుముట్టారు. బేగం స్వయంగా యుద్ధభూమిలో దిగి బ్రిటిష్ సైనిక మూకలను చీల్చి చెండాడసాగింది. తుపాకులు, ఫిరంగిదళాలతో అన్ని వైపుల నుండి ఉప్పెనలా ముంచుకువస్తున్న బ్రిటిష్ సైన్యంతో పోరాడుతూ బేగం అనుచరులు ఒక్కొక్కరు నేలకొరిగి పోసాగారు. బేగం సైనిక బలం బలహీనపడసాగింది. యుద్ధ ఫలితం ఎలాగున్నా హజరత్ మహల్‌ను సజీవంగా పట్టుకుని, బంధించి లొంగదీసుకోవాలని బ్రిటిష్ సైనిక అధికారులు వ్యూహం పన్నారు. ఆ విషయం తెలుసుకున్న బేగం శత్రువు చేత చిక్కకుండా, పోరు భూమిని వదలకుండా యుద్ధం సాగిస్తూ, తిన్నగా వెనక్కి తగ్గుతూ బ్రిటిష్ సైన్యం కళ్లల్లో దుమ్ము కొట్టి చాకచక్యంగా తప్పించుకున్నారు. లక్నో ఆంగ్లేయుల వశమైపోయింది.

యుద్ధ రంగం నుండి నేరుగా నేపాల్ అడవులకు చేరుకున్న ఆమె తన సైన్యాన్ని కూడగట్ట నారంభించి నానాసాహెబ్‌ను కలుసుకుని తిరిగి దాడి చేసేందుకు సమాలోచనలు జరుపసాగారు. అజ్ఞాతం నుండే ప్రజలను ప్రేరేపిస్తూ దేశభక్తులైన సైనికులను సమీకరించారు. అందుకు తన యావత్తు సంపదను నీళ్ల ప్రాయంగా ఖర్చు చేయసాగారు. బేగం ప్రయత్నాలను పసిగట్టిన బ్రిటిష్ సైనికాధికారులు ఆమెను లొంగదీసుకునేందుకు గాను 17 లక్షల రూపాయల పెన్షన్ సంక్రమింపచేస్తామని ఆశ చూపుతూ ప్రతిపాదనలు పంపారు. మాతృభూమి విముక్తి తప్ప తనకేదీ అంగీకారం కాదని బేగం స్పష్టంగా ప్రకటించి ఆంగ్లేయులను ఆశ్చర్యచకితుల్ని చేశారు. విక్టోరియా మహారాణి ప్రకటనకు ప్రతిగా లక్నో సంస్థానం నుండి తాను తన స్వదేశీ ప్రకటన విడుదల చేసి చారిత్రాత్మక సంచనలం సృష్టించారు.

మాతృగడ్డ స్వేచ్ఛ, విముక్తి కోసం సాగే పోరాటంలో మరణమే తప్ప మరేదీ ఆఖరి మజిలీ కాదని ప్రకటించిన బేగం హజరత్ మహల్ 1879లో నేపాల్ పర్వతాల్లో సాధారణ మహిళగా కన్నుమూశారు.

డా॥ భోగరాజు
పట్టాభి సీతారామయ్య
(1880-1959)

డా॥ పట్టాభి గారు పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని 'కాంగ్రెస్ చరిత్ర' అనే గ్రంథాన్ని రచించారు. పొదుపు పట్టాభిగారికి మారుపేరు. ప్రతిష్ఠాకరమైన ఆంధ్రాబ్యాంక్, ఆంధ్ర ఇన్సురెన్స్ కంపెనీల వంటివి స్థాపించిన మహావ్యక్తి.

బాలలూ! ప్రపంచంలో అన్నిటి కన్నా సులువైన పనులు రెండున్నాయి. మొదటిది వచ్చిన డబ్బంతా ఖర్చుపెట్టడం, రెండవది ఇతరులను విమర్శించడం, కానీ ఈ రెండు పనులు మనిషికి శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేవు. ఇవి సంతోషంగా ఉన్న మనిషిని సమస్యలలో పడవేయగలవు. అయితే వచ్చిన డబ్బును జాగ్రత్తగా ఖర్చుపెట్టి, పొదుపు చేయటం నేర్చుకున్న వారు జీవితంలో ఎంతో సుఖపడగలరు. తమ కుటుంబ సభ్యులకు సుఖశాంతుల నివ్వగలరు. అలాగే నాలుకను అదుపులో ఉంచుకున్నవాడు లోకాన్ని జయించగలడు. ఈ 'పొదుపూ – అదుపూ' అనే విషయాలను ప్రజలకు బోధించి వారికి ఒక క్రమ జీవితాన్ని అలవాటు చేసిన మహాపురుషులలో వారిలో మన తెలుగు వారైన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు ఒకరు.

పొదుపు గురించి ఉద్బోధించి, డబ్బును విచ్చలవిడిగా ఖర్చుపెట్టకుండా పొదుపు చేసేలా చేసి, ఆంధ్రా బ్యాంకును స్థాపించి ఎందరికో ఎన్నో రకాలుగా సహాయం చేసిన మహావ్యక్తి ఆయన. మహాత్మాగాంధీ, నెహ్రూ, వల్లభాయ్ పటేల్ వంటి మహానాయకులు కూడా పట్టాభిగారి పొదుపు ఉద్యమం గురించి ప్రముఖంగా చర్చించుకునేవారు.

భోగరాజు పట్టాభి సీతారామయ్య పంతులు 1880 నవంబరు 24న గుండుగొలను అనే గ్రామంలో జన్మించారు. వారిది పేద కుటుంబం. తండ్రి కరణంగా పనిచేసేవారు. ఆయనకు వచ్చే ఆరు రూపాలయ జీతంతో గుట్టుగా కాపురం చేసేవారు. తన ఆదాయంలో రూపాయో, అర్థరూపాయో మిగిల్చేవారు కూడా. పంతులు చిన్నతనంలో తల్లిదండ్రులను ఏనాడూ డబ్బుకై పీడించలేదు. అవి కావాలనీ, ఇవి కావాలనీ సతాయించలేదు. ఇంటిలోని పరిస్థితులు గమనిస్తూ, వాటికి తగ్గట్టుగా మసలుకునేవాడు. తండ్రితోపాటు బజారుకి వెళ్ళి వస్తువులు కొన్నప్పుడు తండ్రి వాటిని మోయడానికి కూలీని పిలిచినప్పుడు పంతులు ఆయనను వారించి, ఆ సామానును తనే మోసి ఆ కూలీ డబ్బులు మిగిల్చేవాడు. చివరకు ఇంట్లో వంటకు కావలసిన కట్టెలను కూడా నెత్తిమీద పెట్టుకుని తెచ్చేవాడు. ఒకసారి తోటి విద్యార్థి అలా చూసి గేలి చేసినప్పుడు "నేను నా ఇంటి పనులు చేసుకోటానికి సిగ్గుపడను. అనవసరంగా భేషజాలకు పోయి డబ్బు వృథా చేయను, మీరు నవ్వినందువలన నాకేం నష్టంలేదు" అన్నాడు.

పంతులుగారు ఏలూరులో హైస్కూలు విద్య ముగించి బందరునోబుల్ కళాశాలలో చేరారు. ఆ సమయంలో ప్రఖ్యాత విద్యావేత్త, సంఘ సంస్కర్త, బ్రహ్మ సమాజ సభ్యుడు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు ఆ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరరుగా ఉండేవారు. అచిరకాలంలోనే పంతులుగారు ఆయనకు సన్నిహితుడయ్యాడు. ఆయన అడుగుజాడలలో నడుస్తూ, మంచి పేరు తెచ్చుకుని డిగ్రీ పూర్తిచేశారు. తరువాత మద్రాసులో వైద్యం చదివి బందరులో ప్రాక్టీసు ప్రారంభించారు. అప్పటికే దేశంలో స్వదేశీ ఉద్యమం తీవ్రరూపం దాలుస్తూంది. భారతమాత పిలుపు నందుకుని, పంతులుగారు కూడా స్వాతంత్ర్య సమరంలో పాల్గొని అనేక ఉద్యమాలు నడిపి, మహాత్మాగాంధీ వంటి నాయకుల ప్రశంసలు పొందారు. ఆ సమయంలోనే "కాంగ్రెసు చరిత్ర" అనే మహాగ్రంథాన్ని రాశారు.

పంతులుగారికి ఆర్థిక ఇబ్బందులు తొలిగినా కూడా ఆయన తన 'పొదుపు ఉద్యమం' విడనాడలేదు. ఆయనకు స్నేహితుల నుంచి వచ్చిన ఉత్తరాల కవర్లను చింపి, వాటిలోపలి భాగంలో తను చేయవలసిన పనులు రాసుకునేవారు. 'కాంగ్రెసు చరిత్ర' కు సంబంధించిన ఎక్కువ అధ్యాయాలు ఆయన వాటిమీదే రాశారు. బట్టల విషయంలో కూడా ఎంతో పొదుపుగా ఉండేవారు. ధోతి చిరిగితే లుంగీగాను, అదీ చిరిగితే తువ్వాలుగానూ, అది కూడా చిరిగితే రుమాళ్ళగానూ వాడేవారు. అవీ చిరిగినప్పుడు వాటిని లాంతర్లు తుడిచేందుకు ఉపయోగించేవారు.

ఒకసారి పంతులుగారు ఇంటి అరుగుమీద కూర్చుని ఉండగా ఎదురుగా ఉన్న ఇంట్లోని సోదరులు గట్టిగా మాట్లాడుకోవటం వినిపించింది. వారి వద్దనున్న డబ్బును దాచుకునేందుకు సరైన ప్రదేశం లేకపోవటంవలన తగాదా మొదలయ్యిందిట అంతే! పంతులుగారు వారి డబ్బును తన వద్ద దాచడానికి సంసిద్ధత వ్యక్తపరిచారు. వారి పేరున అకౌంట్లు ప్రారంభించి వారి జమా ఖర్చులు వేస్తూండేవారు. అలా అరుగుమీద స్థాపించబడిన బ్యాంకుకి నేడు భారతదేశంలో మొత్తం వెయ్యి బ్రాంచిలున్నాయి. అదే మన ఆంధ్రాబ్యాంకు.

పట్టాభిగారు ఆంధ్రా బాంకుతో పాటు కృష్ణా కోపరేటివ్ బాంకు, ఆంధ్రా ఇన్సురెన్సు కంపెనీలు కూడా స్థాపించారు. ఒకసారి ఒక నాయకుడు పట్టాభిగారితో "పొదుపు పొదుపు అంటూ మీరు ఊరికే పదిసార్లు ఎందుకు చెప్తారు. ఉన్నవాడు ఖర్చు పెట్టుకుంటే మీకేం పోయింది?" అని అడిగాడు. దానికి సమాధానంగా "ఉంది కదా అని దుబారాగా ఖర్చుపెట్టడం మంచి లక్షణం కాదు. మానవుడి కోర్కెలు అనంతం. వాటిని తీర్చుకుంటూపోతే కొండలైనా కరగకమానవు. భోగాలకు పరిమితి లేదు. అంతా అయిపోయిన తరువాత పశ్చాత్తాపపడి లాభంలేదు. మనకన్నా ఎక్కువగా ఉన్నవారిని చూసి వారిలా ఖర్చు పెట్టడం నేర్చుకోవటంకన్న, మనకన్నా తక్కువ ఆదాయం వచ్చే వారిని చూసి వారిలా పొదుపు నేర్చుకుంటే జీవితంలో ఎంతో శాంతి ఉంటుంది. తృప్తి కలుగుతుంది. అలా పొదుపు చెయ్యటం వలన భవిష్యత్తును బంగారుమయం చేసుకోవచ్చు" అన్నారు. పంతులుగారి దృష్టిలో పొదుపు అంటే కడుపు మాడ్చుకుని, జీవితాన్ని కుదించుకోమని కాదు. మీకు వచ్చినదాంట్లో కనీసం నాలుగోవంతు పొదుపు చేసి, ఖర్చులను అదుపుచేయమని ఆయన సిద్ధాంతాన్ని నమ్మిన ప్రతీవారు బాగుపడ్డారు.

ఒక గాంధేయవాదిగా, రచయితగా, జర్నలిస్టుగా, డాక్టరుగా, బ్యాంకు నిర్వాహకుడుగా, సంఘ సేవకుడుగా ఆయన చేసిన సేవలు మరువలేనివి. ఆయన 1959 డిసెంబరు 17న స్వర్గస్థులయ్యారు.

బాలలూ! మరి మీరు కూడా ఈనాటి నుంచే 'పొదుపు' ప్రారంభిస్తారు కదూ. మీ పెద్దలు ఇచ్చిన డబ్బును చాక్‌లెట్లకి, ఐస్‌క్రీంలకీ, ఇతర అపరిశుభ్ర తినుబండారాలకీ వృథా చేయకుండా ఒక డబ్బాలో దాచటం ప్రారంభించండి. కొంచెం పెద్ద మొత్తం అవగానే మీ దగ్గర్లో ఉన్న ఏదో ఒక బ్యాంకు లేక పోస్టాఫీసులో ఖాతా ప్రారంభించి ఆదా చేయటం మొదలెట్టండి. అది భవిష్యత్తులో మీకెంతో సహాయపడుతుంది.

## సంగం లక్ష్మీబాయి

సాంఘిక, రాజకీయ రంగాలలో కృషిచేసి

చైతన్యాన్ని తీసుకువచ్చిన స్త్రీలలో

చెప్పుకోతగిన వ్యక్తి సంగం లక్ష్మీబాయి

ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు ప్రారంభించిన శారదానికేతన్‌లో చదువుకుని, సాంఘిక రాజకీయ రంగాలలో కృషిచేసిన స్త్రీలలో సంగం లక్ష్మీబాయమ్మ చెప్పుకోవలసిన వ్యక్తి. శారదానికేతన్‌లో ఆమె విద్వాన్ పరీక్ష పాసయ్యారు. ఆ సమయంలో దేశమంతా ఉప్పుసత్యాగ్రహ సమరంలో ఉద్రిక్తంగా ఉంది. లక్ష్మీబాయమ్మ దుర్గాబాయితో కలిసి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. పోలీసులు ఆమెను అరెస్టుచేసి రాయవెల్లూరు జైలులో నిర్బంధించారు. ఆ సమయంలో రాయవెల్లూరు జైలు జాతీయోద్యమంలో పాల్గొన్న స్త్రీలకు రాజకీయ పాఠశాల అని చెప్పొచ్చు. లక్ష్మీబాయమ్మ అక్కడి మహిళలందరిని సహవాసంతో తన రాజకీయ సాంఘిక చైతన్యానికి పదును పెట్టుకున్నారు. జైలు నుంచి విడుదలయ్యాక మళ్ళీ చదువు కొనసాగించారు. మద్రాసులో చిత్రకళలో డిప్లొమా చేశారు. హిందీ భాషలో 'సాహితి', 'విదుషి' పరీక్షలు పాసయ్యారు. కర్వే యూనివర్సిటీలో డిగ్రీ చేశారు.

హైదరాబాదులో నారాయణగారు బాలికోన్నత పాఠశాలలో బాలికల హాస్టల్‌కు వార్డెన్‌గా, నార్మల్ స్కూల్‌లో టీచరుగా పనిచేశాక లక్ష్మీబాయమ్మ రాజకీయ జీవితాన్ని ప్రధానంగా ఎంచుకుని ఆ రంగంలో కృషి ప్రారంభించారు. 1950లో హైదరాబాదు రాష్ట్రంలో శాసన సభ్యురాలుగా ఎన్నికై, బూర్గుల రామకృష్ణరావు మంత్రివర్గంలో విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఒకవైపు శాసన సభ్యురాలిగా ఉంటూనే, మలక్‌పేటలో తన ఇంట్లోనే నిరాశ్రయులైన స్త్రీలకూ, పిల్లలకూ ఉచిత భోజన వసతి కల్పించి, రక్షణ ఇచ్చి, ప్రాథమిక విద్య, చేతిపనులు నేర్పి వాళ్ళు తమకాళ్ళమీద తాము నిలబడేలా చేసేవారు. ఆ పాఠశాల క్రమంగా 'ఇందిరా సేవాసదనం'గా మారింది. తరువాత దానితో మాసెట్టి హనుమంతగుప్త బాలబాలికల ఉన్నత పాఠశాల తోడై అభివృద్ధి చెందింది. ఇందిరా సేవా సదనంలో బాలికలకు వృత్తి శిక్షణ, సంగీత, నృత్య శిక్షణతోపాటు వ్యవసాయ క్షేత్రం, పాల ఉత్పత్తి కేంద్రం, మొదలైనవన్నీ ఉన్నాయి.

కందుకూరి
వీరేశలింగం

కందుకూరి వీరేశలింగంగారు
రాజమండ్రిలో జన్మించారు.
బాల్యవివాహాలను నిరసించాడు.
వితంతు పునర్వివాహాలను జరిపించారు.
గొప్ప అభ్యుదయవాది.
సాహితీవేత్త.
సంఘసంస్కర్త.

కందుకూరి వీరేశలింగం పంతులుగారు రాజమండ్రిలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు పున్నమ్మ, సుబ్బారాయుడు గారలు. చిన్నప్పటి నుండి ఆయన చదువులో, ఆటల్లో ప్రథముడుగా ఉండేవారు. అందువల్ల ఉపాధ్యాయులు ఆయన్ను మెచ్చుకొనేవారు. తోటి విద్యార్థులు సైతం అప్పుడప్పుడూ తమకు తెలియని పాఠాలు ఆయనచేత చెప్పించుకొనేవారు.

విద్యాభ్యాసం పూర్తి ఐన తర్వాత పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేరాడు. ఆ కాలంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపుదలకు కృషిచేశాడు, స్త్రీలు చదువుకొంటేగాని సమాజం అభివృద్ధిచెందదనే భావంతో బాలికల కోసం పాఠశాలను స్థాపించాడు. విద్యార్థుల్లో ధర్మం, దయ, నీతి, పరోపకారం, చిత్తశుద్ధి, శీలం, సత్ప్రవర్తన అలవరచడానికి పాటుపడ్డాడు.

ఆ కాలంలో చదువుకొన్న వారి సంఖ్య చాలా తక్కువ. కాయకష్టంచేసి వ్యవసాయాది వృత్తులు చేసేవారే ఎక్కువ. ప్రజల్లో అమాయకత్వం కూడా ఎక్కువగా ఉండేది. అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, మత్తుపానీయాల వాడకం మొదలైన దురాచారాలు సమాజంలో భాగాలయ్యాయి. ఇలాంటి దురాచారాలనన్నిటినీ ఎదిరించి సమాజ సంస్కరణకు నడుంకట్టాడు. బాల్య వివాహాలను నిరసించాడు. ఈ బాల్య వివాహాల బారినపడి వితంతువులైన స్త్రీలకు పునర్వివాహాలు చేయించడానికి పూనుకున్నాడు.

వీరేశలింగం ఎన్నో పుస్తకాలు రాశాడు. ఆయన రాసిన పుస్తకాలలో కవుల చరిత్ర, రాజశేఖర చరిత్ర, ప్రహసనాలు మొదలైనవి ముఖ్యమైనవి.. వారు వివేకవర్ధని మొదలైన పత్రికలను కూడా నడిపాడు. ఆయన పుస్తకాలు, పత్రికలు అన్నీ సమాజంలోని దురాచారాలను ఖండించడానికీ, సంస్కరణల ప్రచారానికీ, అధిక ప్రాధాన్యం ఇచ్చాయి.

నూరు మాటలు చెప్పేకంటే ఒక మంచిపని చేసి చూపటం అధిక ప్రయోజనం కల్గిస్తుంది. అని ఆయన పదే పదే బోధించాడు. స్వయంగా ఆచరించాడు గూడా. జనుల్లో విద్య వ్యాపించాలనీ, ప్రజలు తమ హక్కులను గూర్చి తాము తెలుసుకోవాలనీ, స్వేచ్ఛగా బ్రతకాలనీ ప్రబోధించాడు. ఆయన తాను మరణించేవరకూ క్షణంగూడా కాలం వృధాచేయలేదు. తన జాతి జనులకు మేలు కలిగించే, ఉత్తేజం కలిగించే, పనులను చేస్తూనే వచ్చాడు. సంఘంలో మార్పుల కోసం కృషిచేసిన తొలినాటి మార్గదర్శకులలో వీరేశలింగం అగ్రగణ్యుడు. ఆయన కూడా అందరు సంస్కర్తల వలెనే అపార్థాలకు, అవహేళనలకు గురయ్యాడు. అయినా అన్నిటినీ ధైర్యంగా ఎదిరించి నిల్చిన మహోన్నత వ్యక్తి వీరేశలింగం పంతులుగారు. ఆయన గొప్ప అభ్యుదయవాది. సాహితీవేత్త, సంఘ సంస్కర్త. 'రావ్ బహదూర్', 'గద్య తిక్కన' అనే బిరుదులు పొందాడు. మన తెలుగువారికి ఆయన ప్రాతఃస్మరణీయుడు.

జోసెఫ్ డామియన్

(1840-1889)

బెల్జియం దేశస్థుడైన డామియన్ భగవంతుని యెడల అచంచలమైన భక్తి విశ్వాసాలతో కార్యదీక్షకి సంఘసేవా తత్పరతకి ప్రతిరూపుడైన సాహసవంతుడైన యువకుడు, జనబాహుళ్యంలో కుష్టు రోగం ప్రబలిన మొలకాయ్ దీవికి నిర్భయంగా వెళ్ళి ఆ రోగులకు అపారమైన సేవ చేసి వాళ్ళలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన త్యాగపురుషుడు.

బాలలూ! అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకోవడం, అవసరమైన సహాయం అందించడంలో అపారమైన ఆనందం ఉంది. అదొక అందమైన అనుభూతి. అనుభవించిన వారు కూడా వర్ణించలేని అద్భుత తృప్తి అది. వ్యాధిగ్రస్తులను చూసి భయపడినా, చికాకుతో చీదరించుకున్నా అది వారికి ఎంతో మనస్తాపం కలిగిస్తుంది. ముఖ్యంగా కుష్టు వ్యాధితో బాధపడుతున్న దురదృష్టవంతుల్ని మన సమాజంలో ఇప్పటికీ కొంతమంది దరిచేరనివ్వటంలేదు. వారిని చూసి భయపడి దూరంగా పోతున్నారు.

వాస్తవానికి ఆ వ్యాధి ప్రస్తుత కాలంలో ప్రమాదకరమైనది కానేకాదు. అంటువ్యాధి అసలేకాదు. అది రాకుండా నిరోధించటానికి, వచ్చినా తగ్గించడానికీ ఇప్పుడు ఎన్నో మందులొచ్చాయి. వాతావరణం, నీరు, ఇతర కాలుష్యాలవల్ల ఏర్పడే ఈ వ్యాధి ఎవరికైనా సోకినప్పుడు మనం వారిని ప్రేమతో పలకరించి, ఆప్యాయంగా కలిసినప్పుడు వారికి కలిగే ఆనందం వర్ణనాతీతం. దురదృష్టవశాత్తూ వారికి సంక్రమించిన ఆ వ్యాధిని వారు ఒక శాపంగా భావించి, వైద్యులను సంప్రదించక, ఎటువంటి చికిత్సా చేయించుకోవడం లేదు. అటువంటి వారిని అభిమానంతో పలకరించి ప్రేమాభిమానాలు పంచిపెట్టి, వారికి సేవ చేయవలసిన బాధ్యత మన అందరిమీదా ఉంది.

దాదాపు వంద సంవత్సరాల క్రితం ఈ వ్యాధి మరీ ఉధృతంగా ఉండేది. ఆ కాలంలో ఇన్ని మందులు లేవు. వ్యాధి సోకిన వారికి మరణమే శరణ్యం. అన్ని దేశాల ప్రభుత్వాలు ఈ వ్యాధి సోకినవారిని హవాయ్ దీవుల దగ్గరున్న మొలకాయ్ దీవికి పంపేవారు. అక్కడ ఉండేవారందరూ రోగులే. వారికి అక్కడ వైద్య సౌకర్యం లేదు. ఇక తిండి, బట్టల గురించి పట్టించుకునే నాథుడే లేడు. ఆ మొండి చేతులతో చేతనైంది వండుకుని తిని లేదా పస్తులుంటూ దుర్భర జీవితాన్ని గడిపేవారు. ప్రతి రోజూ కనీసం పదిమంది రోగులు మరణిస్తూండేవారు. ఆ శవాలు అలాగే కుళ్ళిపోయి, దుర్గంధంతో వాతావరణాన్ని కలుషితం చేస్తూ, వ్యాధిని మరింత వ్యాప్తి పొందించేవి.

అటువంటి తరుణంలో, బెల్జియం వాస్తవ్యుడైన జోసెఫ్ డామియన్ అనే ఆరడుగుల ఆజానుబాహుడైన అందమైన యువకుడు "కుష్టురోగుల సేవకోసం నేను మొలకాయ్ దీవికి వెళ్తాను" అని ప్రకటించడం యావత్ ప్రపంచాన్నీ ఆశ్చర్యంతో కుదిపివేసింది. ఆ దీవికి వెళ్ళి వారితో కలిసి జీవనం చేసి, వారికి ఆత్మవిశ్వాసం కలిగించాడు. ఆరోగ్య సూత్రాలను నేర్పాడు. భగవంతుడి పట్ల నమ్మకం, గురి కలిగించాడు.

అందరూ ఊహించినట్లే పన్నెండు సంవత్సరాల తరువాత అతనికీ ఆ వ్యాధి సోకింది. ఆ రోజుల్లో మందులు లేని కారణంగా, అతను నాలుగు సంవత్సరాలు ఆ వ్యాధితో బాధపడి మరణించాడు. అతనికి వ్యాధి సోకిందని తెలియగానే బెల్జియం ప్రభుత్వం, అమెరికా ప్రభుత్వం – ఎంత ఖర్చయినా చికిత్స చేయిస్తామనీ, ఆ దీవి వదిలి వచ్చేయమనీ కోరాయి. అయితే డామియన్ దానికి అంగీకరించలేదు. "నా ఒక్కడికే కాదు. ఇక్కడున్న ప్రతి వ్యక్తికీ సంపూర్ణ ఆరోగ్యం కలిగించినప్పుడే నన్ను ప్రోత్సహించండి" అని వినమ్రంగా విన్నపం చేసుకున్నాడు. అతని విన్నపాలే పరిశోధనలకు దారితీశాయి.

జోసెఫ్ డామియన్ 1840 జనవరి 3న బెల్జియం దేశంలోని లోవైన్ అనే గ్రామంలో జన్మించాడు. తండ్రి ఫ్రాంకోయిన్ మధ్య తరగతి రైతు. డామియన్‌కి చిన్నతనం నుంచి సేవాభావం మరీ ఎక్కువే. ఒకసారి ఇంటికి బిచ్చగాడు వచ్చి మూడు రోజుల్నుంచి అన్నం తినలేదని ఏడుస్తూ చెప్పాడు. అది విని తల్లడిల్లిపోయి, ఇంట్లో వండిన మొత్తం కూరను గిన్నెతో సహా అతనికి ఇచ్చేశాడు.

డామియన్ చదువుతో పాటు, కమ్మరిపని, వడ్రంగిపని కూడా నేర్చుకున్నాడు. సరదాగా నేర్చుకున్న ఆ రెండు విద్యలూ అతనికి భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడ్డాయి. మొలకాయ్ దీవిలో ఉన్నప్పుడు ఇళ్ళు కట్టడం, చర్చిలు నిర్మించడం, శవపేటికలు తయారుచేయటానికి అవి దోహదపడ్డాయి.

చదువు అనంతరం డామియన్ మతపరమైన చదువు అభ్యసించి, మత బోధకుడిగా మారాడు. వారి మతాధిపతి అతన్ని హవాయ్ దీవులలో బోధ చేయమని పంపాడు. ఆ దీవులలో కుష్టువ్యాధి తీవ్రంగా ఉండేది. ఆ వ్యాధికి ఆ రోజుల్లో మందు లేకపోవటంవల్ల, వారు మరీ వికృతంగా తయారయ్యి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేవారు. వైద్యులు కూడా వారిని తాకేవారు కాదు. కుష్టువ్యాధి పూర్వజన్మలో చేసిన పాపాలవల్ల కలుగుతుందనే మూఢనమ్మకం ప్రజల్లో తీవ్రంగా ఉండేది. ఎటువంటి మందులు కనిపెట్టడానికి సాహసించలేదు. వ్యాధి సోకిన వారు మరణించేవరకు దుర్భర వేదన అనుభవించేవారు.

నేరాలూ, హత్యలు చేసిన వారిని నిజం చెప్పించడానికి కుష్టురోగిని ఉపయోగించేవారు పోలీసులు. అతను నేరస్థుణ్ణి కౌగిలించుకుని ముద్దులు పెట్టుకోబోతుంటే, అసహ్యంతో, భయపడి నిజం చెప్పేవారు. కుష్టు రోగులు తిరిగే వీధులలో మామూలు వ్యక్తులు ఇళ్ళు కూడా ఖాళీ చేసేవారు. అటువంటి తరుణంలో ప్రభుత్వం కలగజేసుకుని వారిని మొలకాయ్ దీవికి పంపించటం ప్రారంభించింది. రోగులందరినీ అక్కడ ఉంచాలని 1873 వరకు 9,856 మందిని వరసగా పంపగా, వారిలో 8,735 మంది మరణించారు.

ఆ భయంకర పరిస్థితి గురించి తెలుసుకున్న డామియన్ ఎవరు ఎంత చెప్పినా వినక ఆ దీవికి వెళ్ళాడు.

అక్కడికి వెళ్ళిన తరువాత పరిస్థితి ఊహించిన దానికన్నా అధ్వాన్నంగా ఉంది. ఏ ఒక్కరికీ మానవాకారం లేదు. అక్కడక్కడ శవాలు కుళ్ళిపడి ఉన్నాయి. వాటిని రాబందులు పీక్కు తింటున్నాయి. డామియన్ హృదయం ద్రవించిపోయింది. తనకు వ్యాధి వచ్చినా ఫరవాలేదు. వారి జీవితాలు క్రమబద్ధం చేయాలనుకున్నాడు.

వారిని సమావేశపరచి అండగా ఉంటానని ప్రకటించాడు. మొదట్లో వారు నమ్మలేదు. కానీ రాను రాను నమ్మకం కలిగి వారు అతనితో చేయి కలిపారు. డామియన్ ప్రప్రథమంగా శ్మశానానికి ఒక స్థలం ఏర్పరచి అక్కడ శవాలను పాతిపెట్టి పని మొదలెట్టాడు. తరువాత గుడిసెల నిర్మాణం రహదారుల పరిశుభ్రత, చెట్లు నాటించడం, చర్చిల నిర్మాణం, పరిశుభ్ర ఆహారం భుజించడం, పుండ్లను కడిగి రోజూ డ్రస్సింగ్ చేయటం వంటి పనులు నేర్పాడు. అచిరకాలంలోనే వారికి ఆత్మీయుడయ్యాడు. ఆత్మబంధువయ్యాడు. పండంటి తన జీవితాన్ని పణంగా పెట్టి వారి శ్రేయస్సుకు పాటుపడ్డాడు. వారి జీవితాలను క్రమబద్ధం చేశాడు. ప్రభుత్వంతో పోరాడి. వారి చికిత్సకై పరిశోధనలు చేయించాడు. చివరకు తనకు ఆ వ్యాధి సంక్రమించినా అతను చలించలేదు. అనుకున్నది మాత్రం సాధించాడు. 1889 ఏప్రిల్ పన్నెండున స్వర్గస్థుడయ్యాడు.

బాలలూ! కుష్టు వ్యాధి భయంకరమైనది కాదు ఇప్పుడు దానికి కావలసినన్ని మందులున్నాయి. అసలు వ్యాధి రాకుండా నిరోధించే మందులు కూడా వచ్చాయి. కొంత మంది స్వచ్ఛంద సేవకులు, వైద్యశాఖ వారు పాఠశాలలకు కూడా వచ్చి పరీక్షలు చేస్తూ ఉంటారు. మీకుతెలిసిన వారెవరికైనా శరీరంపై మచ్చలు, లేదా స్పర్శ లోపించిన భాగం ఉన్నప్పుడు వారిని ఆ స్వచ్ఛంద సేవకులకు చెప్పమని చెప్పండి. అది దాచుకోకుండా వారికి తెలియజేస్తే ఆ వ్యాధిని అరికట్టవచ్చు.